# సాంఘిక శాస్త్రము

## SOCIAL SCIENCE - TELUGU MEDIUM

## ఏడవ తరగతి

## STANDARD SEVEN

### కాలావధి III

### TERM III

# 1. విజయనగర మరియు బహమనీ రాజ్యములు

## విజయనగర మరియు బహమనీ రాజ్యముల ఆవిర్భావము

మహమ్మదు బిన్ తుగ్లక్ పరిపాలనానంతరము చివరి దశకు చేరుకున్న ఢిల్లీ సుల్తానుల తరువాత ఉత్తర మరియు దక్షిణ భారతదేశములో అనేక మంది ప్రాంతీయ గవర్నర్లు మరియు సామంతులు స్వతంత్రమును ప్రకటించుకొనిరి. ఢిల్లీ పరిపాలన నుండి మొదట బెంగాల్ మరియు ముల్తాను విడిపోయినవి. గుజరాతు, మాళ్వా, మేవార్, మార్వార్ మరియు కాశ్మీరు స్వంతత్ర రాజ్యములయ్యెను.

దీని తర్వాత దక్కను మరియు దక్షిణ భారతదేశములో విజయనగర మరియు బహమనీ అను రెండు రాజ్యములు ఆవిర్భవించినవి.

## విజయనగర సామ్రాజ్యము (క్రీ.శ. 1336-1672)

హరిహర రాయలు మరియు బుక్కరాయలు హోయసాలుల రాజైన మూడవ వీరబల్లాలునికి సామంతులుగా వుండిరి. హోయసాలులు మహమ్మద్ బిన్ తుగ్లక్‌చే పతనమైన తరువాత వీరు విజయనగర పట్టణమును తుంగభద్రానది దక్షిణ తీరమున క్రీ.శ. 1336లో తమ గురువైన విద్యారణ్య స్వామి మరియు అతని సోదరుడైన శయనుడు (Sayana) సహకారంతో స్థాపించిరి. వారి రాజధాని హంపి. విజయనగర సామ్రాజ్యమును 4 ముఖ్య వంశములు పరిపాలించినవి. అవి 1. సంగమ 2. సాళువ 3. తుళువ 4. అరవీడు.

మొదట హరిహరరాయలు క్రీ.శ. 1336లో పరిపాలనకు వచ్చెను. ఇతడు మైసూరు మరియు మదురైలను వశపరచుకొనెను. ఇతని తరువాత మొదటి బుక్కరాయలు క్రీ.శ. 1356లో రాజ్యాధికారమునకు వచ్చెను. ఇతని సామ్రాజ్యము దక్షిణమున తుంగభద్రానది నుండి రామేశ్వరము వరకు వ్యాప్తి చెందెను. విజయనగర సామ్రాజ్యమును పరిపాలించిన ముఖ్య పరిపాలకులు రెండవ హరిహరరాయలు, మొదటి దేవరాయలు, రెండవ దేవరాయలు మరియు కృష్ణ దేవరాయలు.

## శ్రీకృష్ణ దేవరాయలు (క్రీ.శ. 1509-1529)

విజయనగర సామ్రాజ్య రాజులలో మిక్కిలి ప్రఖ్యాతి చెందిన రాజు శ్రీకృష్ణ దేవరాయలు. ఇతడు తుళువ వంశమునకు చెందినవాడు.



కృష్ణ దేవరాయులు

పోర్చుగీసు యాత్రికుడు అయిన డొమింగో పేస్ (Domingo Paes) "శ్రీకృష్ణదేవ రాయలు సంపూర్ణమైన రాజు" అని తెలిపెను.

## విజయములు

శ్రీకృష్ణదేవరాయలు ఒక గొప్ప యుద్ధవీరుడు. క్రీ.శ. 1510లో శివసముద్రమును, క్రీ.శ. 1512లో రాయచూర్‌ను, క్రీ.శ. 1523లో ఒరిస్సా మరియు వరంగల్లును మరియు దక్కనులో అనేక ప్రాంతములను జయించెను. ఇతని సామ్రాజ్యము ఉత్తరమున కృష్ణానది నుండి దక్షిణమున కావేరి నది

వరకు మరియు పశ్చిమమున అరేబియా సముద్రము నుండి తూర్పు బంగాళాఖాతము వరకు విస్తరించెను.

### సేవలు

శ్రీకృష్ణదేవరాయలు ఒక గొప్ప సమర్థవంతమైన పరిపాలకుడు. ఇతడు నీటిపారుదల కొరకు అనేక గొప్ప చెరువులు, కాలువలను త్రవ్వించెను. ఇతడు సముద్ర వ్యాపారముయొక్క ప్రాధాన్యతను గ్రహించి గొప్ప నౌకాదళమును అభివృద్ధి పరచెను. ఇతడు పోర్చుగీసు మరియు అరబ్బు వ్యాపారస్తులతో స్నేహ సంబంధములను నెలకొల్పి ప్రభుత్వ ఆదాయమును పెంపొందింపజేసెను.

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప విద్వాంసుడు. అష్టదిగ్గజములు అను ఎనిమిది మంది కవులు ఇతని ఆస్థానమును అలంకరించిరి. ఇతడు కళలు మరియు వాస్తుశిల్పమును పోషించెను. ఇతడు అనేక అందమైన దేవాలయములు మరియు అంత:పురములను నిర్మించెను. శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనలో విజయనగర సామ్రాజ్యము కీర్తి ప్రతిష్టలు ఉచ్ఛస్థితికి చేరుకొనెను.

**అష్టదిగ్గజములు**

| | |
|---|---|
| 1. అల్లసాని పెద్దన | 2. నంది తిమ్మన |
| 3. తెనాలి రామకృష్ణుడు | 4. భట్టు మూర్తి |
| 5. పిన వీరభద్రుడు | 6. దూర్జటి |
| 7. మల్లన | 8. పనాజి సూరన |

### తళ్ళికోట యుద్ధము (క్రీ.శ. 1565)

శ్రీకృష్ణదేవరాయలు తరువాత పరిపాలనకు వచ్చినవారు చాలా బలహీనులు. రామరాయల కాలములో అహమ్మద్‌నగర్, బీజాపూర్, గోల్కొండ మరియు బీదర్‌ల సమైక్య సైన్యము విజయనగరముపై యుద్ధమును ప్రకటించిరి. క్రీ.శ. 1565లో తళ్ళికోట యుద్ధములో రామరాయలు ఓడించబడెను. అతనిని, అతని ప్రజలను క్రూరముగా చంపివేసిరి. విజయనరమును కొల్లగొట్టి నాశనము చేసి శిథిలములను మాత్రమే మిగిల్చి వెళ్ళిరి.

## విజయనగర సామ్రాజ్య వైభవము

### పరిపాలన

విజయనగర పాలకులు ఒక నిర్దిష్ట పరిపాలనా పద్ధతిని ఏర్పరిచిరి. రాజు సర్వాధికారి. రాజు రాజ్యములో అన్ని అధికారములను తన ఆధీనములోనే వుంచుకొనెను. పరిపాలనా విషయములలో రాజునకు సహాయమందించుటకు మంత్రిపరిషత్తు ఉండెను.

సామ్రాజ్యము 6 రాష్ట్రములుగా విభజింపబడి యుండెను. ఒక్కొక్క రాష్ట్రము నాయక్ అని పిలువబడు గవర్నరు ఆధీనంలో యుండెను. రాష్ట్రములు జిల్లాలుగా విభజించబడెను. జిల్లాలు మరలా చిన్న విభాగములైన గ్రామాలుగా విభజింపబడెను. గ్రామ పరిపాలనా విషయములను వంశపారంపర్యముగా వచ్చుచున్న గ్రామ సభల అధికారులైన జమాఖర్చులను లెక్కించువారు, తూకములు వేయువారు, కాపలాదారులు మరియు నిర్బంధ కూలీలను పర్యవేక్షించు అధికారులు కొనసాగించెడివారు. కేంద్రప్రభుత్వ పరిపాలన మహానాయకాచార్య అని పిలువబడు అధికారిచే గ్రామములను అనుసంధానపరచి నిర్వహించబడినది.

### సైన్యము

సైన్యము నందు కాల్బలము, అశ్వదళము మరియు గజదళము వుండెను. సైన్యాధిపతి సైన్యమంతటికి నేతృత్వము వహించుచుండెను.

### రెవెన్యూ పాలన

భూమి శిస్తు రాజ్యమునకు ముఖ్యమైన ఆదాయము. భూమిని జాగ్రత్తగా సర్వే చేయించి భూసారమును బట్టి పన్నులను వసూలు చేసెడివారు. వ్యవసాయమునందు, ఆనకట్టలు మరియు కాలువల నిర్మాణమునందు మిక్కిలి శ్రద్ధచూపబడెను.

### న్యాయ పరిపాలన

రాజు ఉన్నత న్యాయాధికారి. పౌర సంబంధమైన వ్యాజ్యములు హిందూ చట్టము ప్రకారము విచారించబడినవి. నేరస్తులకు కఠిన శిక్షలు విధించబడెను. చట్టమును అతిక్రమించిన వారిపై జరిమానా విధించబడెను.

## స్త్రీల స్థానము

స్త్రీలు ఉన్నతస్థానమును వహించి రాజకీయ, సాంఘిక మరియు సాహిత్య రంగములలో ప్రముఖ పాత్రను పోషించిరి. స్త్రీలు విద్యావంతులుగాను మరియు మల్లయుద్ధములలో శిక్షణ పొంది తమను తాము రక్షించుకొనుటకు మరియు ఎదుర్కొనుటకు ఆయుధములను ఉపయోగించుటను తెలిసియుండిరి. సంగీతము మరియు లలిత కళలయందు కూడ మిక్కిలి నేర్పరులుగా యుండిరి. కొందరు స్త్రీలు ఉన్నత విద్యను అభ్యసించియుండిరి. న్యూనిజ్ (Nuniz) అను చరిత్రకారుడు రాజ్యములో మహిళా జ్యోతిష్కులు, గుమాస్తాలు, జమాఖర్చులు వ్రాయువారు, అంగరక్షకులు, మల్లయుద్ధవీరులు యుండెరని తెలిపియున్నాడు.

## సామాజిక జీవనము

విదేశీ యాత్రికుల రచనల ద్వారా మనము విజయనగర సామ్రాజ్య ప్రజల జీవన విధానమును గూర్చి చక్కగా తెలుసుకొనవచ్చును. సమాజము చక్కగా ఏర్పరచబడియుండెను. బాల్య వివాహములు, బహుభార్యత్వము, సతీసహగమనము వంటి దురాచారములు ఆచరణలోనుండినవి. రాజులు ప్రజలకు మత స్వాతంత్ర్యమును ఇచ్చిరి.

## ఆర్థిక పరిస్థితులు

విజయనగర సామ్రాజ్యము మిక్కిలి సిరిసంపదలను కలిగి అభివృద్ధి చెందిన రాజ్యముగా నుండెను. వారి నీటిపారుదల విధానము వలన వ్యవసాయ ఉత్పత్తులు ఎక్కువ అభివృద్ధిని సాధించినవి. వస్త్ర పరిశ్రమ, గనులు, ఖనిజ సంగ్రహణ మరియు సుగంధ ద్రవ్యములు వంటి అనేక పరిశ్రమలు వెలసియుండెను. వీరు హిందూ మహాసముద్ర దీవులతోను, మలయా దీవులతోను, బర్మా, చైనా, అరేబియా, పర్షియా, దక్షిణాఫ్రికా, అబిసీనియా మరియు పోర్చుగల్ దేశములతో వ్యాపార సంబంధములను కలిగియుండిరి.

వీరు సుగంధ ద్రవ్యములు, పప్పు దినుసులు, ప్రత్తి, పట్టు, నల్లమందు, నీలిమందు, సముద్రపు ముత్యములు, కుంకుమ పువ్వు, అల్లము, చక్కెర, కొబ్బరి మొదలగు వస్తువులను ఎగుమతి చేసిరి. గుఱ్ఱములు, ఏనుగులు, రాగి, పాదరసము, చైనా పట్టు, వెల్‌వెట్ వస్త్రములను దిగుమతి చేసుకొనిరి. గోవా, డయ్యూ, కొచ్చిన్ మరియు క్విలాన్ (Quilon) ముఖ్య రేవు పట్టణములు. వీటిద్వారా భారతదేశ పశ్చిమ సముద్రతీర ప్రాంతములలో చురుకైన వర్తకము జరుగుచుండెడిది.

## వాస్తుశిల్పం మరియు సాహిత్యమునకు చేసిన సేవలు


విజయనగర పాలకులు గొప్పకళా మరియు భాషాపోషకులు. హజరా రామస్వామి దేవాలయము, విఠలస్వామి దేవాలయములు వీరికాలము నాటి గొప్ప శిల్పకళకు నిదర్శనములు. శ్రీకృష్ణదేవరాయల కంచు విగ్రహము గొప్ప మెచ్చుతునక. అనేకమంది పండితులు విజయనగర రాజులచే పోషించబడిరి. సంస్కృతము, తమిళము, తెలుగు మరియు కన్నడ సాహిత్యములు మంచి పురోగతిని పొందినవి. శయనుడు వేదములపై వ్యాఖ్యలను రచించెను. కృష్ణదేవరాయలు తెలుగులో ఆముక్తమాల్యదను రచించెను. ఉషాపరిణయము మరియు జాంబవతి కళ్యాణము అతని సంస్కృత కావ్యములు.



విఠలస్వామి దేవాలయము

విఠలస్వామి దేవాలయము కృష్ణదేవరాయ పరిపాలనలో నిర్మించబడినది. ఈ దేవాలయము యొక్క

## బహమనీ మరియు విజయనగర సామ్రాజ్యము



ముందు భాగములో ఒకేరాతితో చెక్కబడిన రథము ఒకటి కలదు. ఈ దేవాలయము యొక్క స్థంభములను తట్టిన సంగీతము వచ్చుట దీని ప్రత్యేక అంశమగును. ఈ స్థంభములను సంగీత స్థంభములు లేక సరిగమ స్థంభములని పిలువబడుచున్నది.

## విజయనగర సామ్రాజ్య పతనము

అరవీడు వంశ పాలకులు బలహీనులు మరియు అసమర్థులు వీరి బలహీనతను గమనించి రాష్ట్ర గవర్నరులు స్వతంత్రులైరి.

బీజాపూర్ మరియు గోల్కొండ పాలకులు విజయనగర సామ్రాజ్యములో కొన్ని ప్రాంతములను ఆక్రమించిరి. దక్షిణమున నాయకులు స్వతంత్రులైరి. ఆవిధముగా క్రీ.శ. 1614నాటికి విజయనగర పాలన అంతమయ్యెను.

## బహమనీ రాజ్యము (క్రీ.శ. 1347-1526 )

దక్కను నందు వెలసిన మిక్కిలి శక్తివంతమైన మహమ్మదీయ రాజ్యము బహమనీ సామ్రాజ్యము. ఇది క్రీ.శ. 1347 సం॥న ఆవిర్భవించి క్రీ.శ. 1526 వరకు అధికారములో యుండెను.

## రాజకీయ చరిత్ర

ఈ వంశ స్థాపకుడు హసన్ గంగు బహమని. ఇతడు దేవగిరికి చెందిన తురుష్క అధికారి. క్రీ.శ. 1347లో ఇతడు స్వతంత్ర బహమని రాజ్యమును స్థాపించెను. ఇతడు ఈశాన్యమున మహూర్ నుండి దక్షిణ భారతదేశమున తెలంగాణా వరకు అన్ని ప్రాంతములను వశపరచుకొనెను. ఇతడు వరంగల్ పాలకుడైన హిందూ రాజును జయించి కొల్హాపూరు, గోవా, మాండు మరియు మాళ్వా ప్రాంతములను ఆక్రమించెను. ఆవిధముగా అతని సామ్రాజ్యము గుల్బర్గాను రాజధానిగా చేసుకొని అరేబియా సముద్రము నుండి బంగాళాఖాతము వరకు వ్యాపించెను. దక్కను పూర్తిగా కృష్ణానది వరకు అతని రాజ్యమునందు చేరియుండెను.

మొదటి మహమ్మద్ షా (క్రీ.శ. 1358-1377) తరువాతి పాలకుడు. మొదటి మహమ్మద్ షా సమర్థుడైన సైనికాధికారి మరియు పరిపాలనాదక్షుడు. ఇతడు విజయనగర పాలకుడైన మొదటి బుక్కరాయలను, ఓరగల్లును పరిపాలించిన కాపయ నాయకులను ఓడించెను.

రెండవ మహమ్మద్ షా (క్రీ.శ. 1378-1397) క్రీ.శ. 1378లో సింహాసనమధిష్టించెను. ఇతడు శాంతి ప్రియుడు మరియు ఇరుగు పొరుగు రాజులతో స్నేహ సంబంధములను మెరుగుపరచుకొనెను. ఇతడు అనేక మసీదులను, మదరసాలు (విద్యాలయాలు)లను మరియు వైద్యశాలలను నిర్మించెను.

రెండవ మహమ్మద్ షా మరణానంతరము ఫిరోజ్ షా బహమని (క్రీ.శ. 1397-1422) పాలకుడయ్యెను. ఇతడు ఒక గొప్ప సైనికాధికారి. ఇతడు విజయనగర పాలకుడైన మొదటి దేవరాయలను ఓడించెను. ఇతడు అనేక మంది హిందువులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించెను. ఇతని పరిపాలన అంతమగు సమయమున ఉత్తర మరియు దక్షిణ ప్రాంతములు విజయనగర రాజుల వశమయ్యెను.

అహమ్మద్ షా (క్రీ.శ. 1422-1435), ఫిరోజ్ షా బహమని తరువాత పరిపాలనకు వచ్చెను. ఇతడు క్రూరమైన మరియు దయలేని పాలకుడు. ఇతడు వరంగల్ రాజ్యమును జయించి రాజధానిని గుల్బర్గా నుండి బీదర్‌కు మార్చెను. ఇతడు క్రీ.శ. 1435లో మరణించెను.

మూడవ మహమ్మద్ షా (క్రీ.శ. 1463-1482) మరొక పేర్కొనదగిన బహమనీ పాలకుడు. ఇతడు క్రీ.శ. 1463లో తన తొమ్మిదవ ఏట సుల్తాను అయ్యెను. మహమ్మద్ గవాన్ మూడవ మహమ్మద్ షాకు సంరక్షకుడుగా నుండెను. ఇతని సమర్థవంతమైన నాయకత్వము వలన బహమనీ

సామ్రాజ్యము శక్తివంతమయ్యెను. మహమ్మద్ గవాన్ కొంకణ, సంగమేశ్వర, ఒరిస్సా మరియు విజయనగర పాలకులను ఓడించెను. ఇతని పరిపాలనా కాలములో బహమని సామ్రాజ్యము ఒక సముద్ర తీరము నుండి మరొక సముద్రతీరము వరకును మరియు తపతి నది నుండి తుంగభద్రా నది వరకు విస్తరించెను.

### మహమ్మద్ గవాన్

ఇతడు వివేకము గల పండితుడు మరియు గొప్ప పరిపాలనాదక్షుడు. ఇతడు పరిపాలనను మెరుగువరచి ప్రభుత్వ ఆదాయమును క్రమబద్ధీకరించెను. ప్రజావిద్యను ప్రోత్సహించెను. రెవెన్యూ విధానమును సంస్కరించెను. సైన్యమును క్రమశిక్షణలో నుంచెను మరియు లంచగొండి తనమును రూపుమాపెను.


ఇతడు దక్కను ముస్లింల ఈర్ష్యకు బలి అయ్యెను. వారు ఇతనిపై నేరము మోపిరి. ఇతనిని విచారించిన పిదప క్రీ.శ. 1481న మూడవ మహమ్మద్ షా ఇతనికి మరణశిక్ష విధించెను.

## ఐదు మహమ్మదీయ రాజ్యములు

క్రీ.శ. 1482లో మూడవ మహమ్మద్ షా మరణించెను. ఇతని వారసులు బలహీనులు. కావున బహమనీ సామ్రాజ్యము బీజాపూర్, అహమ్మద్ నగర్, బీరర్, గొల్కొండ మరియు బీదర్ అను ఐదు చిన్న చిన్న రాజ్యములుగా విడిపోయినది.

## పరిపాలన

సుల్తానులు భూస్వామ్య పద్ధతిలో పరిపాలనను అనుసరించిరి. రాజ్యము తరఫ్‌లు అనబడు అనేక రాష్ట్రములుగా విభజింపబడినది. ప్రతి తరఫ్, తరఫ్‌దార్ (లేక) అమీర్ అని పిలువబడు గవర్నరు ఆధీనంలో ఉండును. గవర్నర్లు శక్తివంతులై, రాజునకు యుద్ధ సమయములో సైన్యమును మరియు ఆయుధములను సరఫరా చేసెడివారు.



గోల్‌గుంబజ్

### గోల్‌గుంబజ్

బీజాపూర్‌లో యున్న గోల్‌గుంబజ్‌ను రహస్య శబ్దపుశాల అని పిలుతురు. ఎందువలననగా ఆ కట్టడమునందు ఎవరైనా ఒక మూల ఒక చిన్న శబ్దము చేసిన దాని యొక్క ప్రతిధ్వని ఎదురుగా యున్న మూల వద్ద ప్రతిధ్వనించును.

## విద్య, కళ మరియు వాస్తు కళకు చేసిన సేవలు

సుల్తానులు విద్యయందు ప్రత్యేక శ్రద్ధను చూపిరి. వీరు అరబిక్ మరియు పర్షియా భాషలనూ ప్రోత్సహించిరి. వీరికాలములో ఉర్దూ భాష కూడు అభివృద్ధి చెందినది. అనేక మసీదులు, మదరసాలు (విద్యాలయాలు) మరియు గ్రంథాలయాలు, నిర్మించబడెను. గుల్బర్గాలోని జుమ్మా మసీదు, గోల్కొండ కోట, బీజాపూరునందలి గోల్‌గుంబజ్ మరియు మహమ్మద్ గవాన్ నిర్మించిన మదరసా సుల్తానుల ప్రఖ్యాతిగాంచిన జ్ఞాపక చిహ్నములు.



గోల్కొండ కోట

సాంఘిక శాస్త్రము

**గొల్కొండ కోట**

గొల్కొండ కోట మిక్కిలి ప్రఖ్యాతి గాంచినది. ఈ కోట ముఖద్వారమున చేతులతో తట్టిన వచ్చు ధ్వని ఈ కోట పైభాగము వరకు స్పష్టముగా వినిపించుట దీని ప్రత్యేకత.

## బహమనీ సామ్రాజ్య పతనము

బహమనీ సామ్రాజ్య పతనమునకు అనేక కారణములు గలవు. బహమనీ మరియు విజయనగర పాలకుల మధ్య ఏర్పడిన నిరంతర యుద్ధములు మరియు మూడవ మహమ్మద్ షా తరువాత వచ్చిన అసమర్థ మరియు బలహీనమైన వారసులు, బహమనీ పాలకులకు మరియు విదేశీ ప్రభువులకు మధ్య ఏర్పడిన శత్రుత్వము బహమనీ సామ్రాజ్య పతనమునకు కొన్ని ముఖ్య కారణములు.

## అభ్యాసం

**I) సరియైన సమాధానములు ఎన్నుకొని వ్రాయుము.**

1. విజయనగర సామ్రాజ్యము స్థాపించబడిన సం॥ము ____________.
   ఎ) క్రీ.శ.1337 బి) క్రీ.శ.1336 సి) క్రీ.శ.1338
2. హరిహర మరియు బుక్క సహోదరులు హోయసల రాజైన ____________ వద్ద పనిచేసిరి.
   ఎ) మూడవ వీరబల్లాలుడు బి) రెండవ నరసింహుడు సి) నాల్గవ బిల్లమ
3. విజయనగర సామ్రాజ్యమును పరిపాలించిన ప్రఖ్యాతి గాంచిన రాజు ____________.
   ఎ) హరిహరరాయలు బి) బుక్కరాయలు సి) కృష్ణదేవరాయలు
4. క్రీ.శ. 1347 సం॥ము దక్కనులో ఏర్పడిన ప్రఖ్యాతి చెందిన మహమ్మదీయ రాజ్యము ____________.
   ఎ) బానిస వంశము బి) విజయనగర సి) బహమని
5. మహమ్మద్ గవాన్ ____________ కు సంరక్షకుడుగా నుండెను.
   ఎ) మూడవ మహమ్మద్ షా బి) హసన్ గంగు సి) అహమ్మద్ షా

**II) ఖాళీలను పూరింపుము.**

1. కృష్ణదేవరాయ ఆస్థానమందు అలంకరించి యుండిన ఎనిమది మంది విద్వాంసులను ____________ అని పిలిచిరి.
2. విజయనగర సామ్రాజ్యము ____________ పరిపాలన కాలములో శిఖరాగ్రమును చేరుకొనినది.
3. రామరాయలు ____________ యుద్ధము నందు ఓడించబడి చంపబడెను.
4. బహమనీ సామ్రాజ్యము ____________ చే స్థాపించబడెను.
5. బహమనీ సుల్తానులు అరబిక్ మరియు ____________ భాషలను ప్రోత్సహించిరి.

## III) జతపరచుము.

| | |
|---|---|
| 1. విజయనగరము | బీజాపూర్ |
| 2. తళ్ళికోట యుద్ధము | ఉషాపరిణయము |
| 3. కృష్ణదేవరాయలు | గుల్బర్గా |
| 4. జుమ్మా మసీదు | తుంగభద్ర |
| 5. గోల్‌గుంబజ్ | క్రీ.శ. 1565 |

## IV) క్లుప్తముగా సమాధానములిమ్ము.

1. విజయనగర సామ్రాజ్యము పతనము చెందుటకు గల కారణములు ఏవి?
2. విజయనగర సామ్రాజ్యమును పరిపాలించిన ముఖ్య పరిపాలకులెవరు?
3. తళ్ళికోట యద్ధమును గూర్చి సంగ్రహముగా వ్రాయుము.
4. బహమనీ సామ్రాజ్యము ఎప్పుడు మరియు ఎవరిచే స్థాపించబడెను?
5. దక్కనులో బహమనీ సామ్రాజ్య చివరి దశలో పరిపాలనకు వచ్చిన ఐదు మహమ్మదీయ రాజ్యములు ఏవి?

## V) విపులముగా సమాధానములిమ్ము.

1. విజయనగర సామ్రాజ్యము యొక్క కీర్తి ప్రతిష్ఠలను గూర్చి విపులముగా వ్రాయుము.
2. బహమనీ సామ్రాజ్యపు రాజకీయ చరిత్రను గూర్చి వివరింపుము.

## రూపక నిర్ధారణ

### 1. పోల్చి చూడుము:

విజయనగర సామ్రాజ్య గ్రామ పరిపాలనతో ప్రస్తుత తమిళనాడు గ్రామ పరిపాలన వ్యవస్థను పోల్చి చూడుము.

### 2. ఉత్తమ ప్రతిభా ప్రదర్శన:

అష్ట దిగ్గజములలో ఒకరైన తెనాలి రామకృష్ణుని తెలివి తేటలను నిరూపించే కథను వినిపించుము.

### 3. చర్చించుము:

"కృష్ణదేవరాయలు గొప్ప దైవభీతి మరియు నిజాయితీ గల రాజు" అని డొమింగో పేస్ వర్ణించెను. అతడు ఎందులకు అట్లు చెప్పెనో చర్చించుము.

### 4. తీర్మానించుము:

విద్యా యాత్ర చేయుటకు ఏది ఉత్తమమైన ప్రదేశము – విజయనగర సామ్రాజ్యమా లేక బహమనీ సామ్రాజ్యమా – సామూహిక చర్చ చేపట్టుము. విద్యార్థి సమూహములో ఏ గ్రూపు దేనిపై ఎక్కువ ఆసక్తిని కనబరచెను? ఎందులకు?

### 5. దృష్టిని కేంద్రీకరించుము:

విజయనగర సామ్రాజ్యములో ఉన్నత స్థానాన్ని అధిష్టించిన మహిళలను గుర్తించుము. ప్రస్తుతము ఉన్నత స్థానాలలో ఉన్న కొందరి మహిళల పేర్లను వ్రాయుము.

1. రాజకీయ 2. సామాజిక 3. క్రీడలు

### 6. చేయవలసిన పనులు:

i. విజయనగర మరియు బహమనీ సామ్రాజ్య కాలంనాటి కళలు మరియు వాస్తుశిల్పమునకు సంబంధించిన చిత్రములను సేకరించి ఒక ఆల్బమ్‌ను తయారుచేయుము.

ii. భారతదేశ పటమునందు క్రింది ప్రాంతములను గుర్తించుము.

1. బీరర్
2. బీదర్
3. గోల్కొండ
4. అహమ్మద్‌నగర్
5. విజయనగరము

సాంఘిక శాస్త్రము

# 2. భక్తి మరియు సూఫీ ఉద్యమములు

మధ్యయుగమందు భారతదేశమున ఆవిర్భవించిన భక్తి ఉద్యమము దేశమంతటా వ్యాప్తిచెంది కొన్ని శతాబ్దములపాటు నిలచియుండెను. భక్తి ఉద్యమ సన్యాసులు భక్తి లేక దేవునిపైన విశ్వాసము అనునది మోక్షమును పొందుటకు సరియైన సాధనములని నొక్కి వక్కాణించిరి. ఈ ఉద్యమము యొక్క ముఖ్య ఉద్దేశ్యములు హిందు మతమును సంస్కరించుట మరియు హిందు - మహమ్మదీయుల మధ్య స్నేహ సంబంధములను పెంపొందించుట. ఈ ఉద్యమ ప్రబోధకులు వివిధ ప్రాంతములకు మరియు వివిధ కాలములకు చెందినవారు.

## దక్షిణ భారతదేశములో భక్తి ఉద్యమము

దక్షిణ భారతదేశమును పరిపాలించిన ప్రాచీన పల్లవ, చోళ మరియు పాండ్యుల కాలములో నాయన్మారులు మరియు ఆళ్వారులచే శైవమతము మరియు వైష్ణవ మతము భక్తి ఉద్యమము ద్వారా పునరుద్ధరించబడి గొప్ప ప్రేరణను పొందినవి.

**భక్తి ఉద్యమమును గూర్చి ఒక ప్రసిద్ధి చెందిన కీర్తన ఈ విధముగా తెలియచెప్పుచున్నది.**

భక్తి ఉద్యమము మొదట దక్షిణ భారతదేశములో ఆవిర్భవించినది. రామానందుడు దానిని ఉత్తర భారతదేశమంతటా వ్యాపింపచేసెను. కబీరు ఈ ఉద్యమమును ప్రజలలో ప్రాచుర్యము పొందునట్లు చేసెను.

## నాయన్మారులు

63 మంది నాయన్మారులు శివుని మరియు శక్తి యొక్క మహిమలను ప్రచారము గావించిరి. వీరిలో అప్పర్, సుందర్, తిరుజ్ఞాన సంబంధర్ మరియు మాణిక్య వాచగర్ ప్రసిద్ధి గాంచినవారు.

అప్పర్ క్రీ.శ. 600లో దక్షిణ ఆర్కాడు జిల్లాలో జన్మించెను. ప్రారంభమున ఇతడు జైనమత అనుచరుడు. తన సహోదరియైన తిలకవతి గారి ప్రాబల్యముచే శివభక్తుడిగా మారెను. ఇతడు 49,000 కీర్తనలను (10 పద్య భాగములు) రచించెనని చెప్పబడుచున్నది. వాటిలో 311 మాత్రమే మనకు లభ్యమై యున్నవి.

భగవంతుడు ఒక్కడే అను భావమును మాణిక్యవాచగర్ తెలిపెను. భగవంతుని చేరుటకు ప్రేమయే కాని ఆచారములు కావని ఇతని ఉపదేశము. ఇతని రచనలకు 'తిరువాచగం' అనిపేరు.

సంబంధర్ 16,000 భక్తి కీర్తనలను పాడెను. కాని అందులో 384 కీర్తనలు మాత్రమే మనకు లభించియున్నవి.

సుందరమూర్తి నాయనార్ 8వ శతాబ్దపు చివరిభాగమున ఆర్కాడు జిల్లాలో జన్మించెను. ఇతడు 38,000 కీర్తనలను రచించెను. వాటిలో 100 కీర్తనలు మాత్రమే అందుబాటులో కలవు.

భక్తి ఉద్యమ కాలములో వ్రాయబడిన ప్రఖ్యాతి పొందిన గ్రంథములలో సెక్కిళార్‌చే రచించబడిన పెరియ పురాణము (నాయన్మారుల జీవిత చరిత్ర) తేవారమ్ (కీర్తనల సమ్మేళనము) మరియు తిరువాచగం ముఖ్యమైనవి. ఈ కీర్తనలు గొప్ప భక్తిరస, తాత్త్విక మరియు సాహిత్య గ్రంథములు.

## ఆళ్వారులు

మహావిష్ణువు యొక్క మహిమలను గూర్చి ప్రబోధించి పాడినవారు ఆళ్వారులు. వీరు 12 మంది. ఆళ్వారులలో నమ్మాళ్వార్, పెరియాళ్వార్ మరియు ఆండాళ్ ప్రసిద్ధి గాంచినవారు. ఆళ్వారులచే పాడబడిన 4000 కీర్తనలను 'నాలాయిర దివ్య ప్రబంధము' అనుపేరున నాదముని రచించెను.

## ప్రాచీన భక్తి ఉద్యమ చరిత్ర

భక్తి ఉద్యమ మొదట ప్రారంభకర్త శంకరాచార్యుడు. ఇతడు కేరళలోని కాలడి అను స్థలము నందు జన్మించెను. ఇతడు అద్వైత సిద్ధాంతము లేక భగవంతుడు ఒక్కడే అను సిద్ధాంతమును ప్రబోధించెను. ఇతడు బ్రహ్మ లేక ఉన్నతమైన ఆత్మయే నిజమైనదని తెలిపెను. శంకరాచార్యుడు తన అనుచరులకు సత్యమును ప్రేమించుట, జ్ఞానమును గౌరవించుట, జీవిత లక్ష్యములను తెలుసుకొనుట గూర్చి బోధించెను.

## భక్తి ఉద్యమమును వ్యాపింప చేసినవారు

ఈ ఉద్యమ ప్రచారకులలో రామానుజులు పేర్కొనదగినవారు. ఇతడు చెన్నై సమీపమందలి శ్రీ పెరుంబుదూరునందు జన్మించెను.



రామానుజులు

ఇతడు 12వ శతాబ్దములో జీవించిన గొప్ప వైష్ణవ మత నాయకుడు. దైవభక్తియే మోక్షమునకు మార్గమని ఇతడు బోధించెను. ఇతడు ఐదుగు వర్గాల వారిని వైష్ణవ మతమునకు ఆహ్వానించెను.

రామానందుడు రామానుజుని శిష్యుడు. ఇతడు దేవుడు కలడని నమ్మెను. ఇతడు మానవజాతిని ఒక పెద్ద కుటుంబముగా భావించి వారందరిని సోదర సోదరీమణులుగా భావించెను. ఇతని శిష్యులు అన్ని మతములకు మరియు అన్ని కులములకు చెందియుండిరి. ఇతడు ప్రజల వాడుకభాషలో బోధించుటను ప్రారంభించెను.

వల్లభాచార్య (క్రీ.శ. 1479 – 1531) శ్రీకృష్ణుని భక్తుడు. ఇతడు భక్తి ద్వారా మోక్షమును పొందవచ్చునని బోధించెను.

బసవుడు వీర శైవమతమును స్థాపించెను. ఇతని అనుచరులు వీరశైవులు లేక లింగాయతులుగా పిలువబడిరి. వీరు జాతి వివక్ష భావమును మరియు పున:జన్మ సిద్ధాంతమును వ్యతిరేకించిరి.

## ఉత్తర భారతదేశము - భక్తి ఉద్యమము



చైతన్యుడు

చైతన్యుడు బెంగాల్ నందు క్రీ.శ. 1485 నందు జన్మించెను. ఇతడు శ్రీకృష్ణుని భక్తుడు. ఇతడు కృష్ణభక్తిని ప్రచారము గావించెను. ప్రేమ మరియు భక్తి ద్వారా ఒక వ్యక్తి దేవుని ఉనికిని గుర్తించవచ్చునని నమ్మెను.

కబీర్ (క్రీ.శ. 1425 – 1518) రామానందుని ముఖ్య శిష్యుడు. కబీర్ హిందూ ముస్లిముల ఐక్యతను బోధించిన మొట్టమొదటి అంతరార్థముగల సన్యాసి. అధ్యాత్మిక సన్యాసులలో ఇతడు గొప్పవాడు. ఇతని అనుచరులు కబీర్ పంథీస్ అని పిలువబడిరి. ఇతని యొక్క బోధనలను బిజాఖా(Bijaka) అను కావ్యముగా పిలుతురు. ఇతని కీర్తనలైన దోహాలు(Dohas) ప్రజలయందు ప్రబలమయ్యెను. ఇతడు రామ్ – రహీమ్‌లు ఇద్దరు కూడా ఒక్కటే అని ప్రబోధించెను. ఇతడు విగ్రహారాధన మరియు కులతత్వమును ఖండించెను.

### కబీరు – అతని కీర్తనలు

ఓ సేవకుడా! నీవు నన్ను ఎచ్చట వెదకు చున్నావు?
నేను ఎల్లప్పుడు నీ ప్రక్కనే యున్నాను.
నేను గుడిలో లేను, మసీదులో లేను
నేను కాబాలో లేను, కైలాసములో లేను
నేను ఆచార కాండలో గాని లేదా మతాచారములోను లేను

నేను యోగాలో లేను మరియు పరిత్యాగము నందు లేను
నిజముగా నీవు నన్ను చూడదలచుకుంటే క్షణములో నన్ను గుర్తించగలవు
నీవు క్షణకాలములో కలువగలవు
కబీరు బోధన : ఓ సాధు! భగవంతుడే అన్ని జీవుల యందు శ్వాసయైయున్నాడు.



కబీర్

## గురునానక్ (క్రీ.శ. 1469-1538)

భక్తి ఉద్యమమునందు సిక్కు మత స్థాపకుడైన గురునానక్ ప్రసిద్ధి చెందిన మరియొక బోధకుడు. ఇతడు కబీరు యొక్క అనుచరుడు.



గురునానక్

ఇతడు క్రీ.శ. 1469లో లాహోరు సమీపమున తల్వాడి అను స్థలములో జన్మించెను. ఇతడు భగవంతుడొక్కడే. హిందూ ముస్లిం లు సోదర భావముతో మెలగవలెనని బోధించెను. ఇతడు సత్యము, నిజాయితీ, దయాగుణములను ప్రోత్సహించెను. మత సంబంధమైన మూఢనమ్మకములను, విగ్రహారాధనలను ఖండించెను.

## మీరాబాయి



మీరాబాయి

భక్తి ఉద్యమ సన్యాసియైన మీరాబాయి క్రీ.శ. 1498లో జన్మించెను. ఈమె మేవారు పాలకుడైన రాథోర్ (Rathor) రత్నసింగ్ యొక్క కుమార్తె మరియు ఉదయపూర్ పాలకుని యొక్క భార్య. ఈమె శ్రీకృష్ణుని భక్తురాలు. రాజస్థాన్‌లోని భజనలకు ఈమె పేరెన్నిక గాంచినది. మేవార్ రాజధాని అయిన చిత్తూరులో మీరాబాయి కొరకు అతిపెద్ద దేవాలయము కట్టబడియున్నది.

## మహారాష్ట్ర మత బోధకులు

ఈకాలములో అనేక సన్యాసులు మహారాష్ట్ర ప్రాంతములో ఉద్భవించిరి. వీరిలో జ్ఞానదేవుడు, నామదేవుడు, ఏకనాథ్, తుకారామ్, తులసీదాస్ మరియు రామదాసు ముఖ్యులు. జ్ఞానదేవుడు భగవద్గీతపై రచించిన వ్యాఖ్యానము జ్ఞానేశ్వరీగా పిలువబడెను. భారతదేశములో చోకమేల (Chokamela) మొట్టమొదటి దళిత రచయిత్రి. ఏకనాథుడు జాతి వివక్షతను ఖండించెను.

గురురామదాస్‌చే రచించబడిన గ్రంథము దాసబోధ (Dasabodha). రామచరిత మానస్ అను గ్రంథమును తులసీదాస్ రచించెను.

## సూఫీ ఉద్యమము

పర్షియాలో ప్రారంభమయిన ఇస్లాం మత సంస్కరణ ఉద్యమము భారతదేశములో క్రీ.పూ.12వ శతాబ్దముతో ప్రసిద్ధి చెందెను. ఈ ఉద్యమ అనుచరులను సూఫీలని పిలువబడిరి.

సూఫీ ఉద్యమము ఖలీఫాల ప్రవర్తనను ఖండించినది. రాజకీయము, తత్వము, ఉల్లాసము

నిచ్చు వస్తువులను ఉపయోగించు కొను ఖలీఫాలుల ప్రవర్తనలను ఎదిరించినది. మహమ్మద్ ప్రవక్త నిజాయితీ పరుడు. ఇతని సిద్ధాంతములు సంపూర్ణమైనదని సూఫీ ఉద్యమము భావించినది. మరియు జ్ఞానము, ప్రేమ మరియు భక్తి వలన మాత్రమే భగవంతున్ని చేరవచ్చునని బోధించినది. సాంప్రదాయములను వ్యతిరేకించుటతోపాటు సహనమును బోధించినది. సూఫీ ఉద్యమకారులు తమను అనేక సమూహాములుగా విభజించుకొనిరి. సమూహము యొక్క నాయకుడు షేక్ (అరబిక్ భాషలో) పీర్ లేక ముర్షీద్ (పర్షియన్ భాషలో) అని పిలువబడెను. ఈ సమూహములు 12 తరగతులుగా వ్యవహరించిరి. వీరినే సిల్‌సిల్లాస్ అని పిలువబడిరి. సిల్‌సిల్లా అనగా గురువు మరియు శిష్యులకు మధ్యగల ఎడతెగని బంధమగును. చిష్టి సిల్లా సమూహము క్రమమైనది. భారతదేశములో అత్యధిక ప్రఖ్యాతి పొందుటకు స్వదేశీ పరిస్థితులకు తగినట్లు తమను మరల్చుకొన్న ఒక భక్తి మార్గముగా అభివృద్ధి చెందినది.

**సూఫీనామ – పుట్టుక**

సుఫ్ అనగా ఉన్ని అని అర్థము. సూఫీలు ఉన్ని వస్త్రములను ధరించుట వారి నిరాడంబరమునకు గుర్తు. ప్రపంచములో పెరుగుచున్న విలాసవంతమైన జీవనానికి ఇది వ్యతిరేకమయినది.

సఫా అనగా – పరిశుద్ధత అని భావము.

సుఫా అనునది మహమ్మద్ ప్రవక్త మసీదు నందు వెలుపల గల తిన్నె. ఇచ్చుట అతని యొక్క ముఖ్య అనుచరులు ఆశీనులై మత విశ్వాసములను గురించి నేర్చుకొనెడివారు.

## భారతదేశములో ముఖ్యమైన సూఫీ సన్యాసులు

భారతదేశములో గల ముఖ్యమైన సూఫీ సన్యాసులు ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టి, బాబా ఫరీద్, నిజాముద్దీన్ ఆలియా.

## ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టి

ఇతను క్రీ.శ.1192లో భారతదేశమునకు వచ్చి అజ్మీర్‌లో బసచేసెను. 'మానవ సేవయే మాధవ సేవ' అని తెలిపెను. ప్రజాసేవ కొరకు తన జీవితమును అర్పించెను. ఇతనను గరీబ్ నవాజ్ లేక పేదల సంరక్షకుడు అని ప్రఖ్యాతి పూర్వకముగా పిలువబడెను. భక్తి గీతలను పాడుటను ప్రోత్సహించెను. మరియు ఖవాలీఫ్ పాటలను పాడుటను కూడ ప్రోత్సహించెను. క్రీ.శ.1235లో ఇతను మరణించెను. అజ్మీర్‌లో ఇతనిని సమాధి చేయబడిన ప్రాంతము పుణ్యక్షేత్రముగా భావించబడుచున్నది. హిందూ ఆచారములైన కొబ్బరికాయలను పగుల గొట్టుట మరియు ద్వీపములను వెలిగించుట ఇక్కడ అనుసరించబడుచున్నది.

## బాబా ఫరీద్

ఖ్వాజా మొయినుద్దీన్ చిష్టి యొక్క శిష్యుడు బాబాఫరీద్ ప్రసిద్ధి చెందిన సూఫీ సన్యాసులలో ఇతను ఒకడు.




దేవుడు ఒక్కడే అనియు, ప్రజలు సహోదరులువలే జీవించవలయుననే సిద్ధాంతమును కలిగియుండెను. ప్రజలు నిరాడంబర జీవితమును గడపవలయునని బోధించెను. ఇతడు పంజాబీ భాషలో అనేక కీర్తనలను రచించెను. వీటిని హిందువులు మరియు ముస్లింలు అందరూ పాడునట్లు ప్రోత్సహించెను సుల్తాన్ బాల్బన్ ఇతని యొక్క భక్తుడు.

నిజాముద్దీన్ ఆలియా ప్రముఖ సూఫి సన్యాసి. ఇతడు బదాయిన్(Badayeen) ప్రాంతము నుండి వచ్చి ఢిల్లీలో స్థిరపడెను. ఇతడు బాబా ఫరీద్‌కు శిష్యుడయ్యెను. ఇతడు వర్గ, జాతి, మత భేదములను ఖండించెను.

ఇతడు మెహబూబ్-ఇ-ఇల్లాహి (దేవుని యొక్క భక్తుడు) అని ఇతని అనుచరులచే పిలువబడెను. ఇతని దర్గా ఢిల్లీలో గలదు. హిందువులు మరియు మహమ్మదీయులు కలసి ఈ స్థలమును సందర్శించుచున్నారు.

## సన్యాసి నాగూర్ ఆండవర్

సన్యాసి నాగూర్ ఆండవర్ క్రీ.శ. 16వ శతాబ్దమునకు చెందినవాడు. ఇతనిని మీరన్ సాహిబ్ లేక ఖాదిర్‌వాలి అని పిలచెడివారు. నాగూరు నందు ఇతని పేరిట దర్గా స్థాపించబడెను. నాగూర్ నందు కందూరి ఉర్స్ (Kandhuri Urs) పండుగ అన్ని మతాలకు చెందిన ప్రజలచే కొనియాడబడుచున్నది. నాగూరు నందలి దర్గా ముస్లిం సన్యాసులకు సమర్పణ చేసినప్పటికీ ఇచ్చట హిందువుల వాస్తుకళ శిల్పశైలి మరియు వారి మతాచారములు ఎక్కువగా కన్పించును. ఉదాహరణకు చందనము పూయుట, నైవేద్య ప్రసాదముల అర్పణము, తలనీలాలు సమర్పించుట మొదలగునవి ఇచ్చట విశేషములు.

### దర్గా లేక సమాధి

షేక్ దర్గా లేక సమాధి ఇతని అనుచరులకు భక్తి కేంద్రమయ్యెను. కారణమేమనగా సన్యాసులు మరణించిన తరువాత వారు భగవంతునితో ఐక్యమగుదురని మరియు జీవించియున్నపుడు భగవంతునికి సన్నిహితుడని భావించుట వలన వీరి అనుచరులు దర్గాలను సందర్శించి సంతోషమును మరియు ఆధ్యాత్మిక ఫలితములను పొందవచ్చునని నమ్ముచున్నారు.

## భక్తి మరియు సూఫీ ఉద్యమముల ఫలితములు

భక్తి మరియు సూఫీ ఉద్యమములు మతాధిపత్య వర్గము సాధారణ ప్రజలను దోపిడి చేయడాన్ని అరికట్టెను. మూఢనమ్మకముల వలన కలుగు చెడును పోగొట్టి ప్రజలలో జాగృతిని కలుగజేసెను. ఇది సోదరభావము మరియు సమానత్వము ఏర్పడుటకు దారిచూపెను. భక్తి ఉద్యమకారులు అర్థములేని ఆచార వ్యవహారములను, విగ్రహారాధనను, కులవ్యవస్థను, ఉన్నతజాతి ప్రాబల్యమును మరియు మత భేదాభిప్రాయములను ఎదురించిరి. ప్రేమ మరియు భక్తి ద్వారా భగవంతుని చూడవచ్చునని భావించిరి. హిందూ ముస్లీముల మధ్య సదభిప్రాయము మరియు సహకారము ప్రోత్సహించబడినవి.

సూఫీ సన్యాసులు భగవంతుడొక్కడేనని, మానవులందరూ కూడా అతని సంతతియేనని బోధించిరి. వారు పవిత్రమైన జీవితమును గడపవలయునని మరియు నిరుపేదలకు సేవ చేయవలయునని నొక్కి వక్కాణించిరి. వారు మూఢ నమ్మకములను, జంతు బలులను వ్యతిరేకించిరి.

భక్తి మరియు సూఫీ ఉద్యమకారుల కారణముగా హిందీ, పంజాబీ, బెంగాలీ, తెలుగు, కన్నడ మరియు తమిళ సాహిత్యములు అభివృద్ధి చెందెను.

## అభ్యాసం

**I) సరియైన సమాధానములిమ్ము.**

1. భక్తి ఉద్యమము భారతదేశములో ______________ యుగంలో వ్యాపించెను.

   ఎ) మధ్య  బి) ప్రాచీన  సి) నవీన

2. శంకరాచార్యులు కేరళలో ____________ అను స్థలములో జన్మించిరి.

ఎ) కాలడి బి) తల్వాండి సి) మేవార్

3. ____________ మతమును గురునానక్ స్థాపించెను.

ఎ) సిక్కు బి) వీరశైవము సి) వైష్ణవ

4. తులసీ దాస్ రచించిన గ్రంథము

ఎ) దోగ బి) దాసభోధ సి) రామచరిత మానస్

5. సూఫీ ఉద్యమము ____________ నందు ఉద్భవించెను.

ఎ) ఇరాక్ బి) టర్కీ సి) పర్షియా

## II) ఈ క్రింది ఖాళీలను పూరింపుము.

1. శంకరాచార్యులు ____________ తత్వమును బోధించెను.
2. భక్తి ఉద్యమ సంస్కర్త అయిన రామానుజుడు చెన్నై సమీపమున గల ____________ నందు జన్మించెను
3. బసవన్న ____________ మత స్థాపకుడు.
4. జ్ఞానదేవుడు భగవద్గీతపై రచించిన కావ్యమును ____________ అని అందురు.
5. ____________ పండుగను నాగూర్ దర్గాలో జరుపుకొందురు.

## III) జతపరచుము.

| | | |
|---|---|---|
| 1. | నయన్మారులు | దళిత రచయిత |
| 2. | మాణిక్యవాచగర్ | వైష్ణవులు |
| 3. | ఆళ్వారులు | తిరువాసగం |
| 4. | మీరాబాయి | శైవులు |
| 5. | చోకమేల | శ్రీకృష్ణుని భక్తురాలు |

## IV) క్లుప్తముగా జవాబులిమ్ము.

1. భక్తి ఉద్యమము యొక్క ముఖ్య ఉద్దేశ్యములేవి?
2. దక్షిణ భారతదేశములో భక్తి ఉద్యమము యొక్క ప్రభావమెట్టిది?
3. కబీరును గూర్చి సంగ్రహముగా వ్రాయుము.
4. మహారాష్ట్రములోని భక్తి ఉద్యమ నాయకుల పేర్లను తెలుపుము.
5. సూఫీ సన్యాసులు దేనిని గురించి వొక్కాణించిరి?

## V) విపులముగా జవాబులిమ్ము.

1. భారతదేశమునందలి భక్తి ఉద్యమ నాయకులను గూర్చి విశదీకరింపుము
2. భారతదేశమునందలి సూఫీ ఉద్యమమును గూర్చి వివరింపుము.
3. భారతదేశమునందలి భక్తి ఉద్యమము మరియు సూఫీ ఉద్యమముల ప్రభావము ఎట్టిది?

## రూపక నిర్ధారణ

**1. సామూహిక చర్చ:**

భక్తి ఉద్యమ సన్యాసులు ఖండించిన సాంఘిక దురాచారములు ఇప్పటికీ ఉన్నవా? ఒకవేళ అట్లు ఉన్నట్లయితే వాటిని నివారించుటకు కొన్ని మార్గములను సూచించు చర్చను చేపట్టుము.

**2. నటనా ప్రదర్శన:**

తమిళనాడునందు భక్తి/సూఫీ సన్యాసుల జీవితకాలంలో జరిగిన కొన్ని సంఘటనలపై మీ తెలుగు భాషా పంటితుని సహాయంతో ఒక నటనా ప్రదర్శనను తరగతి గదిలో చేపట్టుము.

**3. ఆలాపించుము:**

భక్తి/సూఫీ సన్యాసుల కీర్తనలు/దోహాలులను కొన్నింటిని జ్ఞప్తికి తెచ్చుకొని తరగతి గదిలో ఆలాపించుము.

**4. సేకరించుము:**

భక్తి/సూఫీ సన్యాసులపై వార్తా పత్రికలు/మ్యాగజైన్‌లలో వచ్చిన కథలను సేకరించి తరగతి గదిలో చదువుము.

**5. చేయవలసిన పనులు:**

1. భక్తి మరియు సూఫీ సన్యాసుల బొమ్మలను సేకరించి ఒక ఆల్బమ్‌ను తయారుచేయుము.
2. పన్నెండు మంది ఆళ్వారులతోపాటు వారి సాహిత్య గ్రంథములపై ఒక చార్టును తయారుచేయుము.

# 1. విపత్తు మరియు విపత్తుల నిర్వహణ

ఇటీవల కాలములో మనదేశము అధికముగా ప్రకృతి వైపరీత్యములైన వరదలు, భూచరియలు, సునామీ మరియు భూకంపములు మొదలగు వాటి వలన అధిక భారీ నష్టములను ఎదుర్కొనుటను మనము చూచుచున్నాము. ఈ వైపరీత్యములు వినాశనములను, అందోళనలను, జ్ఞాపక చిహ్నాలుగా విడిచివెళ్ళుచున్నవి. ప్రకృతి వైపరీత్యము వలన బాధించబడిన ప్రజలకు పునర్నిర్మాణము మరియు పునరావాసము ఏర్పరచుటకు అధిక కాలము ధనము అవసరమగుచున్నది. ఈ పాఠ్యాంశములో ప్రకృతి వైపరీత్యము అనగానేమి? మరియు వైపరీత్యములను నిర్వహణ చేయుట, దీని వలన ఏర్పడు బాధనలను తొలగించుటను గురించి మీరు అధ్యయనము చేయబోవుచున్నారు.సమాజము లేక సమూహము లేక పర్యావరణముపై వ్యతిరేక ఫలితములను కలిగించే ఎటువంటి ప్రభావమునైన విపత్తు అందురు.

ఐక్యరాజ్య సమితి ప్రకారము, విపత్తును క్రింది విధముగా నిర్వచించబడియున్నది. సమూహము యొక్క కార్యకలాపములు ఎడతెగక బాధింపబడుట, బాధింపబడిన సమూహములో గల వనరులను పోరాడి ఉపయోగించ లేనంత వరకు మానవులు, వస్తువులు లేక పర్యావరణము మొదలగు వాని నష్టములు ఏర్పడుటను విపత్తు అందురు. ప్రకృతి వైపరీత్యము ఎందువలన ఏర్పడును? ప్రకృతి వైపరీత్యములలో కొన్ని ప్రకృతి పరంగా ఏర్పడుచున్నది. వీటిని మనము నియంత్రించలేము. కొన్ని మనము ప్రకృతి వనరులను అధికముగా వినియోగించుటవలన ఏర్పడుచున్నది.

దీని వలన వరదలు, భూచరియలు, భూచయము, భౌగోళిక తాపము, క్షామము ఏర్పడుచున్నది. మనము కూడ ఈ వైపరీత్యము ఏర్పడుటకు కారణమగుట వలన వనరులను ఉపయోగకరముగా యుండునట్లు ఉపయోగించుటను బాధ్యతగా భావించినట్లయితే వైపరీత్యము యొక్క విపరీత ప్రభావముల నుండి మనలను రక్షించుకొనుటకు వీలగును.

ఆపద అనునది ప్రమాదమును తెలియుజేయును. కాని విపత్తు ప్రజల ప్రాణ మరియు ఆస్థి నష్టములను కలిగించును. తుపాను అనునది ఒక ఆపద. ఇది ఎప్పుడు ప్రాణ మరియు ఆస్థి నష్టములను కలుగజేయునో అప్పుడు దీనిని విపత్తు అందురు.

విపత్తులను, ప్రకృతి విపత్తు మరియు మానవ నిర్మిత విపత్తు అని రెండు రకములుగా విభజింపవచ్చును. ప్రకృతి శక్తుల కారణముగా సహజ విపత్తులు ఏర్పడుచున్నవి. కానీ మానవ నిర్మిత విపత్తులు మానవుల అశ్రద్ధ, అజాగ్రత్త మరియు అవివేకము కారణంగా ఏర్పడుచున్నవి.

## ఉపశమనము

ఉపశమనము అనగా విపత్తు యొక్క తీవ్రతను తగ్గించుట అని భావము. ప్రకృతి వలన ఏర్పడు వైపరీత్యములైన తుపానులను అడ్డుకొనుటకు వీలుకాదు. కాని తుపాను వలన ఏర్పడు బాధనల నుండి ఉపశమనము పొందుటకు ముందుగానే జాగ్రత్తలను పాటించినయెడ ప్రజల ప్రాణములను, ఆస్తులను రక్షించుకొనుటకు వీలగును.

**విపత్తులు**

| సహజ విపత్తులు | మానవ నిర్మిత విపత్తులు |
|---|---|
| భూకంపములు, అగ్నిపర్వత విస్ఫోటనము, భూచరియలు విరిగిపడుట, హిమపాతము తుపానులు, వరదలు, అనావృష్టి, సుడిగాలులు మొదలగునవి. | యుద్ధము, అగ్ని ప్రమాదములు, రహదారి ప్రమాదములు, ఓడలు మునుగుట, అణు విస్ఫోటనములు, విద్యుత్‌శక్తి ప్రమాదాలు మొదలగునవి. |

సాంఘిక శాస్త్రము

## భూకంపము

మనకు తెలిసిన విధముగా భూపటములో హఠాత్తుగా ఏర్పడు కదలికనే భూకంపము అందురు.

టెక్టానిక్ ఫలకముల చలనములు, అగ్నిపర్వత విస్ఫోటనములు, ఘనపదార్థముల విఘటనము, భూచరియలు విరిగిపడుట మరియు భూతలముల పగుళ్ళు మొదలగు కారణముల వలన భూకంపములు ఏర్పడుచున్నవి.

భారతదేశములో భూకంపములు ఏర్పడు ప్రాంతములను నాలుగు రకములైన భూకంప మండలములుగా విభజించిరి.

ఆవి క్రింది పట్టికలో పొందుపరచబడినవి.

ఒక సంవత్సరములో వందల సంఖ్యలో భూకంపములు ఏర్పడినప్పటికి భూకంపమాపలేఖి (సిస్మోగ్రాఫ్) అను పరికరము వలన మాత్రమే వీటిని కనుగొన వచ్చును. భారీ నష్టములను ఏర్పరచు ఒకటి లేక అనేక భూకంపములు ప్రపంచములో ఏదైన ఒక ప్రాంతములో ఏర్పడుచున్నది. భూకంపము ఏ బిందువు వద్ద ప్రారంభమగునో ఆ ప్రాంతమును భూకంప కేంద్రము అందురు. ఈ కేంద్రమునకు ప్రత్యక్షముగా భూమి యొక్క ఉపరితలము మీద అమరియున్న బిందువును బాహ్య కేంద్రము అందురు.


| భూకంప మండలములు | ప్రాంతములు | రకములు |
|---|---|---|
| V | కాశ్మీరు, పంజాబు, పశ్చిమ మరియు మధ్య హిమాలయములు, ఈశాన్య భారతదేశప్రాంతము మరియు రాణా కచ్ ప్రాంతములు | అత్యధిక ప్రమాదకరమైన మండలము |
| IV | గంగా సింధు మైదానము, ఢిల్లీ, జమ్ము మరియు బీహారు | అధిక ప్రమాదకరమైన మండలము |
| III | అండమాను నికోబారు దీవులు, పశ్చిమ హిమాలయములు | మిత అపాయకరమైన మండలము |
| II | దక్కను పీఠభూమి మరియు తమిళనాడు | తక్కువ అపాయకర మండలము |





పటము-1 భూకంపము వలన నేలకూలిన బహుళ అంతస్థు భవనము

## భారతదేశములోని భూకంప మండలములు




మామూలుగా భూకంపమనునది ఇతర ప్రకృతి ఫలితము కంటె అధిక నష్టములను, బాధలను ఏర్పరచుచున్నదని భావించబడుచున్నది. ఒక భూకంపము యొక్క బలము బాహ్య కేంద్ర సమీపమునగల ప్రాంతములు అత్యధికముగా యుండును. భూకంప బలము కారణముగా భవనములు రహదారులు, వంతెనలు నాశనమగుచున్నది. వరదలు, సునామీ, భూచరియలు, హిమపాతము, అగ్నిప్రమాధము, నీటి సరఫరా సక్రమముగా లేకపోవుట విద్యుత్ సరఫరా కోతబడుట మాత్రమేగాక ప్రాణ నష్టములు కూడా సంభవించుచున్నది. ఇది నది యొక్క ప్రవాహ దిశనే మార్చివేయును. మందమైన భూకంపముల వలన భవనములు, రహదారులు మరియు వంతెనలలో పగుళ్ళు ఏర్పడును.

జనవరి 26, 2001వ సంవత్సరములో 51వ గణతంత్ర దినోత్సవ సమయమున గుజరాతులో అతి భయంకరమైన భూకంపము ఏర్పడినది. రిక్టరు స్కేలుపై ఇది 7.6 మరియు 8.1 మధ్య పరిమాణములో నమోదు అయినది. భూకంప తరంగములు 700 కి.మీ. దూరము వరకు వ్యాపించి 21 జిల్లాలను అతలాకుతలం చేసినది. 6,00,000 మంది ప్రజలు నిరాశ్రయులైరి. 19,727 మంది ప్రజలు ప్రాణములను కోల్పోయిరి. 1,66,001 మంది ప్రజలు గాయపడిరి. సుమారు 90% గృహములు, ఎనిమిది పాఠశాలలు, రెండు వైద్యశాలలు మరియు చరిత్ర ప్రసిద్ధి చెందిన స్వామి నారాయణ దేవాలయము కూడ నేలమట్టమైనది.

## ఉపశమనము

నష్టములు యొక్క తీవ్రతను తగ్గించుటకు ఏమి చేయవలయును?

భూకంపముల వలన ఏర్పడు ప్రాణ మరియు ఆస్థి నష్టములను తగ్గించుటకు ముఖ్యముగా భూకంప మండల ప్రాంతములో నివశించు ప్రజలను చైతన్య పరచవలయును. భూకంప తాకిడిని భరించగల భవనములను నిర్మించుటకు ముందు మట్టి నాణ్యతను పరిశీలించుటకు నవాకరించవలయును. భూకంప సమయమున ఎటువంటి జాగ్రత్తలు తీసుకొనవలయునని ప్రజలను చైతన్య పరచవలయును. పాఠశాలలో ప్రారంభ వయన్సులోనే విద్యార్థులు తమను భూకంపము నుండి రక్షించుకొనుటకు వారికి చైతన్య సదస్సులను నిర్వహించవలెను.

భూకంప సమయమున తీసుకోవలసిన జాగ్రత్తలు ఏవి?

భూకంప సమయము నందు ముఖ్యముగా చేయవలసిన పని ప్రశాంతముగా యుండుట. మీరు భవనములోపల వున్నట్లయితే తలుపులు దగ్గర నిలబడుము లేదా మేజాక్రింద ఒరిగి దాగుము. కిటికీలు లేదా గాజు పొదగబడియున్న వస్తువులకు దూరముగా యుండవలెను.

మీరు బహిరంగ ప్రదేశములో యున్నట్లయితే విద్యుత్ స్థంభములు, విద్యుత్ తీగలు, భవనములు, వృక్షములు మరియు టెలిఫోన్ తీగలకు దూరంగా ఉండవలెను. మీరు మోటారు వాహనములో ప్రయాణము చేయునప్పుడు సొరంగ మార్గములు లేక వంతెనలను వదిలి సురక్షితమైన ప్రాంతములను ఎన్నుకొని నిలువవలయును.

బహుళ అంతస్తుల భవనములో నివశించు ప్రజలు భవనమును వదిలి వెలుపలికి వచ్చుటకు ఎట్టి పరిస్థితులలోను లిఫ్ట్‌ను ఉపయోగించ రాదు. దానికిబదులుగా మెట్లనుఉపయోగించవలెను.

అగ్నిప్రమాదములను నివారించుటకు వంట గ్యాస్ పొయ్యి, విద్యుత్ దీపములు, క్రొవ్వొత్తులు మరియు ఇతర దీపములను ఆర్పివేయవలయును.

## అగ్నిపర్వతముల విస్ఫోటనములు

భూకంపముల వలె కాకుండా అగ్ని పర్వతములు విస్ఫోటనమునందు అవి ప్రేలుటకు ముందు దాని నుండి వెలువడు పొగ, వాయువులు బహిర్గతమగుట, మాగ్మా స్రవించుట మరియు నిదాన కంపనముల ద్వారా ముందుగనే దానిని తెలుసుకొనుటకు వీలగును.

అగ్ని పర్వత విస్ఫోటనముల వలన లావా భూమి లోపల నుండి బహిర్గతమగును. లాహర్స్ అనబడు లావా మన్ను భవనములను, అడవులను మరియు వ్యవసాయ భూములను నాశనమును చేయుచున్నది. లావార్స్ అనునది అగ్ని పర్వతముల నుండి బహిర్గతమగుచున్న మరియు పొగ. వర్షపు నీటిలో కలియుట చేతనో లేక మంచునదులు కరుగునప్పుడు మన్ను మరియు పొగ కలియుటనే లాహర్స్ అందురు.

అగ్ని పర్వతమునందు వెలువడు పొగ, బూడిద మేఘాలు వెలువడుట వలన దృష్టి లోపము ఏర్పడును? మరియు ఇతర ఆర్థిక కార్య కలాపములకు ఆటంకము కలుగుచున్నది.

అగ్నిపర్వతములు వినాశనమును కలిగించి నప్పటికిని ఇవి ప్రయోజనములను కూడా చేకూర్చు చున్నది. అగ్ని పర్వత పదార్థములు పరిశ్రమలకు ముడిపదార్థములగాను మరియు రసాయన పదార్థములగాను ఉపయోగపడుచున్నది. లావా ద్రవముచే ఏర్పడు శిలలు, భవనములు మరియు రహదారులను నిర్మించుటకు ఉపయోగపడుచున్నవి. శైథిల్యము చెందిన అగ్నిపర్వత రేణువులు మట్టి సారమును పెంపొందించుచున్నది. అగ్ని పర్వతముల నుండి వెలువడు నీటి ఆవిరి మరియు వేడినీటి ఊటల నుండి భూఉష్ణశక్తి (Geothermal Energy)ని తయారుచేయుటకు ఉపయోగపడుచున్నది.



పటము - 2 ఐస్‌లాండ్ అగ్నిపర్వత విస్ఫోటనముల వలన వెలువడుచున్న బూడిద వలయము

నవంబర్ 13, 1985లో కొలంబియానందు నెవడాడెల్ రూజ్ (Nevadadel Ruiz) ప్రాంతములో ఏర్పడిన అగ్నిపర్వత విస్ఫోటనము వలన 40,000 మంది ప్రజలు మరణించిరి. ఆ ప్రేలుడు వలన ఆర్మేరో నగరము పూర్తిగా నాశనము చెందినది. అదేవిధముగా ఏప్రిల్ 14, 2010వ సంవత్సరములో ఐస్‌లాండునందు ఏర్పడిన అగ్నిపర్వత విస్ఫోటనము అధిక మొత్తములో బూడిదతో కూడిన పొగను వెలువరించినందు వలన (మంచు శిలల నుండి వెలువడిన మాగ్మా వలన) 20కి పైగా ఐరోపా దేశముల విమానాశ్రయములు మూసివేయబడినవి.

## ఉపశమనము (Mitigation)

అగ్నిపర్వతముల వలన ప్రజలు ప్రాణములను కోల్పోవుట అరుదైనప్పటికి అగ్నిపర్వత ప్రాంతముల నుండి ప్రజలు దూరముగా నివసించవలయును.

అగ్ని పర్వత ప్రాంతమునకు దగ్గరగాయున్న అన్ని రకముల రవాణా సదుపాయములను నిరోధించవలయును. ముఖ్యముగా విమాన రవాణాను నిరోధించవలయును.

అగ్నిపర్వత విస్ఫోటనముల వలన భూకంపము ఏర్పడవచ్చును. అందువలన ప్రజల ముందు జాగ్రత్త చర్యలను పాటించవలయును.

మంచు విస్తారముగా యుండు పర్వత ప్రాంతములలో అగ్నిపర్వత ప్రేలుడులు కారణముగా మంచు కరుగుట చేత వరదలు ఏర్పడవచ్చును. కావున వరదలను అడ్డుకొను గట్టులను ఖచ్చితముగా నిర్మించవలయును.

అగ్నిపర్వతముల వ్యాప్తిని లెక్కించుటకు ఉపయోగపడు టిల్ట్ మాపకమును (Tilt meter) గురించి ప్రజలు తెలుసుకొనియుండవలయును.

## సునామీ (రాక్షస అలలు) (Tsunamis)

సముద్ర గర్భంలో ఏర్పడు భూకంపములు, అగ్నిపర్వత విస్ఫోటనములు లేదా సముద్ర గర్భ భూచరియలు కదలిక వలన ఏర్పడు రాక్షస అలలు లేదా ప్రాణాంతకమైన అలలనే సునామీ అందురు. ఇవి 15 మీటర్లు లేదా అంతకంటె ఎక్కువ ఎత్తునకు లేచును. సముద్రము లేదా మహాసముద్రములో భూకంపము సంభవించి నప్పుడు అలలు కొన్ని మీటర్ల ఎత్తు వరకు లేచి కొన్ని నిమిషములలోనే సముద్ర తీరమును చేరును. అతిపెద్ద భూకంపము ఏర్పడిన తరువాత కొన్ని గంటల వరకు సునామీ అపాయకర సూచనలు కనిపించును.

**మీకు తెలియునా ?**

సునామి అను పదము జపాను భాష నుండి ఉద్భవించినది. సు(Tsu) అనగా రేవు పట్టణము అనియు నామీ(Nami) అనగా అలలు అని అర్థము.

సునామి అలలు గంటకు 500 కి.మీ. వేగముతో పయనించు ప్రభావము కలవి. ఖండములను సమీపించునపుడు వీటి వేగము అధికముగా యుండును.







సునామీ

డిశంబరు 26, 2004లో ఆగ్నేయ ఆసియా
ˊములో ఏర డిన సునామీ తాకిడి వలన 1,50,000
దేశ

> **మీకు తెలియునా ?**
>
> భారతదేశములో సునామి హెచ్చరిక కేంద్రము హైదరాబాదులో ఏర్పరచబడియున్నది.

మందికి పైగా ప్రజలు మరణించిరి. ఈ విపత్తువలన ఏర్పడిన మానసిక, ఆర్థిక మరియు పర్యావరణ నష్టములను గణించుటకు వీలుకానిది. అనేక గ్రామములు పూర్తిగా జీవనాధారమును కోల్పోయినవి. గత 40 సంవత్సరములలో ఏర్పడిన భూకంపములలో ఇదియే అతి పెద్దది. రాత్రికి రాత్రే సంభవించిన ఈ అతి పెద్ద వినాశనము ప్రపంచ వ్యాప్తంగా ఎవ్వరూ ఊహించుటకు వీలు కాని ఒక విషాద సంఘటనగా నిలిచిపోయినది.

## ఉపశమనము

భారతదేశములో హైదరాబాదునందు ఏర్పరచ బడియున్న సునామి హెచ్చరికల కేంద్రముల నుండి వచ్చు సమాచారములను ప్రజలు తెలుసుకొన వలయును.

సునామి హెచ్చరికలు వెలువడిన వెంటనే ప్రజలు సముద్ర తీరప్రాంతములను వదలి దూరముగా వెళ్ల వలయును.

తీవ్రముగా గాయపడిన వారికి తక్షణమే ప్రథమ చికిత్స చేయవలయును.

మత్స్యకారులు సముద్రములోనికి చేపలు పట్టుటకు వెళ్ళకూడదు.

మొదటిలో ఏర్పడిన అల మాత్రమే అపాయకరము అని భావించకూడదు. దాని తరువాత వచ్చు అలలు కూడా అపాయకరమైనవిగానే యుండును.

## భూచరియలు విరిగిపడుట

పెద్దరాతి బండలు మరియు శిలా శకలాలు క్రిందకు జారి పడుటనే భూచరియలు జారిపడుట అందురు. శిలా రేణువులు నీటితో కలిసి జారిపడుటనే మట్టిచరియలు అని కూడా అందురు.



భూచరియలు జారిపడుట

అస్థిరమైన ఏటవాలు స్వభావము, భారీ వర్షము, భూకంపములు, అగ్నిపర్వత ప్రేలుడులు, అడవులు నాశనమగుట మరియు క్రమపద్ధతిలో లేని భవన నిర్మాణముల వంటి కారణముల వలన భూచరియలు జారిపడుట ఏర్పడుచున్నవి.



భూ చరియలు జారిపడుట

భూచరియలు జారిపడుట వలన వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావము పడుచున్నది. నివాస గృహములు నాశనము అగుచున్నవి. రహదార్లు మరియు రైలు మార్గములు దెబ్బ తినుచున్నవి. నీటి ప్రవాహముల దిశలు మార్పుచెందు చున్నవి.

## ఉపశమనము

మృదువైన మన్నుగల ప్రాంతములు మరియు మట్టి చరియలు జారిపడే ప్రాంతములలో గృహములు నిర్మించ వలయుననినచో భూచరియలు ఏర్పడినప్పుడు జారిపడిన శిలారేణువులు తొలగిపోవుటకు సరియైన మార్గములను ఏర్పరచవలయును.

భూచరియలు జారిపడుటకు ముందు హెచ్చరిక సంకేతముగా తలుపులు మరియు కిటికీలు బిగించుకొనును.

మట్టిచరియలు రహదారులను అడ్డగించు అవకాశము యున్నందు వలన తక్షణమే తప్పించుకొనుటకు రెండు లేక మూడు వేర్వేరు మార్గములను ప్రణాళికాబద్ధముగా ఏర్పరచుకొని ఉండవలయును.

ఇంటిలోనే ఉన్నపుడు భూచరియలు విరిగిపడితే ఇల్లు వదిలి వెలుపలికి రాకూడదు.

భూచరియలు నుండి తప్పించుకొనుటకు వీలు కాని పరిస్థితి ఏర్పడినప్పుడు మెడ వెనుక రెండు చేతులను బంధించి మోకాలి మీదనో లేదా క్రిందనో కూర్చొని యుండవలయును.

భూచరియలలో చిక్కుకున్న వారిని రక్షించి, ప్రథమ చికిత్సను అందించి సురక్షితమైన ప్రాంతములకు తరలించవలయును.

## హిమపాతము

ఒక పెద్ద మంచు సమూహము లేక మంచు గడ్డలు కొండల ఏటవాలు నుండి క్రిందికి జారుటనే హిమపాతము అని అందురు. ఇవి ఉన్నత అక్షాంశములలో మరియు ఎత్తైన కొండ ప్రాంతములలో ఏర్పడుచున్నవి.

భూకంపములు, అత్యధిక అవపాతము, మానవులచే ఏర్పరచబడు అధిక శబ్దము, మంచుపై వేగముగా జారుక్రీడలు మరియు విస్ఫోటన పదార్థముల వలన హిమపాతములు ఏర్పడుచున్నవి. హిమప్రాంతము నందు అత్యధికముగా హిమము కురియునప్పుడు దాని తీవ్రత మరింత అధికమగును.



హిమపాతములు

హిమపాతము వలన రహదారులకు అడ్డంకులు ఏర్పడి దెబ్బతినుచున్నవి. చిన్న గుడిసెలు, వృక్షజాలం మరియు వన్య మృగములు నాశనమగుచున్నవి.



హిమపాతములు

## ఉపశమనము

హిమపాతమును అడ్డుకొనుట లేక నిరోధించుట చాలా కఠినతరము. కాని హిమపాత శక్తిని తగ్గించుట ద్వారా దాని ప్రభావమును పరిమితం చేయవచ్చును.

హిమపాత ప్రాంతములలో వేసవి విడుదులు, కొండప్రాంత పట్టణాలు, రహదారులు మరియు రైల్వే మార్గములను నిర్మించుటను నిరోధించవలయును.

ప్రజలకు ప్రేలుడు పదార్థములను ఉపయోగించ కూడదని తెలియజేయవలయును.

పర్వత ఏటవాలు ప్రాంతములలో నివశించు ప్రజలు తమ గృహముల చుట్టు వృక్షములను పెంచుటను ప్రోత్సహించవలయును.

## తుపానులు

దక్షిణ భారతదేశసముద్ర తీరప్రాంతములు ఇతర విపత్తుల కంటె అధికముగా తుపానుల వలన నష్టములకు గురియగుచున్నవి. ప్రతి సంవత్సరము చోళ మండల తీరప్రాంతములలో ముఖ్యముగా ఆంధ్రప్రదేశ్ మరియు ఒడిస్సా రాష్ట్రములలో కొంత ప్రాణ నష్టము జరుగుచున్నది.

ప్రపంచములో 6 ముఖ్యమైన తుపాను ప్రభావిత ప్రాంతములలో భారతదేశ సముద్ర తీరప్రాంతము ఒకటి.

అల్పపీడన కేంద్రప్రాంతములలో ఉష్ణ మరియు చల్లని గాలులు సంధించుట వలన ఉద్భవించే బలమైన గాలులనే తుపానులు అందురు. సముద్రములు మరియు మహాసముద్రములలో ఇవి ఏర్పడినప్పుడు ఆ ప్రాంతములలో తుపానులను నిరోధించుటకు ఎటువంటి అడ్డంకులు లేకుండుట వలన అవి తీవ్రమగుచున్నవి.

తుపానులు ఎల్లప్పుడు బలమైన గాలితోపాటు భారీ వర్షమును కలుగజేయును. దాని వలన వరదలు ఏర్పడుచున్నవి. ఇవి వృక్షములను వేర్లతో పెకలించి వేయుట, నీటి పారుదల వ్యవస్థను నాశనము చేయుట, విద్యుత్ నిలుపుదల, రవాణా నిలుపుదల, నీరు నిల్వయుండుట, వ్యాధులు వ్యాపించుట, పంటలు నాశన మగుట, మట్టి కోత ఏర్పడుట, పురాతన భవనములు కూలిపోవుట మరియు ప్రాణ నష్టముల వంటి తీవ్ర నష్టములకు దారి తీయుచున్నది.



పెను తుపాను 1999

**మీకు తెలియునా?**

1999 అక్టోబరు 29లో బంగాళాఖాతములో ఏర్పడిన పెను తుపాను గంటకు 260-300 కి.మీ. వేగముతో గాలులు వీచి ఒడిశా తీరప్రాంతమును 144 కి.మీ. దూరము వరకు తాకినది. ఇది బంగాళాఖాత నీటి మట్టమును సాధారణ నీటి మట్టము కంటె 8 మీటర్ల ఎత్తునకు పెంచెను. ఈ పెను తుపాను భూ ప్రాంతములో 250 కి.మీ. దూరమునకు పైగా ప్రయాణించి 36 గంటలలో దాదాపు 20 మిలియన్ల హెక్టార్లు కంటె అత్యధికమైన పంట భూములను నాశనము చేసినది. వృక్షములను, సహజ వృక్షజాలమును నాశనము చేసినది. ఈ భయంకరమైన రాక్షస తుపాను నిర్దయతో ఒడిశా రాష్ట్ర వెన్ను విరిచినది. ఇది వేలాది మంది ప్రజల ప్రాణములను బలికొని, అనేక మిలియన్ల హెక్టార్ల పంట భూములను కూడా నాశనము చేసినది.

## ఉపశమనము

లోతట్టు ప్రాంతములలో నివసించు ప్రజలకు దగ్గరలో యున్న ఎత్తైన ప్రదేశములకు వెళ్ల వలయునని సలహాలు ఇవ్వవలయును.

నీరు నిల్వయుండు ప్రాంతములలో నీరు బయటకు పంపుటకు తాత్కాలిక కాలువలను ఏర్పాటు చేయవలయును.

ప్రజలు తమకు సంబంధించిన వస్తువులు, ముఖ్యమైన దస్తావేజులు మరియు ఆభరణములను భద్రముగా వుంచుకొనవలయును.

త్రాగునీటి గొట్టములను సంరక్షించుకొనవలసిన అవసరమున్నది.

ప్రజలు బయటకు వెళ్ళినపుడు దగ్గరగా యున్న విద్యుత్ సరఫరా స్తంభములోని తీగలు తెగిపోయినవా లేక వాటిలో విద్యుత్తు సరఫరా జరగుచున్నదా లేదా అని గమనించవలయును.

మత్స్యకారులు సముద్రములో చేపలు పట్టుటకు వెళ్లరాదని హెచ్చరిక జారీ చేయవలయును.

స్థానిక ఆకాశవాణి మరియు దూరదర్శనిలో ప్రకటించే ముఖ్యమైన సూచనలను అందరూ గమనించవలయును.

వ్యాధులు ప్రబల కుండా అరికట్టుటకు అందరూ వేడి చేసి చల్లార్చిన నీటినే త్రాగవలయును.

## వరదలు

పరిమాణమునకు మించి తాత్కాలికంగా ప్రవహించు నీటి ఉధృతిని వరదలు అని అందురు. అత్యధిక వర్షపాతము, తుపాను, మంచు కరుగుట, సునామీ మరియు ఆనకట్టలు తెగుటవంటి

కారణముల వలన వరదలు ఏర్పడుచున్నవి. ఈశాన్య ఋతుపవన కాలములో కురియు అత్యధిక వర్షపాతము వలన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మరియు ఒడిశా రాష్ట్రములందు, నైఋతి ఋతుపవన కాలములో ముంబై ప్రాంతములందు సాధారణముగా వరదలు ఏర్పడుచున్నవి.

వరదల వలన మురికినీటి కాలువలు నిర్మాణము దెబ్బ తినుట, నీరు కలుషితము చెందుట, మట్టి కోతలు, ఋరద నిక్షేపము చెందుట, నీరు నిల్వ యుండుట, వ్యవసాయ భూములు మరియు పశువులకు తీవ్ర నష్టము, మత్స్యకారుల సాధనములు నాశనమగుట మరియు ప్రాణనష్టములు ఏర్పడు చున్నవి.

దక్షిణ భారతదేశ నదులతో పోల్చినపుడు ఉత్తర భారతదేశ నదులలో ప్రతి సంవత్సరము వరదలు ఏర డుటకు గల కారణమేమి? ఆలోచింప ము.



వరదలు

వరదలు మరియు క్షామము అను రెండు సమస్యలు ఋతుపవన మార్పుల వలన ఏర్పడుచున్నవి.

## ఉపశమనము

నీటి ప్రవాహ వెల్లువలను తగ్గించుటకు అనేక కాలువలు అవసరమగుచున్నవి. ముఖ్యముగా వ్యవసాయ భూములు మరియు లోతట్టుప్రాంతముల నుండి నీరు ప్రవహించుటకు కాలువలు అవసరమగుచున్నవి.

నదీ తీరములందు గల గట్టు ఎత్తును పెంచవలయును. ముఖ్యముగా గుంటలు మరియు చెరువులలో పూడికలను తీయవలయును.

లోతట్టు ప్రాంతములలోయున్న గృహముల లోనికి నీరు ప్రవేశించకుండాయుండుటకు ముందు భాగాన ఇసుక మూటలను అమర్చవలయును.

ఎ) అడవులను పెంచుటకు ప్రోత్సహించి ఏదేని ఒక వర్షపు నీటి సేకరణ పద్ధతిని అనుసరించవలయును.

లోతట్టు ప్రాంతములలో నివశించు ప్రజలు ఎత్తైయున ప్రాంతమునకు వెళ్లవలయును.

వరదల సమయములందు సామాజిక కార్యక్రమాలలో పాల్గొనుటకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వవలయును.

## క్షామము

వర్షాభావ పరిస్థితుల వలన దీర్ఘకాలముగా నెలకొనియుండు పొడి వాతావరణమును క్షామము అందురు. క్షామము ఎప్పుడు ప్రారంభమగును ఎప్పుడు అంతమగునని చెప్పుటకు వీలు కాదు భారతదేశ వాతావరణ శాఖ ప్రకారము దీర్ఘ కాలముగా ఒక దేశములో 10% నకు తక్కువ వర్షపాతము యుండినట్లయితే ఆదేశమును క్షామ ప్రభావిత దేశముగా చెప్పవచ్చును.

వర్షపాత కొరతయే క్షామమునకు ముఖ్య కారణము. వర్షాభావ పరిస్థితులకు ఋతుపవనముల వైఫల్యము, ఋతుపవనముల మార్పులు, అడవులు నాశనమగుట, పర్యావరణ కాలుష్యము, అధిక భాష్పీ భవనము, భూ నిర్వహణ నిర్లక్ష్యము, అధిక పచ్చిక కోత మరియు మట్టి కోత ముఖ్య కారణములు అగుచున్నవి.

వర్షాధార పంటలన్నియు క్షామము కారణముగా చాలా వరకు దెబ్బతినుచున్నవి. క్షామమునకు సంబంధించిన ఇతర ప్రభావములు ఏవనగా 1. త్రాగునీటి కొరత 2. ఆహార కొరత 3. పశువులకు నీరు లేకపోవుట 4. తక్కువ పోషక శక్తి వలన వ్యాధులు 5. మట్టికోత.





క్షామము

## ఉపశమనము

పంటమార్పిడి మరియు బిందునీటి పారుదల పద్ధతుల ద్వారా ప్రణాళికా బద్దంగా భూమిని ఉపయోగించుట.

వర్షపునీటిని సరియైన పద్ధతిలో సేకరించుట మరియు ఉపయోగించుట.

క్షామముగల ప్రాంతములలో పశుగ్రాసము మరియు త్రాగునీటి వసతులను ఏర్పరచుట.

గ్రామస్థాయిలో క్షామ నివారణ ప్రణాళికలను చేపట్టుట.

ఆహారము అవసరమగు ప్రాంతములకు తగినట్లు ఆహార వస్తువులను దిగుమతి చేసి రవాణా చేయుట.

## సుడిగాలులు

తీవ్రభ్రమణముతో నిలువుగాను గుండ్రముగాను వీచు గాలుల సమూహామునే సుడిగాలులు అందురు. ఈ గాలులు భూమి ఉపరితలము నుండి గరాటు ఆకారములో క్యుములో నింబస్ మేఘములవలె పైకి లేచును.

ఈ గాలిభ్రమణము యొక్క వెడల్పు కొన్ని మీటర్ల నుండి ఒక కిలో మీటరుకు పైగా యుండును. దీని భ్రమణ వేగము గంటకు 64 నుండి 509 కి.మీ మధ్య యుండును.

తీవ్రమైన అల్పపీడన కారణముగా ఇది ఏర్పడును. ఇది భూమి మీద ఏర్పడినప్పుడు వేగ వంతమైన భ్రమణగాలిని ఏర్పరచును. ఇది వెచ్చని మరియు చల్లని గాలి సంధించునపుడు ఏర్పడును. ఇవి తుఫానులు వలె అత్యధిక ప్రాణ మరియు ఆస్తి నష్టములను కలుగజేయుచున్నవి.

మార్చి 24, 1998 లో పశ్చిమ బెంగాలు మరియు ఒడిశా యొక్క తూర్పు సముద్రతీర ప్రాంత జిల్లాలలో 20 సముద్రతీర గ్రామములను తీవ్రమైన సుడిగాలులు తాకెను. ఈ సుడిగాలుల వలన 160 మంది ప్రజలు మరణించిరి. 2000 మంది ప్రజలు గాయపడిరి. పడవలో ప్రయాణము చేయుచుండిన 10 మంది గాలిచే దాదాపు 20 అడుగుల ఎత్తు వరకు విసిరివేయబడి మరణించిరి.

ఒడిశాలోని బలసూరు జిల్లాలో గల గోబర్‌ఘటా అను గ్రామములో సుడిగాలు వలన పాఠశాల భవనము యొక్క పైకప్పు విరిగి 35 మంది చిన్నారులు నలిగి మరణించిరి. 15000 గృహములు నాశనము చెందుటతో పాటు 10,000 మందికి పైగా ప్రజలు నిరాశ్రయులైరి.

**మీకు తెలియునా ?**

సుడిగాలులను అమెరికా సంయుక్త రాష్ట్రములలో (U.S.A) చుట్టు త్రిప్పుగాలి (Twister) అని పిలుతురు. కారణమేమనగా పురివలె భ్రమణము చెంది గరాటు ఆకారములో మేఘములను ఏర్పరచుట వలన ఈ పేరు ఇవ్వబడినది.



సుడిగాలులు

## ఉపశమనము

సుడిగాలుల తీవ్రతను తెలుసుకొనిన వెంటనే ప్రజలు లోతట్టు ప్రాంతములనుండి సురక్షిత

ప్రాంతమునకు వెళ్లవలయును లేక ప్రజలు వారి గృహములయందును లేక తుపాను సంరక్షణ భవనములయందు ఉండవలయును. అట్లుకాని యెడల తక్కువ పల్లపు ప్రాంతములో సమతలముగా ఉన్నచోట పడుకొని యుండవలయును.

శిథిలమైన భవనముల నుండి దూరముగా వెళ్ళవలయును.

సుడిగాలులు వీచు సమయము నందు మీరు గృహమునకు వెలుపలి యుండినట్లయితే ఉన్నచోటనే యుండవలయును.

సుడిగాలి తీవ్రత తగ్గినదని ప్రభుత్వ అధికారుల నుండి తగిన హెచ్చరికలు పొందిన తరువాతనే గృహములకు తిరిగి వెళ్లవలయును.

గాయపడిన లేక సుడిగాలిలో చిక్కుకున్న రక్షింపబడిన ప్రజలకు తక్షణమే సహాయమునందించి ప్రథమ చికిత్స చేయవలెను.

## ఉమ్మడి ఉపశమనము

### వైపరీత్య నిర్వహణ :

వైపరీత్య నిర్వహణ అనునది పలురకములైన వైపరీత్యములను గురించిన చైతన్యము, సంసిద్ధముగా యుండుట, అడ్డుకొనుట, నివారణ, కోలుకొనుట గురించి వివరించుచున్నది.

వైపరీత్యమునకు వ్యతిరేకముగా ప్రజలకు ముందుగానే హెచ్చరికలు చేయుట, తమ ప్రాణమును మరియు ఆస్తులను రక్షించుకొనుటకు తగిన పద్ధతులను తెలుసుకొనవలయును.

పాఠశాలలోను, కళాశాలలోను, కార్యాలయాలలోను వైపరీత్యమును గురించి చైతన్య కార్యక్రమములను జరుపవలయును. ప్రజలకు ఆకాశవాణి, పత్రికలు మరియు దూరదర్శిని ద్వారా కార్యక్రమములను ఏర్పరచి చైతన్య పరచవలయును. బాధించబడిన ప్రజలకు ప్రభుత్వము త్వరితముగా సరియైన కాలములో సంరక్షిత పనులను చేయుటకు అన్ని రంగములలోను ప్రణాళికలను చేపట్టవలయును.

## అభ్యాసం

### I) సరియైన సమాధానమును ఎన్నుకొని వ్రాయుము.

1. క్షామము ఏర్పడుటకు ముఖ్య కారణము ____________.

   అ) వర్షపాత కొరత　　ఆ) పర్యావరణ వినాశనము

   ఇ) అడవుల పెంపకము　　ఈ) పరిశ్రమలు

2. సుడిగాలులు ____________ దేశములో సర్వసాధారణము.

   అ) ఇండియా　　ఆ) బంగ్లాదేశ్　　ఇ) చైనా　　ఈ) అమెరికా

3. భూచరియలు విరిగి పడుట తరచుగా ఏర్పడు ప్రాంతము ____________.

   అ) ఎడారి ప్రాంతము　　ఆ) అడవి ప్రాంతము

   ఇ) టంద్రాప్రాంతము　　ఈ) కొండప్రాంతము

4. సునామీ అను పదము ____________ భాష నుండి వచ్చినది.

అ) తమిళము ఆ) ఫ్రాన్సు ఇ) జపాన్ ఈ) లాటిన్

5. క్రింది యివ్వబడిన వాటిలో ఏది సహజ విపత్తుకాదు

అ) అణుబాంబు విస్ఫోటనము ఆ) అడవుల నాశనము

ఇ) అటవీ దహనము ఈ) మెరుపు

## II) ఖాళీలను పూరించుము.

1. ఆపద అనునది ఒక ____________.
2. భారతదేశము ____________ భూకంప మండలముగా విభజింపబడినది.
3. భారతదేశములో సునామి హెచ్చరిక కేంద్రము____________ నందు స్థాపించబడినది.
4. శిలారేణువులు నీటితో చేరి జారి చలించుటను ____________ అందురు.
5. హిమపాతములు ఉన్నత ____________ మరియు ఎత్తైన ____________ ఏర్పడుచున్నది.

## III) జతపరచుము.

| | |
|---|---|
| 1. సుడిగాలులు | అధిక వర్షపాతము |
| 2. కరిగిన శిలాద్రవము | సుడిగాలి |
| 3. భూచరియలు | అగ్నిపర్వతముల విస్ఫోటనము |
| 4. క్షామము | సునామి |
| 5. భూకంపము | వర్షపాత కొరత |

## IV) క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానములిమ్ము.

1. విపత్తు అనగా నేమి ?
2. ఉపశమనమును నిర్వచింపుము.
3. భూచరియలు జారిపడుట అనగానేమి ?
4. వరదలు మరియు క్షామమునకు గల వ్యత్యాసములను తెల్పుము.
5. సుడిగాలులు మరియు తుపానులకు గల వ్యత్యాసములను తెల్పుము.

## V) క్రింది ప్రశ్నలకు విశదముగ సమాధానములిమ్ము.

1. విపత్తు అనగానేమి? సహజ మరియు మానవ నిర్మిత విపత్తులను గురించి వ్రాయుము?
2. సునామిని గురించి తెలిపి దాని వలన పర్యావరణములో ఏర్పడు ప్రభావములను గురించి వ్రాయుము?
3. వరదలచే బాధించబడిన ప్రాంతములలో ఉపశమన కార్యములను కొన్నింటిని తెలుపుము?
4. క్షామము అనగానేమి? వీటి ప్రభావములను గురించి తెల్పుము?
5. భారత దేశములో గల భూకంప మండలములను గురించి వివరింపుము.

## VI) పటనైపుణ్యము

1. భారత దేశ పటమునందు భూకంప మండలములను గుర్తించుము?

## రూపక నిర్ధారణ

1. 2011-2012 మధ్య కాలంలో భారతదేశంలో సంభవించిన భూకంపములపై ఒక వ్యాసము వ్రాయుము.
2. డిశంబరు 26, 2004 - సునామి వలన కలిగిన నష్టాలు మరియు ఆ ప్రాంతాల పునర్నిర్మాణమునకు చేపట్టిన చర్యలను తెలిపే ఒక ఆల్బమ్‌ను తయారుచేయుము.
3. నీలగిరి జిల్లాలలో కొండచరియలు విరిగి పడడం సర్వసాధారణము - కారణాలను గుర్తించుము.
4. థానే తుఫాను ప్రాంతములు మరియు ఆ ప్రాంత అభివృద్ధికై చేపట్టిన చర్యలపై ఒక చర్చను చేపట్టుము.
5. వర్షాభావ సమయములో మనలను మనము పరిరక్షించుకోవడానికి వర్షపు నీటి సేకరణ అత్యంత ముఖ్యమైనది అని తెలిపే పోస్టరు మరియు ప్రదర్శనా బోర్డులను గీయుము.
6. భారతదేశ పటమునందు భూకంప మండలాలను గుర్తించుము.

# 2. మహాసముద్ర శాస్త్రము - పరిచయము

భూమి యందు నెలకొనియున్న అనంత జీవకోటి మనుగడయందు మరియు శీతోష్ణస్థితి మార్పులయందు మహాసముద్రములు ప్రధాన పాత్రను పోషించు చున్నవి. మహాసముద్రములు ఖనిజ వనరులకు నిలయముగానున్నవి. సముద్ర తీరములు మరియు దీవుల చుట్టూ అనేక సమస్యలు ఏర్పడుటను మనము చూచుచున్నాము. ముఖ్యముగా సముద్ర తీరములు అదృశ్యమగుట, దీవులు మునిగిపోవుట, నీరు కాలుష్యమగుట, మత్స్యసంపద నాశనమగుట, సముద్రమట్టము పెరుగుట, భౌగోళిక ఉష్ణోగ్రత అధికమగుట మొదలగునవి భూమి యందు మానవుని జీవితమును భయపెట్టుచున్నవి. కావున మహాసముద్ర అమరికను మనము అవగాహన చేసికొనినట్లైతే రాబోవు కాలములో సంభవించు మార్పులను ముందుగానే ఊహించి ఆ సమస్యలన్నింటినీ అధిగమించవచ్చును. ఒక క్రమ పద్ధతిలో సముద్రముల అధ్యయనము ద్వారా పొంచివున్న విపత్తులైన తుపానులు, వరదలు, క్షామము వంటి వాటిని ప్రసారముచేసి, ప్రజలకు హెచ్చరిక జారీచేసి వాటినుండి సరియైన ఉపశమనమును కలిగించవచ్చును.

**మీకు తెలియునా ?**

మహాసముద్రము(Ocean) అనునది గ్రీకు పదమైన "ఓకేనస్" ఓషనస్ నుండి పుట్టినది. ఇది లవణజలము యొక్క ముఖ్య భాగముగాను, జలావరణము యొక్క మౌలిక అంశముగానున్నది.

## మహాసముద్ర శాస్త్రము అనగానేమి ?

మహాసముద్ర శాస్త్రమనునది విజ్ఞాన శాస్త్రములో భాగంగా సముద్రపునీటి భౌతిక, రసాయనిక స్వభావము, లోతు, ఉష్ణోగ్రత, లవణీయత, సముద్ర ప్రవాహములు, అలలు మరియు లోతట్టు ప్రాంతములలో గల వృక్ష మరియు జంతుజాలాన్ని గురించి అధ్యయనము చేయుచున్నది.

మహా సముద్రములు భూఉపరితలంపై సుమారు 71%ను మరియు భూమి మొత్తము నీటిలో 97%ను ఆక్రమించి యున్నది. నీటిచే ఆవరించబడియుండు విశాల ప్రాంతమును మహాసముద్రము అందురు.

భూమికి జలగ్రహము (Water Planet) అని మరొక పేరు కలదు. మన సౌరకుటుంబంలో భూమి యందలి మహాసముద్రములు అద్వితీయమైనవి. సౌరకుటుంబములో భూమి తప్ప ఇతర గ్రహములు నీటిని కలిగి యుండుట లేదు. (ఇటీవలి పరిశోధనలలో అంగారక గ్రహమునందు నీటి జాడలు ఉన్నవని తెలియుచున్నది.) భూమిపై జీవరాశులు మొట్ట మొదట సముద్రములలో ఆవిర్భవించి ఉండవచ్చునని భావించబడుచున్నది.

భూమినందలి మహా సముద్రములు అనేక విధులను నిర్వహించుచున్నవి. ముఖ్యముగా వాతావరణము మరియు ఉష్ణోగ్రతలపై ప్రభావము చూపుచున్నది. సూర్యకిరణములను గ్రహించుట ద్వారా భూమి యొక్క ఉష్ణోగ్రతను మార్పు చేయుచున్నది. గ్రహించిన ఉష్ణశక్తిని సముద్ర ప్రవాహములు ప్రపంచమంతా వ్యాపింపజేయు చున్నవి.


పసిఫిక్, అట్లాంటిక్, హిందూ, ఆర్కిటిక్ మరియు అంటార్కిటికా మనకు బాగుగా తెలిసిన 5 మహాసముద్రములు. ఇవి ఒక దానితో నొకటి సముద్రములు, సింధు శాఖలు, అఖాతములు, జలసంధులు మరియు కాలువలచే కలుపబడియున్నవి.

## పసిఫిక్ మహాసముద్రము

పసిఫిక్ మహాసముద్రము అత్యంత పొడవైనది మరియు లోతైనది. ఇది త్రికోణ ఆకృతిలో ఉన్నది. ఇది భూ ఉపరితల మొత్తము వైశాల్యములో 33% ఆక్రమించుకొని యున్నది. దీని సరాసరి లోతు 5000 మీటర్లు. దీనికి పశ్చిమమున ఆసియా మరియు ఆస్ట్రేలియా, తూర్పున ఉత్తర అమెరికా మరియు దక్షిణ అమెరికా, దక్షిణమున అంటార్కిటికా సరిహద్దులుగా యున్నవి.

దక్షిణ పసిఫిక్‌లో యున్న చాలంజర్ అఖాతము (మరియానా అఖాతము) ప్రపంచంలోనే లోతైన భాగము. దీని లోతు 11,933 మీటర్లు. పసిఫిక్

# ప్రపంచములోని సముద్రములు మరియు మహా సముద్రములు



మహాసముద్రములో దాదాపుగా 20,000 దీవులు గలవు. న్యూజిలాండు, ఇండోనేషియా, జపాను మరియు హవాయ్ ప్రసిద్ధి చెందిన దీవులు.

### అట్లాంటిక్ మహాసముద్రము

అట్లాంటిక్ మహాసముద్రము పొడవైన 'S' ఆకృతిని కలిగియున్నది. ఇది భూమి యొక్క మొత్తము వైశాల్యములో 16.5 % వరకు వ్యాపించి యున్నది. దీని వైశాల్యము పసిఫిక్ మహాసముద్రములో సుమారు 50% ఉన్నది. దీనికి పశ్చిమమున ఉత్తర అమెరికా మరియు దక్షిణ అమెరికా, తూర్పున ఐరోపా మరియు ఆఫ్రికాలు సరిహద్దులుగా కలవు. గ్రీన్‌లాండ్, బ్రిటీష్ దీవులు, న్యూఫౌండులాండు, పశ్చిమ ఇండియా దీవులు(వెస్ట్ ఇండీస్) వెర్డీ అగ్రము మరియు కేనరీస్ అట్లాంటిక్ మహా సముద్రములో గల ముఖ్యమైన దీవులు. అట్లాంటిక్ మహా సముద్రము నందలి వాణిజ్య మార్గము ప్రపంచములోనే అత్యధిక రద్దీగల వాణిజ్య మార్గముగా పరిగణింపబడుచున్నది.

### హిందూ మహాసముద్రము

ప్రపంచములోయున్న అన్ని మహాసముద్రముల మొత్తము వైశాల్యములో హిందూ మహాసముద్రము 20% ఆక్రమించియున్నది. దీనికి ఉత్తరమున ఇండియా, పాకిస్థాన్ మరియు ఇరాన్ తూర్పున ఆస్ట్రేలియా, సుంధా దీవులు మరియు మలేషియా, పశ్చిమమున అరేబియా ద్వీపకల్పము మరియు ఆఫ్రికా సరిహద్దులుగా అమరియున్నవి. వాయువ్యము వైపున హిందూ మహాసముద్రము ఆఫ్రికా యొక్క దక్షిణాగ్రములో అట్లాంటిక్ మహాసముద్రముతో కలియును. తూర్పు మరియు ఆగ్నేయమున ఫసిఫిక్ మహాసముద్రముతో కలియును. ఈ మహాసముద్రము సరాసరి లోతు సుమారు 4,000 మీటర్లు. అండమాన్, నికోబారు, మాల్దీవులు, మడగాస్కర్, శ్రీలంక సుమత్రా మరియు జావా హిందూ మహాసముద్రములో ప్రసిద్ధి చెందిన దీవులు. ఇది మాత్రమే ఒక దేశము పేరుతో పిలువబడుచున్న మహాసముద్రము. ప్రాచీన కాలము నుండి వర్తకులకు పరిచయమయిన చారిత్రాత్మక వర్తక మార్గముగా యున్నది.

### అంటార్కిటికా మహాసముద్రము

అంటార్కిటికా ఖండమునందు ఇది నాల్గవ పెద్దది, చల్లని మరియు దక్షిణార్ధపు అంచులో అమరియున్న మహాసముద్రము. సాధారణంగా ఇది "దక్షిణ మహాసముద్రము" అని పిలువబడుచున్నది. అలెగ్జాండర్ దీవులు, బాలినీ దీవులు మరియు రోస్ దీవులు ఈ మహాసముద్రములో ఉన్న కొన్ని ప్రసిద్ధ దీవులు. దీని సరాసరి లోతు 4,500 మీటర్లు. ఉష్ణోగ్రత $-2^0$ నుండి $10^0$c వరకు మారుచుండును. శీతాకాలములో ఈ మహాసముద్రపు ఉపరితల భాగము సగముకంటె అధికముగా మంచుచే కప్పబడి యుండును.

### ఆర్కిటిక్ మహాసముద్రము

ఆర్కిటిక్ మహాసముద్రము దాదాపు వృత్తాకారములో భూమి యొక్క ఉత్తర ధ్రువములో ఆవరించియున్నది. దీని మొత్తము వైశాల్యము సుమారు 14 మిలియన్ల చదరపు కిలోమీటర్లు. దీని సరాసరి లోతు 4,000 మీటర్లు. దీనిలోని ముఖ్యమైన దీవులు విక్టోరియా దీవులు, ఎలిజబెత్ దీవులు, ఐస్‌లాండు దీవులు, స్పిట్స్‌బెర్గెన్ మరియు నోవాగా సోమ్లియ.

### ప్రపంచములోని సముద్రములు

మహాసముద్రము కంటే తక్కువ పరిమాణములో నీరు కలిగి అనేక దారులు కలిగియున్న ప్రాంతమును సముద్రములు అందురు. సముద్రములు సాధారణంగా కొంత భూభాగముచే ఆవరించబడి యుండును. దక్షిణ చైనా సముద్రము, కరేబియన్ సముద్రము, మధ్యధరా సముద్రము మొదలగునవి ప్రపంచములోగల ముఖ్యమైన సముద్రములు.

### మహాసముద్ర భూతల నైసర్గిక స్వరూపము

నేల మరియు సముద్రము కలిసే ప్రదేశములో మహాసముద్ర భూతలము ప్రారంభమగును. సముద్ర తీరప్రాంతము అస్థిరమైనది. ఇది అలలు మరియు సముద్రపు గాలుల చర్యల వలన మార్పులకు గురియగుచుండును. మహాసముద్ర భూతలము నైసర్గిక స్వరూపము మూడు భాగములుగా విభజింపబడియున్నది. అవి 1. ఖండతీరపు అంచు 2. ఖండతీరపు ఏటవాలు మరియు 3. సముద్ర భూతలము (అబిస్సాల్ మైదానము).

## ఖండతీరపు అంచు

ఖండతీరపు అంచు అనునది సముద్రతీర సమీపమున తక్కువలోతు గల భాగము. దీని లోతు సుమారు 100 మీటర్లు. ఈ ఖండతీరపు అంచు చేపలు పట్టుటకు అనుకూలమైన స్థలము. ఇచ్చట చేపల ఆహారమైన సముద్ర నాచు మొక్కలు (Plankton) అధికముగా కనిపించును. ఉదాహరణకు న్యూఫౌండులాండులో గల గ్రాండ్‌బాంక్ మరియు బ్రిటనులో గల డాగర్ బ్యాంక్. ఈ ఖండతీర ప్రాంతములో అనేక లోతైన పెట్రోలియం బావులు కనిపించును. ఉదాహరణకు ముంబాయి హై (ఇండియా).

## ఖండతీరపు వాలు

ఖండతీరపు వాలు విపరీతమైన ఏటవాలును కలిగియుండును. ఇది ఖండతీరపు అంచు మరియు మహాసముద్ర భూతలమును కలుపును. ఖండతీరపు వాలు మరియు ఖండతీరపు అంచును కలిపి "ఖండాంతర అంచు" అందురు.


ఖండాంతర ఏటవాలు యొక్క సరాసరి లోతు సుమారు 155 మీటర్లు.

క్రమబద్ధంగాలేని సముద్రతీరము మరియు లోతైన ఖండతీరపు వాలు సహజ రేవులు ఏర్పడుటకు ఆవశ్యకమైనవి. ఉదాహరణ: కొచ్చిన్ మరియు ముంబై ఓడరేవులు. ఖండతీరపు వాలునందు భూగర్భజల అగాథ మార్గము, నిటారైన ఎత్తైన కొండలు మరియు బురద చరియలు కనబడుచున్నవి.

సముద్రములో గల కొండల చుట్టూ క్రింది మట్టములో సముద్ర అగాథ మైదానము (Abyssal plain)ఉండును. ఈ మైదానములు నశించిన జీవరాశుల సేంద్రియ పదార్థములచే నింపబడి యుండును. సముద్రం మధ్యలో గల పర్వతశ్రేణి (Ocean Ridge) టెక్టానిక్ ఫలకముల బలముచే ఏర్పడుచున్నది.

## సముద్ర పర్వతములు

సముద్ర అంతర్భాగములో గల అగ్నిపర్వత విస్ఫోటనముల వలన సముద్ర పర్వతములు ఏర్పడుచుండును. ఈ సముద్ర పర్వతములు సముద్ర నీటి ఉపరితలము మీద కనిపించుటను దీవులు అందురు. సముద్ర మట్టమునకు పైన గల దీవులు అలలు మరియు వాతావరణ ప్రక్రియ వలన క్షయము చెంది క్రింది భాగమునకు వెళ్లినట్లయితే వాటిని గయాట్ (guyot) అని అందురు.





మహాసముద్ర భూతల నైసర్గిక స్వరూపము

సాంఘిక శాస్త్రము

మహాసముద్రపు అఖాతము (Ocean Trenches) అనునది మహాసముద్రములోని మిక్కిలి లోతైన భాగము. రెండు టెక్టానిక్ ఫలకములు ఒకదానితో నొకటి ఢీకొన్నప్పుడు అధిక సాంద్రత గల ఫలకము ఒత్తిడిచేత తక్కువ సాంద్రత గల ఫలకము క్రిందకు నెట్టబడినపుడు మహాసముద్ర అఖాతములు ఏర్పడుచున్నవి.

## జలచక్రము

నీరు భూభాగము నుండి ఆకాశమునకు చేరి మరలా భూమికి చేరును. దీనినే జలచక్రము అందురు. భూమి మీద గల మహాసముద్రములు, చెరువులు, సరస్సులు, నదులలో గల నీరు సూర్యుని ఉష్ణశక్తి వలన ఆవిరి చెందును. అంతేకాక వృక్షములు కిరణజన్య సంయోగక్రియ ద్వారా నీటిని గాలిలోనికి విడుదల చేయును. దీనినే బాష్పోత్సేకము అందురు. ఈ నీటి ఆవిరి అతి సూక్ష్మ నీటి బిందువులుగా ఘనీభవించి మేఘములుగా ఏర్పడుచున్నవి. చివరకు మేఘములు ఘనీభవించి చాలా చిన్న నీటి బిందువులుగా రూపొందును. అట్టి మేఘములు పూర్ణ రూపము దాల్చి వర్షపాతముగా (వర్షము, వడగండ్లు లేక మంచు) కురియుచున్నది. తిరిగి నీరు భూభాగమును లేక సముద్రమును చేరును. కురిసిన వర్షము నీటిలో కొంత భాగము భూమిచే పీల్చబడి శిలలు లేక ఒండ్రుమన్ను పొరల మధ్య చేరును. ఈ విధంగా భూమి లోపల చేరిన నీటిని భూగర్భజలమందురు. కాని అధిక పరిమాణములో నీరు శిఖరపు ఏటవాలు నుండి వేగముగా ప్రవహించి కొంచెము ఉప్పు కలిగిన నీరుగా మారి చివరకు సముద్రములో చేరును. సముద్రపు నీటిలో సోడియం క్లోరైడు, మెగ్నీషియం క్లోరైడు, మెగ్నీషియం సల్ఫేటు, కాల్షియం సల్ఫేటు, పొటాషియం సల్ఫేటు, కాల్షియం కార్బనేటు మరియు మెగ్నీషియం బ్రోమైటు వంటి సాధారణ లవణములు అధిక పరిమాణములో కలిసియుండును.




జల చక్రము

## సముద్రపు నీరు ఉప్పుగా యుండును. ఎందులకు ?

నీరు నదులలో ప్రవహించేటపుడు నదీ మార్గములో గల శిలలు మరియు మన్నునందలి ఉప్పు ఖనిజాలను గ్రహించుకొనును. ఈ తక్కువ ఉప్పు లవణాలు గల నీరు మహాసముద్రములు మరియు సముద్రములలో కలియును. భాష్పీభవన చర్యవలన సముద్రంలో గల నీరు మాత్రమే ఆవిరియగును. కాని ఉప్పుమాత్రము ఆవిరి కాక నిక్షేపము అగుచున్నది. కావున సముద్రపు నీరు కాలక్రమములో ఉప్పు నీరుగా ఏర్పడుచున్నది.

**కృత్యము**

మీరు సముద్రపు నీటిని రుచి చూచియున్నారా? ఎందులకు ఉప్పు స్వభావమును కలిగియున్నది?

## లవణీయత

లవణీయత అనునది సముద్రపు నీటిలో కరిగియున్న ఉప్పు పరిమాణమును సూచించును. సముద్రపు నీటిలో ఉన్న ఉప్పు పరిమాణము యొక్క సాంకేతిక పదమే లవణీయత. లవణీయతను సాధారణంగా ఒక లీటరు నీటిలో ఎన్ని గ్రాముల ఉప్పు కరిగియున్నదో సూచించును. (సంకేతాక్షరము $^0/_{00}$) ప్రపంచములోని మహాసముద్రముల యొక్క సరాసరి లవణీయత కిలోగ్రాముకు 35 గ్రాములు.

**కృత్యము**

ఒక్కొక్క మహాసముద్రములోని లవణీయత వేరు వేరుగా ఉండుటకు కారణమేమి ?

మృత సముద్రము, ఎర్ర సముద్రము మరియు పర్షియన్ సింధు శాఖలోని లవణీయత అధిక పరిమాణములో యున్నది. దీనిలోని లవణీయత పరిమాణము 40 గ్రాములు. అధిక భాష్పీభవనము మరియు తక్కువ పరిమాణములో మంచి నీరు

చేరుటయే దీనికి ముఖ్య కారణము. సముద్రములన్నింటిలో మృతసముద్రము ఎక్కువ పరిమాణములో ఉప్పును కలిగియున్నది. ధ్రువప్రాంతములోయున్న సముద్రములలో లవణీయత అతి తక్కువగా ఉండుటకు మంచు కరుగుట మరియు అధిక వర్షపాతమే కారణము.

**కృత్యము**

నేలచే ఆవరించబడియున్న ఉష్ణమండల సముద్రములలో లవణీయత శాతము అధికముగా ఉండును. ఎందులకు ?

## మహాసముద్రముల ఉష్ణోగ్రత

మహాసముద్రములలో ఉండు జీవరాశుల లక్షణములను నిర్ణయించుటలో మహాసముద్రపు నీటి ఉష్ణోగ్రత ముఖ్యపాత్రను పోషించుచున్నది. సముద్రపు నీటి ఉష్ణోగ్రత మార్పుల వలన మహా సముద్రములో ప్రవాహములు మరియు ఇతర నీటి చలనములు ఏర్పడుచున్నవి. మహాసముద్రములు సౌరశక్తిని గ్రహించి నిల్వయుంచుకొను సామర్థ్యమును కలిగియుండుట వలన భూమిపై ఉష్ణసమతుల్యమును ఏర్పరచుటలో ప్రధాన పాత్రను పోషించుచున్నది. భూఉపరితలము త్వరగా వేడెక్కి త్వరగా చల్లబడు చున్నది. కాని నీటి ఉపరితలము నిదానముగా వేడెక్కి నిదానముగా చల్లబడుచున్నది. ఈ విధముగా భూమి మరియు నీటి ఉష్ణోగ్రతల మార్పుల వలన భూమి ఉపరితలములో గల మహాసముద్రములు మరియు ఖండములలో వలురకములైన శీతోష్ణస్థితి కనబడుచున్నది.

మహాసముద్రముల ఉపరితల ఉష్ణోగ్రతను అనేక అంశములు నియంత్రించుచున్నవి. అవి అక్షాంశములు, సముద్ర ప్రవాహములు, పవనములు మరియు స్థానిక వాతావరణము.

## అలలు

మహాసముద్రములోని నీరు ఎల్లప్పుడు పైకి క్రిందికి చలించుచుండును. ఈ నీటి కదలికలనే అలలు అని అందురు. గాలి వీచుటయే అలలు ఏర్పడుటకు ముఖ్యకారణము. సహజంగా చాలా వరకు అలలు గాలుల వలననే ఏర్పడుచున్నవి.

## మహాసముద్ర ప్రవాహములు

సాధారణముగా మహాసముద్ర ప్రవాహములు ఒక నిర్ధిష్ట దిశలో అధిక వైశాల్యములో చలించు నీటిని సూచించును.

మరొక విధముగా చెప్పాలంటే సముద్రములో ఎలాంటి అదుపు లేకుండా సమాంతరంగా ప్రవహించు నీటిని సముద్ర ప్రవాహములు అందురు. ఈ సముద్ర ప్రవాహములు నదులవలె నిర్దిష్ట మార్గముతో వేగముగా ప్రవహించును. సముద్ర ప్రవాహములు రెండు రకములు అవి కవోష్ణ సముద్ర ప్రవాహములు మరియు శీతల సముద్ర ప్రవాహములు. కవోష్ణ ప్రవాహములు తక్కువ అక్షాంశము నుండి ఉద్భవించి ధ్రువముల వైపుకు పయనించును. అయితే శీతల ప్రవాహములు అధిక అక్షాంశము నుండి ఉద్భవించి భూమధ్య రేఖా ప్రాంతపు దిశకు పయనించును.

మహా సముద్ర ప్రవాహములు ఏర్పడుటయందు అనేక అంశములు ప్రభావితము చేయుచున్నవి. అవి

1. ఉష్ణోగ్రతలలో వ్యత్యాసము
2. సముద్రపు నీటి సాంద్రత (లవణీయత)
3. పవనములు మరియు వాయుమండల పీడనము
4. కోరియోలిస్ బలము
5. భూమ్యాకర్షణ బలము
6. వర్షము కురియుట మరియు నీరు ఆవిరియగుట
7. మంచు కరుగుట

## వేలా తరంగాలు

సముద్రపు నీటి మట్టము పెరుగుట మరియు తగ్గుటనే వేలా తరంగములందురు. ఇది సూర్యుడు మరియు చంద్రుని ఆకర్షణ బలముచేత ప్రతి రోజు 6 గంటల కాలవ్యవధిలో సంభవించును. సముద్ర నీటి మట్టము పెరుగుటను పోటు (Highl tide) అని తగ్గుటను పాటు(Low tide) అనియు అందురు.

పర్వవేలా తరంగాలు (Spring tide) అమావాస్య మరియు పౌర్ణమి రోజులలో ఏర్పడుచున్నవి. ఈ రోజులలో సూర్యుడు, చంద్రుడు మరియు భూమి ఒకే సరళరేఖలో యుండును. ఇటువంటి రోజులలో చంద్రుడు మరియు సూర్యుని

గురుత్వాకర్షణ శక్తి కలిసియుండును. ఈ సమయములలో పోటులు అధిక ఎత్తులోను పాటులు తక్కువ ఎత్తులోను ఏర్పడును.

హ్రస్వ వేలా తరంగాలు (Neap Tides) చంద్రుని యొక్క మొదటి మరియు మూడవ దశలో ఏర్పడును. దీని ఫలితముగా చంద్రుని ఆకర్షణ శక్తి వరస్పరము లంబముగా ఏర్పడును. ఈ సమయములలో పోటులు తక్కువ ఎత్తులోను పాటులు ఎక్కువ ఎత్తులోను ఏర్పడును.

**కృత్యము**

సముద్రపు వనరులను పట్టికలో పొందు పరచుము.


## మానవ జీవితముపై మహాసముద్రముల ప్రభావము.

మహాసముద్రములు మానవుని సహజ పర్యావరణ పరిస్థితుల యందు ముఖ్య పాత్రను పోషించుచున్నది. మహా సముద్రములు మానవున్ని అనేక రకములుగా తాను అనుభవించుచున్న శీతోష్ణస్థితి, ఆక్సిజన్‌ను శ్వాసించుట, మానవుడు భుజించు ఆహారము నుండి ఆర్థిక, సాంఘిక, రాజకీయ మరియు సైనిక పరిస్థితుల వరకు ప్రభావితం చేయుచున్నది.

మహాసముద్రములు మాంసకృత్తులు కలిగిన మత్స్య సంపదను కలిగియున్నవి. సముద్రములలో వలురకములైన విలువ గల్గిన లోహములు అధికముగా యున్నవి. వాటిలో బంగారు, వెండి మాంగనీసు, పెట్రోలు, ముత్యాలు ముఖ్యమైనవి. ఇంతేకాకుండా సముద్రపు నీటిలో మెగ్నీషియం, బ్రోమైన్ మరియు సోడియం క్లోరైడు లేక సాధారణ ఉప్పు మొదలగు ఇతర ఖనిజములు కూడా కలవు. భవన నిర్మాణమునకు కావలసిన ఇసుక, కంకర రాళ్ళు మరియు గవ్వలు, తక్కువ పరిమాణములో వజ్రములు మహాసముద్ర అడుగు భాగములో కనబడును.

సముద్ర తీరప్రాంతములో గల చమురు మరియు సహజవాయువు బావులు ప్రపంచపు పెట్రోలు ఉత్పత్తిలో 17%ను అందించుచున్నవి. ఇంకనూ మహా సముద్రములు ప్రత్యామ్నాయ శక్తి వనరులుగా ఉపయోగించుటకు అవకాశములు కలిగియున్నవి. సముద్రములు సౌరశక్తిని గ్రహించుట వలన వెచ్చదనమును పొంది నీటి ప్రవాహములు ఏర్పడును. ఈ ప్రవాహములు విద్యుత్ శక్తిగా మార్చుటకు వీలగును. ఈ ప్రక్రియనే మహాసముద్ర ఉష్ణశక్తి మార్పిడి (Ocean Thermal Energy Conversion (OTECH)) అని పిలువబడుచున్నది.

ప్రపంచము – ప్రధాన మహాసముద్ర ప్రవాహములు




భౌతిక శాస్త్రము

## అభ్యాసం

**I) సరిమైన సమాధానములను ఎన్నుకొనుము ?**

1. నీటిచే ఆవరించబడియుండు విశాలప్రాంతమును ____________ అని పిలువబడును.

   ఎ) మహాసముద్రము బి) సముద్రము సి) సింధు శాఖ డి) అఖాతము

2. అట్లాంటిక్ మహాసముద్రము ____________ ఆకృతిలో యున్నది.

   ఎ) "L" బి) "S" సి) "U" డి) "O"

3. గురుత్వాకర్షణ కారణముగా సముద్రపు నీరు పైకి క్రిందికి చలించుటను ____________ అందురు.

   ఎ) వేలా తరంగాలు బి) సముద్ర ప్రవాహములు సి) సునామీ డి) అలలు

4. నీటి అడుగున గల పర్వతముల ఎత్తైన భాగము ____________ అగును.

   ఎ) గయాట్ బి) సముద్ర భూతలము

   సి) సముద్ర పర్వతము ఈ) సముద్రపు పర్వతశ్రేణి

5. జలావరణ చక్రమును ____________ అని కూడా అందురు.

   ఎ) హైడ్రోజను చక్రము బి) ఆక్సిజను చక్రము సి) జలచక్రము డి) కార్బన్ చక్రము

**II) క్రింది ఖాళీలను పూరించుము.**

1. భూమికి గల మరొక పేరు ____________.
2. దక్షిణ పసిఫిక్‌లో గల లోతైన అగాథము ____________
3. భూమిచే కొంత ఆవరించబడి అనేక దారులు కలిగియుండు నీటి భాగమును ____________ అందురు.
4. సముద్ర భూతల మైదానము ____________ తో ఆవరించబడి యుండును.
5. అలలు ఏర్పడుటకు ముఖ్యమైన కారణము ____________.

**III) క్రింది ప్రశ్నలకు సమాధానము లిమ్ము.**

1. లవణీయత అనగా నేమి ?
2. మహాసముద్ర ప్రవాహములు అనగానేమి ?
3. అలలు ఏవిధముగా ఏర్పడును ?
4. మహాసముద్ర శాస్త్రము అనగా నేమి ?
5. మహాసముద్రపు వనరులను తెల్పుము.

**IV) క్రింది ప్రశ్నలకు విపులముగా సమాధానములిమ్ము.**

1. హిందూ మహాసముద్రమును గురించి చర్చించుము.
2. మహాసముద్ర భూతలమును చక్కటి పటముతో వివరించుము.
3. జలావరణ చక్రమును ఉదాహరణముతో వివరింపుము.
4. వేలా తరంగాలు అనగా నేమి ? వివరించుము.
5. మానవుని జీవితముపై మహా సముద్రములు ఏ విధముగా ప్రభావమును చూపు చున్నవి ?
6. ప్రపంచములోని మహాసముద్రములను గురించి ఒక వ్యాసమును వ్రాయుము.

## V) పట నైపుణ్యము

1. ప్రపంచ పటము నందు మహా సముద్రములు మరియు సముద్రములను గుర్తించుము?
2. ప్రపంచ పటమునందు ఉష్ణ మరియు శీతల సముద్ర ప్రవాహములను గుర్తించుము?

## రూపక నిర్ధారణ

1. ప్రపంచ పటమునందు సముద్రములు మరియు మహాసముద్రములను గుర్తించుము.
2. భారతదేశానికి పొడవాటి ఖండతీరపు అంచు కలిగివుండుట వలన గల అనుకూల, ప్రతికూల పరిస్థితులను తెలియజేసే ఒక చర్చను చేపట్టుము.
3. మహాసముద్ర భూతలము యొక్క నైసర్గిక స్వరూపమును తెలిపే నమూనాలను తయారుచేయుము.
4. పర్వవేలా తరంగాలు మరియు హ్రస్వవేలా తరంగాలను తెలిపే ఒక చార్టును తయారుచేయుము.
5. ప్రపంచ పటమునందు ప్రధాన సముద్ర ప్రవాహాలను గుర్తించుము.

# 1. ఐక్యరాజ్యసమితి

మన ప్రపంచమునందు 1939 నుండి 1945 వరకు జరిగిన రెండవ ప్రపంచయుద్ధము, మొదటి ప్రపంచయుద్ధము కన్నా అధిక వినాశమును కలిగించినది. ఈ యుద్ధములో 50 మిలియన్ల కన్నా అధిక మొత్తములో ప్రజలు ప్రాణములు కోల్పోయిరి. మొదటి ప్రపంచయుద్ధానంతరము ఏర్పడిన ప్రపంచ సంస్థ అయిన నానాజాతి సమితి శాంతి భద్రతలు నెలకొల్పుటలో విఫలమగుట వలన రెండవ ప్రపంచయుద్ధము ఏర్పడినది.

అమెరికా, సోవియట్ రష్యా(USSR) మరియు ఇంగ్లాండు దేశములు తక్షణమే ప్రపంచము నందు శాంతిని నెలకొల్పుటకు ఒక నూతన సంస్థ ఆవశ్యకమని భావించినది. ఈ తలంపు ఐక్యరాజ్యసమితి స్థాపనకు దారితీసినది.

## ఐక్యరాజ్యసమితి ప్రారంభకాల ప్రణాళిక

1939లో అమెరికా సంయుక్త రాష్ట్రముల రాష్ట్రీయ ఇలాకా మద్దతు సమక్షములో నూతన ప్రపంచసంస్థ కొరకు దృఢమైన ప్రణాళిక ఏర్పరచబడెను. ప్రపంచశాంతి కొరకు పాటుబడు మిత్రరాజ్యములను సూచించువిధంగా ఐక్యరాజ్యసమితి అను సంస్థను మొదటగా అమెరికా మాజీ అధ్యక్షుడైన ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్ రూపకల్పన చేసెను. 1942 జనవరి 1వతేదీ 26 దేశములు వాషింగ్టన్ DC లో అట్లాంటిక్ శాసనమునందు సంతకము చేసినవి. ఈ శాసనములో మొట్టమొదట ఐక్యరాజ్యసమితి అనుపేరు అధికారపూర్వకముగా ఉపయోగించబడెను.

### అట్లాంటిక్ శాసనము

అట్లాంటిక్ శాసనము కొన్ని సూత్రముల సమూహముతో శాంతిభద్రతలను కాపాడుట కోసం ఏర్పాటు చేయబడినది. దీనిలో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్, ఇంగ్లాండు ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్ 1941 ఆగష్టు14న అట్లాంటిక్ మహాసముద్రములో HMS వేల్స్ యువరాజు అను నౌకలో సంతకాలు చేసిరి. కావున ఈ శాసనమును అట్లాంటిక్ శాసనమని అందురు.

## ఐక్యరాజ్యసమితి శాసనము (UN Charter)

వివిధ ప్రాంతములలో అనేక సమావేశములు జరిగిన పిదప ఐక్యరాజ్యసమితి స్థాపించబడెను. ఐక్యరాజ్యసమితి సమావేశము 1945 ఏప్రిల్ 25వ తేదీ ఐక్యరాజ్యసమితి శాసనము లిఖించుట కొరకు శాన్‌ఫ్రాన్సిస్కోలో సమావేశము ప్రారంభించబడెను. UN శాసనము యొక్క లక్ష్యములు, ఉద్దేశ్యములు మరియు నియమనిబంధనలను అనుసరించి ఐక్యరాజ్యసమితి పనిచేయును. 1945 జూన్ 26వ తేదీ 50 దేశాల ప్రతినిధులు UN శాసనములో సంతకము చేసిరి. తరువాత పోలెండు కూడా ఈ శాసనములో సంతకము చేసెను. ఐక్యరాజ్యసమితి అక్టోబరు 24, 1945 సంవత్సరమున అమలునకు వచ్చినది. అప్పటినుండి ప్రతి సంవత్సరము అక్టోబరు 24వ తేదీని ఐక్యరాజ్యసమితి (UNO)దినోత్సవముగా జరుపుకొనుచున్నారు.

### ఐక్యరాజ్యసమితి ఏర్పడుటకు మునుపు జరిగిన ముఖ్య సమావేశములు

అక్టోబరు 30, 1943 – మాస్కో
డిసెంబరు 1, 1943 – టెహరాన్
సెప్టెంబరు 21, 1944 – డంబార్టన్ ఓక్స్
అక్టోబరు 7, 1944 – డంబార్టన్ ఓక్స్
ఫిబ్రవరి 11, 1945 – యాల్టా

## సభ్యత్వ దేశాలు

ఐక్యరాజ్యసమితి శాసనమును అంగీకరించి శాంతిని కోరుకొనే దేశములు ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం పొందినవి. ప్రస్తుతం 193 దేశాలు ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశాలుగా యున్నవి. ఐక్యరాజ్యసమితి యొక్క ప్రధాన కార్యాలయము న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్ అను అంతర్జాతీయ ప్రాంతములో కలదు.

## ఐక్యరాజ్యసమితి యొక్క చిహ్నము, పతాకము మరియు భాషలు

ఐదు ఏక కేంద్రీకృత వృత్తములను ఉత్తర ధృవము నుండి చూచిన తెలియు ప్రపంచపట స్వరూపము, దీనిని ఆవరించి సమితి యున్న ఆలివ్

శాఖలను కలిగిన పటము ఐక్యరాజ్యసమితి యొక్క చిహ్నముగా ఏర్పరచబడియున్నది. ఆలివ్ శాఖలు ప్రపంచశాంతిని సూచించు రీతిలో, ప్రపంచపటము ప్రపంచశాంతి భద్రతలను సాధించాలనే ఐక్యరాజ్యసమితి యొక్క ముఖ్యలక్ష్యమును సూచించు విధముగా ఏర్పరచబడియున్నది.



UNO చిహ్నము

**ఐక్యరాజ్యసమితి విధులు:**

- శాంతిని నెలకొల్పుట, అభిప్రాయబేధములను అరికట్టుట, శరణార్థుల రక్షణ.
- తీవ్రవాదమును ఎదుర్కొనుట, సైన్యపరిమితిని తగ్గించుట మరియు నిరాయుధీకరణ.
- ప్రజాస్వామ్యమును మెరుగుపరుచుట.
- శాశ్వతమైన అభివృద్ధి, స్నేహపూర్వక వాతావరణమును పెంపొందించుట.
- అంతర్జాతీయ ఆరోగ్యమును మెరుగుపరచుట మరియు శిశుసంరక్షణ,
- చిన్నమ్మోరు వ్యాధివలన ఏర్పడు మరణ శాతమును తగ్గించుట, పోలియో నిర్మూలన,
- మలేరియా వ్యాధి వలన సంభవించు మరణములను అరికట్టుట, ఆహార ఉత్పత్తిని పెంచుట.

ఐక్యరాజ్యసమితి పతాకము లేత నీలిరంగుతో మధ్యలో తెల్లని రంగులో గల ఐక్యరాజ్యసమితి చిహ్నావేమును కలిగియున్నది. ఐక్యరాజ్యసమితి యొక్క అధికార భాషలు : ఆంగ్లము, ఫ్రెంచి, స్పానిష్, రష్యన్, చైనీస్ మరియు అరబిక్.

## ఐక్యరాజ్యసమితి ముఖ్య ఉద్దేశ్యములు

ఐక్యరాజ్యసమితి ఉద్దేశ్యములు ఏవనగా

సభ్య దేశముల మధ్య ఏర్పడు వివాదములను శాంతియుతంగా పరిష్కరించుట

అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడుట.

ప్రపంచదేశముల మధ్య స్నేహపూర్వక సంబంధాలను అభివృద్ధిపరచుట.

అంతర్జాతీయ ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక లేక మానవతా సమస్యలను పరిష్కరించుటకు సహకరించుట.

సాంఘికాభివృద్ధిని సాధించుట, మెరుగైన జీవన ప్రమాణమును పెంపొందించుట మరియు మానవహక్కులను కాపాడుట.

## ఐక్యరాజ్యసమితి (UNO) సహస్ర సంవత్సర అభివృద్ధి లక్ష్యములు

UNO ప్రస్తుత సహస్ర సంవత్సరములకు క్రింది గల లక్ష్యములను రూపొందించెను.

1. తీవ్రమైన పేదరికము మరియు ఆకలిని నిర్మూలించుట.
2. అందరికిని ప్రాథమిక విద్యను కల్పించుట.
3. స్త్రీ, పురుషుల సమానత్వమును మరియు స్త్రీల సాధికారతను అభివృద్ధి పరచుట.
4. శిశుమరణాల శాతమును తగ్గించుట.
5. మాతృ జీవనమును మెరుగు పరచుట.
6. ఎయిడ్స్, మలేరియా మరియు ఇతర వ్యాధులను ఎదుర్కొనుట.
7. పర్యావరణమును రక్షించుట.
8. అభివృద్ధి కొరకు ప్రపంచ దేశాల భాగస్వామ్యమును నెలకొల్పుట.

## ఐక్యరాజ్యసమితి అంగములు

ఐక్యరాజ్యసమితి ఆరు అంగములను కలిగియున్నది. అవి 1. సాధారణ సభ 2. భద్రతామండలి 3. ఆర్థిక సాంఘికమండలి 4. అంతర్జాతీయ న్యాయస్థానము 5. ధర్మకర్తృత్వ సంఘము 6. సచివాలయము.

## 1. సాధారణ సభ

సాధారణ సభ ఐక్యరాజ్యసమితి యొక్క ఒక ముఖ్యమైన అంగము. దీనిని "మానవజాతి పార్లమెంటు" అందురు.

భారతదేశమునకు చెందిన శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ 1953 సంవత్సరమున సాధారణసభకు అధ్యక్షురాలుగా ఎన్నుకొనబడినది.

**నిర్ణయ పద్ధతులు**

ఐక్యరాజ్య సమితియందలి శాంతి భద్రతలు, క్రొత్తగా సభ్యులను చేర్చుకొనుట, బడ్జెట్ విషయములవంటి ప్రధాన అంశములపై నిర్ణయములను తీసుకొనుటకు సాధారణ సభయందు 2/3వంతు మెజారిటీ అవసరము. ఇతర సమస్యలపై నిర్ణయము తీసుకొనుటకు సాధారణ అధికృత (Simple majority) సరిపోవును.

సాధారణసభ సభ్యదేశముల ప్రతినిధులందరిని కలిగియుండును. ప్రతి ఒక్కరు ఒక్క ఓటును కలిగియుందురు. ప్రతి సభ్యదేశము 5 మంది సభ్యులను సాధారణ సభకు పంపుదురు. సాధారణ సభ సంవత్సరమునకు ఒకసారి సమావేశమగును. సాధారణముగా ఈ యొక్క సమావేశము సెప్టెంబరు మాసములో జరుపబడును. భద్రతామండలి కోరికపై సాధారణసభ ప్రత్యేక సమావేశమును కూడా నిర్వహించును. సాధారణసభ ముఖ్య విధులు క్రింద ఇవ్వబడినవి.

1. అధ్యక్షుని మరియు 21 ఉపాధ్యక్షులను ఎన్నుకొనుట. భద్రతామండలిలోని అశాశ్వత సభ్యులను మరియు ఐక్యరాజ్యసమితి యొక్క ఇతర అంగముల సభ్యులను ఎన్నుకొనుట.
2. ఐక్యరాజ్యసమితి బడ్జెట్‌ను ఆమోదించుట.
3. భద్రతామండలి సిఫారసుతో సెక్రటరీ జనరల్‌ను మరియు అంతర్జాతీయ న్యాయస్థానమునకు న్యాయవాదులను నియమించుట.

## 2. భద్రతామండలి

భద్రతామండలి ఐక్యరాజ్యసమితి యొక్క ప్రధాన అంగము. ఇది ఐక్యరాజ్యసమితి యొక్క కార్యనిర్వాహక శాఖగా పనిచేయును. భద్రతామండలి 15 మంది సభ్యులను కలిగియుండును. ఇందులో 5 మంది శాశ్వత సభ్యులు మరియు 10 మంది అశాశ్వత సభ్యులు వుందురు. రష్యా, ఫ్రాన్సు, అమెరికా సంయుక్త రాష్ట్రములు, ఇంగ్లాండు మరియు చైనా శాశ్వత సభ్యత్వదేశములు. అశాశ్వత సభ్యులు 2 సంవత్సరములకొకసారి సాధారణ సభచేత ఎన్నుకొనబడుదురు. భద్రతామండలి ప్రతి నెల సమావేశమై క్రొత్త అధ్యక్షుని ఎన్నుకొనును. భద్రతామండలి ఏతీర్మానమునైనా తీసుకొనుటకు 2/3 వంతు మెజారిటీ అవసరము. శాశ్వత సభ్య దేశములు 'వీటో' అధికారమును కలిగియుండును. (వీటో అనగా నిర్ణయములను త్రోసిపుచ్చు అధికారము)

2010 సం॥లో భారతదేశము భద్రతా మండలి యొక్క అశాశ్వత సభ్యదేశముగా 2 సం॥ల కాలము వరకు ఎన్నుకొనబడినది.

### భద్రతామండలి ముఖ్య విధులు

1. అంతర్జాతీయ శాంతిభద్రతలను కాపాడుట.
2. సభ్యదేశముల మధ్య వివాదములను శాంతియుతంగా పరిష్కరించుట.
3. నూతన సభ్యులకు ప్రవేశమును కల్పించుటకు సిఫార్సు చేయుట.
4. సెక్రటరీ జనరల్ ఎన్నికలో పాల్గొనుట.

## 3. ఆర్థిక మరియు సాంఘిక మండలి

ఐక్యరాజ్యసమితి యొక్క ఆర్థిక మరియు సాంఘిక కార్యక్రమములను మరియు ప్రత్యేక అంగముల కార్యక్రమములను నిర్వర్తించుట ఆర్థిక మరియు సాంఘిక సమితి యొక్క ముఖ్య విధి. ఇది మూడు సంవత్సరములకు ఒకసారి సాధారణసభచే ఎన్నుకొనబడి 54 మంది సభ్యులను కలిగియుండును. ప్రతి మూడు సంవత్సరములకు 1/3 వంతు సభ్యులు పదవీ విరమణ చేయుదురు. వారిస్థానంలో క్రొత్త సభ్యులను ఎన్నుకొందురు. ఇది అవసరమైనప్పుడు సంవత్సరమంతయు సమావేశమగును. దానియొక్క సమావేశము జూలై మాసములో జరుపబడును. ఈ సమావేశములో ముఖ్య ఆర్థిక, సాంఘిక మరియు

మానవతా సమస్యలు అయిన సాంఘికాభివృద్ధి, స్త్రీల స్థితిగతులు, నేర నివారణ, మాదకద్రవ్యాల ఉపయోగములను అరికట్టుట మరియు శాశ్వత అభివృద్ధిని గురించి చర్చింపబడును.

### 4. ధర్మకర్తృత్వ మండలి

అంతర్జాతీయ పర్యవేక్షణ జరుపుటకు ధర్మకర్తృత్వ మండలి స్థాపించబడినది. ఇది ఏడు సభ్యదేశముల పర్యవేక్షణలో గల 11 ధర్మకర్తృత్వ ప్రాంతములకు స్వీయ ప్రభుత్వము లేక స్వతంత్ర్యమును పొందుటకు కావలసిన చర్యలను గైకొనును. 1994 సంవత్సరమునాటికి ధర్మకర్తృత్వ ప్రాంతములన్నియు ప్రత్యేక దేశములుగా లేక ఇరుగు పొరుగు స్వాతంత్ర్య దేశములలో కలిసి స్వాతంత్ర్యమును పొందెను. ఈ మండలి కార్యక్రమములు పూర్తియైన యెడల ధర్మకర్తృత్వ మండలి దీని యొక్క నియమనిబంధనలను సందర్భానుసారముగా సవరణ చేయును.

### 5. అంతర్జాతీయ న్యాయస్థానము

అంతర్జాతీయ న్యాయస్థానమును ప్రపంచ న్యాయస్థానమని కూడా పిలుతురు. ఇది ఐక్యరాజ్యసమితి యొక్క ముఖ్యమైన న్యాయసంబంధ అంగము.ఇందులోని 15మంది న్యాయమూర్తులు సాధారణసభ మరియు భద్రతామండలిచే ఎన్నుకోబడుదురు. అంతర్జాతీయ న్యాయస్థానము ప్రపంచదేశముల మధ్య వివాదములను పరిష్కరించును.

ఈ న్యాయస్థానము ఐక్యరాజ్యసమితికి మరియు దీని ప్రత్యేక సంస్థలకు సలహాలను కూడా ఇచ్చును. అంతర్జాతీయ న్యాయస్థానము హాలెండు రాజధానియైన దిహేగ్(TheHague) లో కలదు.

### 6. సచివాలయము

సాధారణ సభ, భద్రతామండలి మరియు ఇతర అంగముల మార్గదర్శకత్వముతో సచివాలయము ఐక్యరాజ్యసమితి యొక్క పరిపాలనకు సంబంధించిన కార్యకలాపములను నిర్వర్తించును. సెక్రటరీ జనరల్ సచివాలయము యొక్క ప్రధానాధికారి. ఇతడు పూర్తి పరిపాలనా మార్గదర్శకత్వమును వహించును. 2007లో దక్షిణ కొరియాకు చెందిన బాన్-కి-మూన్ ప్రస్తుత సెక్రటరీ జనరల్‌గా ఎన్నుకొనబడెను.

సచివాలయములో గల ఇలాకాలు మరియు కార్యాలయములు సుమారు 7500 మంది సిబ్బందిని కలిగియున్నది. ఈ సిబ్బంది అత్యధిక సమర్థత, నిజాయితీ మరియు అర్హతల ఆధారముగా ఎన్నుకొనబడుదురు.

UNO 30 ప్రత్యేక సంస్థల సహకారముతో కార్యకలాపములను కొనసాగించుచున్నది. ఈ సంస్థలు UNO యొక్క వివిధ లక్ష్యాలను సాధించుటకు సహకరించును.

### ఐక్యరాజ్యసమితి యొక్క ప్రత్యేక సంస్థలు :

FAO - ఆహార, వ్యవసాయ సంస్థ .

ILO - అంతర్జాతీయ కార్మిక సంస్థ.

IMF - అంతర్జాతీయ ద్రవ్య నిధి.

UNICEF - ఐక్యరాజ్య బాలల అత్యవసరనిధి.

UNESCO - ఐక్యరాజ్య విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ.

WHO - ప్రపంచ ఆరోగ్య సంస్థ.

WTO - ప్రపంచ వర్తక సంస్థ మొదలగునవి.

### ఐక్యరాజ్యసమితి సాధనలు

ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడి గొప్ప విజయాల్ని సాధించింది. ప్రపంచదేశాల మధ్య వివాదములను శాంతియుతంగా పరిష్కరించి ప్రపంచయుద్ధములను నివారించింది. ఇది సభ్య దేశముల మధ్యగల సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, మానవతా సమస్యలను పరిష్కరించుటకు సహకరించుచున్నది.

**ఐక్యరాజ్యసమితి ప్రధాన సాధనలు**

1946లో రష్యా తన సైన్యమును ఇరాన్ నుండి, బ్రిటన్ మరియు ఫ్రాన్సు తమ సైన్యమును సిరియా మరియు లెబనాన్ నుండి ఉపసంహరించుకొనునట్లు చేసింది.

1947లో ఇండోనేషియాకు డచ్చ్ నుండి స్వాతంత్ర్యమును సిద్ధింపచేసింది.

1956లో సూయజ్ కాలువ సమస్యలో జోక్యము చేసుకొని చివరకు సూయజ్ కాలువను అంతర్జాతీయ కాలువగా చేసింది.

1962 మరియు1973లో క్యూబా క్షిపణి సమస్యను మరియు మధ్య తూర్పు సమస్యను పరిష్కరించింది.

1988లో ఇరాన్– ఇరాక్‌ల మధ్య యుద్ధమును అంతమొందించినది.

1989లోఆఫ్ఘనిస్తాన్ నుండి రష్యా సైన్యము ఉపసంహరింపజేసెను.

1990లో కువైట్ సార్వభౌమాధికారమును పొందెను. కాంబోడియా, El సాల్వడార్, గౌటెమాలా మరియు మొజాంబిక్‌తో జరిగిన పౌరసత్వ యుద్ధములను అంతమొందించినది.

దీని ప్రత్యేక సంస్థయైన ప్రపంచ ఆరోగ్యసంస్థ (WHO) మశూచిని విజయవంతముగా నిర్మూలించింది. పోలియో, మలేరియా మరియు క్షయ వ్యాధులను నిర్మూలించుటకు కృషిచేయుచున్నది. UNHCR (The United Nations High Commission for Refugees - శరణార్థుల కొరకు ఐక్యరాజ్యసమితి ఉన్నత కార్యాలయము) శరణార్థులకు పునర్నివాసము కల్పించుటకు అత్యధిక కృషిచేసింది. ఐక్యరాజ్యసమితి మరియు దీని అనుబంధ సంస్థలు భవిష్యత్ తరాలకు సురక్షిత ప్రపంచమును ఏర్పరచుట కొరకు కృషిచేయుచున్నది.

## అభ్యాసం

### I) సరియైన సమాధానములను ఎన్నుకొనుము.

1. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయము ____________ వద్ద కలదు.
   ఎ) వాషింగ్టన్ బి) హేగ్ సి) న్యూయార్క్
2. ____________ ను మానవజాతి పార్లమెంటు అందురు.
   ఎ) ధర్మకర్తృత్వ సంఘము బి) సాధారణసభ సి) ఆర్థిక, సాంఘిక మండలి
3. ఐక్యరాజ్యసమితి అధికారభాషలలో ఒకటి ____________.
   ఎ) హిందీ b) జర్మనీ సి) ఫ్రెంచ్
4. భద్రతామండలిలో గల శాశ్వత సభ్యుల సంఖ్య ____________.
   ఎ) 4 బి) 5 సి) 10
5. ____________ చే ప్రవేశపెట్టబడిన కార్యక్రమము మశూచిని విజయవంతముగా నిర్మూలించినది.
   ఎ) WHO బి) ILO సి) UNESCO

సాంఘిక శాస్త్రము

## II) ఖాళీలను పూరింపుము.

1. ఐక్యరాజ్యసమితి అను పదమును ఏర్పరచినవారు ____________.
2. ఐక్యరాజ్య (UN)శాసనములో ________దేశములు 1945 జూన్ 26వ తేదీన సంతకము చేసినవి.
3. ఐక్యరాజ్యసమితి యొక్క కార్యనిర్వహక శాఖ ____________.
4. ____________సంవత్సరములోపు అన్ని ధర్మకర్తృత్వ ప్రాంతములు స్వీయపరిపాలను పొందినవి.
5. అంతర్జాతీయ న్యాయస్థానము హాలెండులోని ____________వద్ద కలదు.

## III) జతపరచుము.

| | |
|---|---|
| 1. ఐక్యరాజ్యసమితి సమావేశము | శరణార్థుల పునర్నివాసము |
| 2. ఐక్యరాజ్యసమితి | శాన్‌ఫ్రాన్సిస్కో |
| 3. బాన్–కి–మూన్ | న్యూయార్క్ |
| 4. ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యాలయము | 1945, అక్టోబరు 24 |
| 5. UNHCR | ఐక్యరాజ్య సెక్రటరీ జనరల్ |

## IV) క్లుప్తముగా జవాబులిమ్ము .

1. ఐక్యరాజ్యసమితి చిహ్నమును గూర్చి విశదీకరించుము.
2. ఐక్యరాజ్యసమితి యొక్క అధికార భాషలేవి?
3. ఐక్యరాజ్య సమితిలోని కొన్ని ప్రత్యేక సంస్థలను తెల్పుము?
4. భద్రతామండలిలో గల శాశ్వత సభ్యులెవరు?
5. అంతర్జాతీయ న్యాయస్థానము యొక్క పాత్ర ఏమి?

## V) విపులముగా సమాధానములిమ్ము.

1. ఐక్యరాజ్యసమితి సహస్ర సంవత్సర అభివృద్ధి (millennium development) లక్ష్యములను గూర్చి వ్రాయుము.
2. ఐక్యరాజ్య సమితి యొక్క ప్రధాన అంగములేవి? సాధారణ సభ మరియు భద్రతా మండలి యొక్క కార్యకలాపములను వివరించుము?
3. ఐక్యరాజ్య సమితి ప్రధాన సాధనలను తెల్పుము?

## రూపక నిర్ధారణ

**1. చార్టును తయారుచేయుము:**

ఐక్యరాజ్యసమితి యొక్క వివిధ అంగములు మరియు వాటి విధులపై చార్టులను తయారుచేయుము.

**2. సామూహిక చర్చ:**

ఐక్యరాజ్యసమితి దాని సభ్యదేశాల మధ్య సాంఘిక, రాజకీయ మరియు సాంస్కృతిక అభివృద్ధికై ఎట్లు తోడ్పాటును అందించుచున్నది – చర్చించుము.

**3. క్విజ్ పోటీ:**

ఐక్యరాజ్యసమితి మరియు దాని సాధనలపై ఒక క్విజ్ పోటీని నిర్వహించుము.

**4. ఇంకను తెలుసుకొనుము:**

ఐక్యరాజ్యసమితి యొక్క ప్రత్యేక సంస్థలను కనీసము పదింటిని మరియు వాటి ప్రధాన కేంద్రములను గుర్తించుము.

**5. చిత్రపట పుస్తకమును తయారుచేయుము:**

ఐక్యరాజ్యసమితి యొక్క భద్రతా అధికారుల చిత్రములను సేకరించి ఒక ఆల్బమ్‌ను తయారుచేయుము.

**6. చేయవలసిన పనులు:**

ఐక్యరాజ్యసమితి భారతదేశము నందలి స్త్రీలు మరియు పిల్లలకు ఏవిధమైన సహాయమును అందించుచున్నది–సమాచారమును సేకరించుము.

# 2. స్త్రీ, శిశు సంక్షేమ పథకములు మరియు శాసనములు

మన భారతదేశము ప్రతి పౌరుని సంక్షేమము కొరకు ముఖ్యముగా పిల్లలు మరియు స్త్రీల సంక్షేమము కొరకు పాటుపడుచున్న సంక్షేమ రాజ్యముగానున్నది. స్త్రీలకు విద్యావకాశములు కల్పించని ఏ ఒక్క దేశము కూడా అభివృద్ధి చెందదు. ఎందుకనగా తల్లియే శిశువునకు మొదటి గురువు. పిల్లలే భావి భారతదేశానికి మూల స్తంభముల వంటివారు. కావున పిల్లలు మరియు స్త్రీల అభివృద్ధికి మనదేశము ఎక్కువ ప్రాధాన్యతను యిచ్చుచున్నది.

### శిశు సంక్షేమ శాసనములు (చట్టములు)

మన రాజ్యాంగములోని నిబంధన (ఆర్టికల్) 39(f) మరియు 45 యందు ప్రభుత్వ ఆదేశ సూత్రముల ప్రకారము బాలల భద్రతాభివృద్ధి కొరకు చట్టములను రూపొందించవలయునని తెలుపుచున్నది.

మన రాజ్యాంగములోని నిబంధన 24 ప్రాథమిక హక్కులను గూర్చి తెలియజేయుచున్నది. ఇది బాలకార్మికుల దోపిడిని నిరోధించి మరియు వారి రక్షణ కొరకు సహాయపడుచున్నది.

నిబంధన 39(f) పిల్లలు ఆరోగ్యకరమైన రీతిలో అభివృద్ధి చెందుటకు, పిల్లలు మరియు యువతకు తగిన రక్షణను కల్పించుచున్నది. ఇది బాలకార్మికులను దోపిడి నుండి కాపాడుచున్నది.

ప్రకరణలు 45 నందు 14 సంవత్సరముల లోపుగల పిల్లలందరికి ఉచిత మరియు నిర్బంధ విద్యను కల్పించుచున్నది.

14 సంవత్సరముల వయస్సు లోబడియున్న పిల్లలెవరినీ ఏ ఒక్క కర్మాగారములోగాని, గనులలోగాని లేక ఇతర అపాయకరమైన పనులను చేయుటకు నియమించకూడదు.

**స్త్రీ శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ**

దేశమందలి స్త్రీలు మరియు పిల్లలందరు అభివృద్ధిని మరియు సంరక్షణను పొందినపుడే వారు దేశ పౌరులుగా సంపూర్ణ జీవితమును గడపగలరు అను ఆశయమే ఈ శాఖ ముఖ్య ఉద్దేశ్యమైయున్నది.

### విద్యాహక్కు

నూరు సంవత్సరములకు పూర్వమే మనదేశపు గొప్ప స్వాతంత్ర సమరయోధుడైన గోపాలకృష్ణ గోఖలే ఆంగ్లేయ పరిపాలన కాలమునాటి శాసనసభలో భారతదేశ పిల్లలందరికీ విద్యాహక్కును కల్పించవలయునని ఆంగ్ల ప్రభుత్వమును కోరెను. ఇతడు కలగనిన విద్యాహక్కు ఏప్రిల్ 1వ తారీఖు 2010 సంవత్సరములో 'విద్యాహక్కు చట్టము' (Right to Education Act - REA)గా భారతప్రభుత్వముచే ప్రవేశపెట్టబడెను. ప్రస్తుతము 6 నుండి 14 సంవత్సరములు వయస్సు గల పిల్లలందరు విద్యావకాశములు పొందునట్లు ఈ విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా రూపొందించ బడినది. ఈ విధముగా భారతదేశ ప్రభుత్వము గొప్ప అక్షరాస్యతను సాధించుటకు మరియు యువత సాధికారత కొరకు మార్గమును సుగమమం చేసినది.

### ప్రభుత్వము రూపొందించిన శాసనములు

పిల్లల సంక్షేమము కొరకు అనేక చట్టములు రూపొందించబడినవి. వాటిలో కొన్ని క్రింద ఇవ్వబడినవి.

1. 1986 సంవత్సరము రూపొందించబడి 2000లో చట్టసవరణ చేయబడి ప్రస్తుతము అమలులో యున్న బాల నేరస్థుల న్యాయచట్టము.
2. 1992 నాటి శిశువునకు తల్లిపాలకు బదులు బుడ్డీపాలు యివ్వడము మరియు శిశు ఆహార చట్టము.
3. బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ చట్టము–2005

## పిల్లల కొరకు ప్రవేశపెట్టబడిన కార్యాచరణ పథకములు మరియు కార్యక్రమములు

పిల్లల పురోభివృద్ధి మరియు మేలుకొరకు అనేకమైన కార్యాచరణ పథకములు మరియు కార్యక్రమములు అమలుచేయబడుచున్నవి. అవి

1. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకము (ICDS) 1975 – ఉద్దేశ్యములు.
   a) 6 సంవత్సరముల లోపు వయస్సు గల పిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు తల్లిపాలను యిచ్చు స్త్రీల ఆరోగ్యములను మెరుగుపరచుట.
   b) శిశు మరణాల శాతమును తగ్గించుట, పోషక ఆహారలోపములను మరియు పాఠశాలలకు పోవుటను మధ్యలో విడనాడు విద్యార్థుల శాతమును తగ్గించుట.
2. రాజీవ్‌గాంధి జాతీయ పగటిపూట శిశు సంరక్షణ పథకము 2006లో ప్రవేశపెట్టబడినది. ఈ పథకము నందు పగటి సమయమునందు ఉద్యోగాలగు వెళ్ళు తల్లుల శిశువులను (0 నుండి 6 సంవత్సరముల లోపు వారిని) సంరక్షించుట కొరకు శిశు సంరక్షణాలయాలు ఏర్పరచబడినవి..
3. తల్లిదండ్రులులేక వీధులలో అనాథలుగా తిరిగే పిల్లలకు నివాసము, ఆహారము మరియు ఆరోగ్యము, విద్య మరియు విశ్రాంతి వసతులను కలుగజేయు ఒక సమగ్ర కార్యక్రమము. ఇది పిల్లలను దోపిడి మరియు ఇతర అరాచకముల నుండి కాపాడుచున్నది.
4. బాలల సేవాసంస్థలు పిల్లలకు కష్టసమయాలలో మరియు అత్యవసర పరిస్థితులలో సహకరించుటకు ఉద్దేశించబడినవి. ఈ సంస్థ బాలల సంక్షేమము మరియు రక్షణపై ఎక్కువ దృష్టిని కేంద్రీకరించుచున్నది.
5. సమగ్ర శిశు సంరక్షణ ప్రణాళిక ద్వారా పిల్లలకు ఒక సంస్థ ద్వారాగాని లేక సంస్థేతర సహాయమును అందించుచున్నది.
6. పని చేయుటకు వెళ్ళు పిల్లల సంక్షేమ మరియు రక్షణ కార్యాచరణ పథకము(2005) ఉద్దేశ్యము పనిచేయుటకు వెళ్ళు పిల్లల కొరకు అనియత విద్యావకాశములను మరియు వృత్తికి సంబంధించిన శిక్షణలను అందించి వారి విద్యాభ్యాసములను ఆపకుండా కొనసాగించుట.

## బాలల దినోత్సవం జరుపుకొనుట

ప్రతి సంవత్సరము నవంబరు 14వ తేదీని బాలల దినోత్సవముగా జరుపుకొనుచున్నాము. ఈ కార్యక్రమము ద్వారా ప్రభుత్వము మరియు వివిధ సామాజిక సంస్థలు పిల్లలపై దృష్టిని కేంద్రీకరించి వారు వివిధ రంగాలలో అభివృద్ధి చెందుటకు, ఉపాధి అవకాశములను మెరుగు పరుచుకొనుటకు అవసరమైన చర్యలను పున:సమీక్షించుచున్నది.

## ప్రతిభావంతులైన బాలలకు ప్రభుత్వ గుర్తింపు

విద్య, కళలు, సాంస్కృతిక మరియు క్రీడలు వంటి అనేక రంగాలలో అద్భుత విజయాలను మరియు అసాధారణ ప్రతిభను కనబరచిన పిల్లలను గుర్తించి ప్రభుత్వము వారికి తగిన గుర్తింపును యిచ్చి ప్రోత్సహించుచున్నది.

అసాధారణ ప్రతిభ గల పిల్లలను గౌరవించుటకు 1996లో జాతీయ బాలల అవార్డులను ఏర్పాటు చేసిరి. దానిప్రకారము 4 నుండి 15 సంవత్సరముల మధ్య వయస్సు కలిగిన అసాధారణ ప్రతిభ గల పిల్లలకు ప్రతి సంవత్సరము గణతంత్ర దినోత్సవమున ప్రతిభా పురస్కారములు ఇచ్చి గౌరవించుచున్నది.

పిల్లల కొరకు ప్రభుత్వము అనేక చట్టములను అమలుచేసినప్పటికీ ఇంకనూ వారి చుట్టూవున్న ఆపదలపై చైతన్యమును కలుగజేయవలసిన అవసరమున్నది. వారు సంబంధిత అధికారుల ద్వారా గానీ లేక సరియైన మార్గముల ద్వారా వారి సమస్యలను తెలియజెప్పి తగిన పర్యవేక్షణను మరియు సలహాలను పొందవలసిన అవసరమున్నది.

పిల్లలు దురాలోచనలకు మరియు దోపిడికి గురికాకుండా ప్రభుత్వము మరియు సంక్షేమ సేవా సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు తల్లిదండ్రులు, పాఠశాలలు మరియు ప్రజలు సహకరించే నైతిక బాధ్యతను తీసుకొనవలయును.

## మహిళా సాధికారత మరియు శాసనములు

ప్రాచీన కాలము నుండి స్త్రీల స్థితిగతులు అగమ్యగోచరంగా ఉండెను. ఒకప్పుడు స్త్రీలు గొప్ప గౌరవస్థానములను పొందియుండిరి. తర్వాత కాలములో వారు చెప్పలేనంత కష్ట పరిస్థితులకు గురియైరి. సమాజములో వారి యొక్క స్థితిని మెరుగు పరచుటకు భారత ప్రభుత్వము మహిళల కొరకు అనేక హక్కులను కల్పించుచూ అనేక చట్టములను రూపొందించినది.

## మహిళా హక్కులు మరియు శాసనములు

రాజ్యాంగములోని నిబంధనలు 23 మరియు 24 స్త్రీల స్వేచ్ఛకు అధిక ప్రాముఖ్యతను ఇచ్చుచున్నది.

23వ నిబంధన స్త్రీలను వస్తువులుగా భావించి వ్యాపారము చేయు పద్ధతిని నిషేధించుచున్నది.

నిర్బంధ కార్మిక వ్యవస్థ ఒక నేరముగా ప్రకటించబడెను.

మానవ విక్రయము చట్టవ్యతిరేకమైనదిగా ప్రకటించబడెను.

స్త్రీలకు దోపిడిని ఎదుర్కొనే హక్కు యివ్వబడినది.

తల్లిదండ్రుల ఆస్తియందు కుమారులతో పాటు, కుమార్తెలకు కూడా ఆస్తిని పొందు హక్కును చట్టము రూపొందించబడినది. 1978లో తయారుచేయబడిన బాల్యవివాహ సవరణ చట్టము ద్వారా బాలికల యొక్క వివాహపు వయస్సు 15 సంవత్సరముల నుండి 18 సంవత్సరములుగాను, పురుషుల వివాహపు వయస్సు 18 సంవత్సరముల నుండి 21 సంవత్సరములుగా పెంచబడినది.

1961 సంవత్సరపు వరకట్న నిషేధ చట్టము వరకట్నమును ఇచ్చుట లేదా తీసుకొనుటను నిషేధించెను. 1986నాటి వరకట్న నిషేధ సవరణ చట్టము ప్రకారము స్త్రీలను వరకట్నము కొరకు వేధించిన వారికి కఠినశిక్షను విధించు అవకాశము కల్పించినది.

రాజ్యాంగము కల్పించిన చట్టములే కాకుండా రాష్ట్ర ప్రభుత్వములు మరియు కేంద్ర పాలిత ప్రాంతములు స్త్రీలకు జరిగెడు సామాజిక అన్యాయములు మరియు దోపిడి నుండి కాపాడుటకు అనేక శాసనములను జారీచేసినవి. ఉదాహరణకు 1997 సంవత్సరములో తమిళనాడు శాసనసభ ప్రవేశపెట్టిన స్త్రీలను కించపరచు(Eve Teasing) నిరోధక చట్టము. ఇది 2002వ సంవత్సరములో స్త్రీల శారీరక, మానసిక క్షోభను నిరోధించు చట్టముగా (Herassment Act) మార్పుచేయబడినది.

పౌరుల శ్రేయస్సు కొరకు కాలానికి అనుగుణముగా రాజ్యాంగమునందు అనేక పర్యాయములు రాజ్యాంగ సవరణలు చేయబడెను. 73 మరియు 74 సవరణ చట్టములు స్త్రీలకు పంచాయితీరాజ్ మరియు నగర స్థానిక సంస్థలలో 33 శాతము రిజర్వేషనులు కల్పించినది.

## ఆర్థిక సాధికారిత ప్రణాళికలు

మన దేశములో స్త్రీల రక్షణ కొరకు, విద్యావకాశములు కల్పించుటకు, వారి పురోభివృద్ధి కొరకు అనేక ప్రణాళికలు మరియు కార్యక్రమములు ఏర్పాటు చేయబడినవి. వాటిలో కొన్ని

### 1. ఉద్యోగ ఉపాధి కోసం శిక్షణ సహాయ కార్యక్రమము (STEP)

ఈ కార్యక్రమము 1996లో స్త్రీలకు చేనేత పరిశ్రమ, చేతి వృత్తులు, ఖాదీ పరిశ్రమ మరియు గ్రామీణ పరిశ్రమలందు ఉద్యోగావకాశములు కల్పించుటకు ప్రారంభించబడినది.

### 2. స్వయంసిద్ధ (Swayamsidha)

స్వయం సహాయక సంఘముల ద్వారా స్త్రీలకు సామాజిక, ఆర్థిక అభివృద్ధి మరియు సాధికారతను కల్పించుటకు ఈ పథకము ఏర్పాటుచేయబడినది.

### 3. స్వల్పకాల నివాస గృహములు – (1996)

ఈ గృహములు సాంఘిక, ఆర్థిక మరియు భావోద్వేగ సమస్యలను ఎదుర్కొనుచున్న బాల బాలికలు మరియు స్త్రీలకు పునరావాసం కల్పించి సమస్యలను పరిష్కరించుటకు సహాయపడుచున్నవి.

### 4. కుటుంబ సలహా కేంద్రములు

ఈ కేంద్రములు సాంఘిక వివక్షకు మరియు కుటుంబ కలహాల వలన ఇబ్బందులకు గురియైన వారికి సలహాలను ఇచ్చుచున్నది.

### 5. మధ్యలో ఆపివేయబడిన స్త్రీల విద్యను పూర్తిచేయుట

15 సంవత్సరములు అంతకన్నా ఎక్కువ వయస్సు కలిగియుండి అనేక సమస్యల వలన పాఠశాల విద్య మధ్యలోనే ఆపివేయబడిన వారికి విద్యను, వారి సామర్థ్యముల కనుగుణంగా శిక్షణ (Training)ను కల్పించుచున్నది. ఈ విద్య అనేక ఉద్యోగ అవకాశములను కల్పించి వారి యొక్క స్థోమతను మెరుగుపరచునట్లు చేయును.

### 6. గ్రామీణ మరియు పేద స్త్రీలను చైతన్యపరచు కార్యక్రమములు

స్త్రీలు వారియొక్క హక్కులు మరియు విశేష అధికారములను తెలుసుకొనక అనేక సమస్యలను ఎదుర్కొనుచున్నారు. పేద స్త్రీలలో చైతన్యమును కలుగజేసి స్త్రీలు వారియొక్క స్థానమును, హక్కులను తెలుసుకొనుటకు మరియు వారి సమస్యలను పరిష్కరించుటకు ఈ కార్యక్రమములు సహాయ పడుచున్నవి.

భారత ప్రభుత్వముచే రూపొందించబడిన శాసనములు మరియు అనేక సామాజిక సంక్షేమ సంస్థలు చేసిన ప్రయత్నముల వలన ఖచ్చితముగా స్త్రీలు మరియు పిల్లల స్థితిగతులు మెరుగుపడుచున్నవి. స్త్రీలు మరియు పిల్లల స్థితిగతులు ఎంతగానో అభివృద్ధి చెందినదని మరియు రాబోవు కాలములో మరింత ఎక్కువ అభివృద్ధి చెందునని మనము ధైర్యముగా చెప్పవచ్చును.

## అభ్యాసం

**I) సరియైన సమాధానములను ఎన్నుకొనుము.**

1. ____________ మనదేశము యొక్క భావికాలపు మూల స్తంభములుగా చెప్పవచ్చును.
   ఎ) పెద్దలు  బి) మధ్యతరపు వ్యక్తులు  సి) పిల్లలు
2. భారత రాజ్యాంగములోని ____________ పిల్లల ఆరోగ్యాభివృద్ధికి సహకారమును అందించుచున్నది.
   ఎ) నిబంధన 39 (f)  బి) నిబంధన 45  సి) నిబంధన 25
3. భారత ప్రభుత్వము విద్యాహక్కు చట్టమును ____________ లో ప్రవేశపెట్టినది.
   ఎ)15 ఆగష్టు1947  బి) 26 జనవరి 1950  సి) 1 ఏప్రిల్ 2010
4. 72 మరియు 73 సవరణ చట్టములలో స్థానిక సంస్థలందు ____________ 33% స్థానములను కేటాయించబడినవి.
   ఎ) ఉపాధ్యాయులకు  బి) స్త్రీలకు  సి) పట్టభద్రులకు
5. ____________ స్త్రీలకు స్వయం సహాయక సంఘాల ద్వారా సామాజిక, ఆర్థికాభివృద్ధి మరియు సాధికారతను కల్పించుచునన్నది.
   ఎ) స్వల్పకాల గృహములు  బి) స్వయంసిద్ధ  సి) కుటుంబ సలహా కేంద్రములు

## II) ఖాళీలను పూరింపుము.

1. బాల నేరస్థుల న్యాయచట్టము ____________ సం॥లో సవరణ చేయబడినది.
2. బాలల సేవా సంస్థలు ____________కు కష్టసమయములందు మరియు అత్యవసర పరిస్థితులలో సహకరించుచున్నవి.
3. 1978లో రూపొందించిన బాల్య వివాహ సవరణ చట్టములో స్త్రీల వివాహపు వయస్సు 15 సంవత్సరముల నుండి ____________సంవత్సరములకు పెంచబడినది.
4. తమిళనాడు ప్రభుత్వము ____________ సంవత్సరము నందు స్త్రీలను కించపరచు (Eve-Teasing) నిషేధ చట్టమును జారీచేసినది.
5. సామాజిక వివక్షలకు గురియైన స్త్రీలకు ____________ ఇచ్చుటకు కుటుంబ సలహా కేంద్రములు ఏర్పరచబడినవి.

## III) జతపరచుము.

| | | |
|---|---|---|
| 1. | 45వ నిబంధన | శిశు మరణ శాతమును తగ్గించుట |
| 2. | ఐ.సి.డి.ఎస్. పథకము | 1961 |
| 3. | బాలల దినోత్సవము | బాలికలకు పునరావాసము కల్పించుట |
| 4. | వరకట్న నిషేధ చట్టము | నవంబరు 14వ తేదీ |
| 5. | స్వల్పకాల నివాస గృహములు | ఉచిత మరియు నిర్బంధ విద్య |

## IV) క్లుప్తముగా సమాధానములనిమ్ము.

1. నిబంధన 24 పిల్లలకు ఏవిధముగా సహాయపడుచున్నవి?
2. బాలల సంక్షేమము కొరకు రూపొందించబడిన చట్టములను కొన్నింటిని పేర్కొనుము.
3. భారతదేశ గణతంత్ర దినోత్సవము రోజున ఏవిధమైన పిల్లలను మన భారత ప్రభుత్వము తగిన విధంగా గౌరవించుచున్నది?
4. నిబంధనలు 23 స్త్రీలకు ఏవిధముగా సహాయపడుచున్నవి?
5. వరకట్న నిషేద చట్టము ఏవిధముగా నిషేదించబడినది.

## V) విపులముగా జవాబులిమ్ము.

1. బాలల శ్రేయస్సు మరియు సంక్షేమము కొరకు రూపొందించబడిన కార్యాచరణ పథకములను మరియు కార్యక్రమములను పేర్కొనుము.
2. స్త్రీలకు ఆర్థిక అధికారిత చట్టములను కలుగజేయు పథకములను గురించి వివరింపుము?

## రూపక నిర్ధారణ

**1. సంవాదము:**

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించుటలో రాజ్యాంగములోని 24వ ప్రకరణ ఏవిధంగా విజయము సాధించినది – తరగతి గదిలో సంవాదమును చేపట్టుము.

**2. పోస్టరును తయారుచేయుము:**

విద్యాహక్కు చట్టములోని ప్రధాన అంశములపై ఒక పోస్టరును తయారుచేయుము.

**3. చర్చించుము:**

బడిని మానివేసే విద్యార్థుల కొరకు ప్రభుత్వము ఎటువంటి చర్యలను చేపట్టినది – మీ ఉపాధ్యాయుల సహాయంతో చర్చించుము.

**4. తెలుసుకొనుము:**

మీ ప్రాంతములోని మహిళలు మరియు పిల్లల సంక్షేమము కొరకు ప్రభుత్వేతర సంస్థలు అందించుచున్న తోడ్పాటు గురించి తెలుసుకొనుము.

**5. ప్రదర్శన:**

ఇవ్వబడిన అంశముపై ఒక లఘు నాటికను ప్రదర్శించుము.

'నేటి బాలలే భావి భారతదేశానికి మూల స్తంభాలు'.

# 1. ఉత్పత్తి కారకములు

అర్థశాస్త్రము ఒక సాంఘిక విజ్ఞానశాస్త్రము. ఇది మానవుల కోరికలు మరియు వాటిని సంతృప్తి చెందుటను గురించి వివరించును. అర్థశాస్త్రము సామాజిక సమస్యలైన నిరుద్యోగము, పేదరికము, వైద్యసేవలు, ఉత్పత్తి మరియు ప్రభుత్వ విధానములను గూర్చి వివరించును.



ఆడమ్ స్మిత్

**ఆడమ్ స్మిత్, అర్థశాస్త్ర పితామహుడని** పిలువబడుచున్నాడు. ఇతడు అర్థశాస్త్రమును ఈవిధంగా నిర్వచించెను. అర్థశాస్త్రము సంపదను గురించి తెలిపే ఒక విజ్ఞాన శాస్త్రము. వీరు రచించిన **దేశముల సంపద స్వభావము మరియు దానికి కారణముల పరిశీలన** అను గ్రంథం ఆవిష్కరణ తర్వాతనే అర్థశాస్త్రము యొక్క క్రమబద్ధమైన అధ్యయనానికి పునాది ఏర్పడినది.

**లియోనెల్ రాబిన్స్** అను అర్థశాస్త్రవేత్త అర్థశాస్త్రమును ఈ క్రింది విధముగా నిర్వచించెను. "అర్థశాస్త్రం ఒక విజ్ఞానశాస్త్రం. ఇది మానవ ప్రవర్తన, పరిమిత వనరులు వాటికి మధ్యగల ప్రత్యామ్నాయ సంబంధమును అధ్యయనం చేయును".

## సమాజం మరియు పరిమిత వనరులు

ఒక సమాజము తన పరిమిత వనరులను అనేక అవసరాల కొరకు కేటాయించును.



లియోనెల్ రాబిన్స్

పరిమితంగా వున్న వనరులను సాధ్యమైనంత వరకు ప్రత్యేక పద్ధతిలో కేటాయించుటకు ప్రణాళికలను అర్థశాస్త్రము రూపొందించును.

ఆధునిక ప్రపంచములో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తువులు మరియు వాటి సేవలను వారి నిత్య జీవితములో వినియోగించుటకు ఆశపడు చున్నారు. ప్రజల కోసం వస్తువులు మరియు సేవలు ఉత్పత్తి చేయబడి అందుబాటులోనికి తేబడుచున్నవి. మానవుడు తనకున్న కోరికలను తృప్తిపరచుట కొరకు సహజవనరులను వస్తువులుగా మార్చు ప్రక్రియను ఉత్పత్తి అందురు. ఒక దేశములో వస్తువులు మరియు సేవల ఉత్పత్తి స్థాయి ఆ దేశము యొక్క మొత్తము జాతీయ ఆదాయమును నిర్ణయించును. అభివృద్ధి చెందిన దేశములు వస్తు మరియు సేవా ఉత్పత్తులను ఎక్కువ మొత్తములో చేయుట వలన వారియొక్క జాతీయ ఆదాయము ఎక్కువ స్థాయిలో ఉండును.

**తెలుసుకొనెదము**

ఉత్పత్తి అనగా ప్రయోజనమును కల్పించునది. ప్రయోజనమనునది కోర్కెలను సంతృప్తిపరచు శక్తి.

సమాజములోని **భూమి, శ్రమ, మూలధనము మరియు వ్యవస్థాపనను** ఉపయోగించి వినియోగ దారులను సంతృప్తి పరచే వస్తువులు మరియు సేవలు

ఉత్పత్తి చేయబడుచున్నవి. కావున ఇవి ఉత్పత్తి కారకములుగా పిలువబడుచున్నవి. వస్తువులు, సేవలు ఉత్పత్తి చేయుటకు నాలుగు ఉత్పత్తి కారకములు అవశ్యకమగును. ఒక్కొక్క ఉత్పత్తి కారకము, ఉత్పత్తి విధానములో ఒక ముఖ్యపాత్రను పోషించుచున్నది. ఏ ఒక్క ఉత్పత్తి కారకము యొక్క ఉపయోగము లేకుండినా కూడా ఉత్పత్తి అసాధ్యము అగును. కావున ఉత్పత్తిదారుడు ఉత్పత్తి కారకములను సరియైన పద్ధతిలో సమ్మేళన పరిచి వస్తువులను ఉత్పత్తి చేయవలయును. ప్రతి ఉత్పత్తిదారుని ముఖ్య ఉద్దేశ్యము తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ లాభమును ఆర్జించుటయే. ఆవిధముగా ఉత్పత్తియందు భౌతిక వస్తువులే గాక అనేక రకములైన సేవలు కూడా ఇమిడి ఉన్నవి. ఉదాహరణకు వైద్యులు, ఉపాధ్యాయులు మరియు ఇతరులు చేయు సేవ కూడా ఒకరకమైన ఉత్పత్తి అగును.

**కృత్యము**

సమాజములో వివిధ రకములైన వస్తువులు ఎట్లు తయారు చేయబడుచున్నవో మీకు తెలియునా?

భూమి మరియు శ్రమ కారకములను అసలైన లేక ప్రాథమిక కారకములుగా చెప్పవచ్చును. మూలధనము మరియు వ్యవస్థాపనలను ఉత్పన్న కారకములని చెప్పవచ్చును. ఒక చిన్న సున్నపు గడ్డ ఉత్పత్తి కూడా ఉత్పత్తి కారకముల చురుకైన ప్రమేయము లేనిదే సాధ్యము కాదు.




**ఉత్పత్తి కారకములు మరియు కారకముల ప్రతిఫలము**

- భూమి (భాటకము)
- శ్రమ (వేతనము)
- మూలధనము (వడ్డీ)
- వ్యవస్థాపన (లాభం)

## భూమి

సాధారణముగా "భూమి" అనగా "నేల" అని అర్థము. అయితే అర్థశాస్త్రములో మానవునిచే సృష్టించ వీలుకానీ ప్రతి వస్తువును భూమి అని పిలుతురు. **ప్రకృతి వనరులన్నియు భూమిగా పిలువబడును.** గాలి, సూర్యకాంతి, మట్టి, అడవులు, నదులు మరియు ఖనిజములు అన్నింటిని భూమి అని పిలుతురు. ఉత్పత్తి కారకమయిన భూమికి ప్రతిఫలముగా యిచ్చు దానిని భాటకము (బాడుగ) అని పిలుతురు. భూమి కొన్ని ప్రత్యేకాంశములను కలిగివున్నది. ఈ ప్రత్యేకాంశములు మిగతా ఉత్పత్తి కారకములలో లేవు.

**తెలుసుకొనెదము**

భూమి మరియు శ్రమ అనునవి ప్రాథమిక కారకములు. మూలధనము మరియు వ్యవస్థాపనము ఉత్పన్న కారకములు.

మనము క్రింద యివ్వబడిన "ప్రకృతి వరప్రసాదాలను" చిత్రములలో చూచెదము.



భూమి



అడవులు



నదులు



ఖనిజములు

### భూమి యొక్క గుణగణాలు

**1. భూమి ఒక సహజ వనరు**

భూమి మానవునిచే తయారుచేయ వీలుకానిది. భూమి సహజముగానే ప్రకృతిలో ఒక భాగము.

**2. భూమి యొక్క పరిధి నిర్ణీతమైనది**

భూమియొక్క విస్తీర్ణమును పెంచలేము లేక తగ్గించనులేము. మానవుడు భూమి యొక్క ఉపయోగమును మాత్రమే మార్చగలడు.

**3. భూమి శాశ్వతమైనది**

ఎందుకనగా ఇది మానవునిచే నాశనము చేయు వీలుకానిది.

**4. భూసారమునందు వ్యత్యాసములు వుండును**

కొంతభూమి ఎక్కువ సారవంతమైనదిగాను మరికొంత భూమి తక్కువ సారవంతము కలిగినదిగా వుండును. ఈ రెండు రకములు సారవంతములో సమానముగా వుండవు.

**5. భూమి ఒక కర్మార్థక ఉత్పత్తి కారకము**

భూమి తనకు తాను ఎటువంటి ఉత్పత్తిని


చేయలేదు. మనిషి భూమిపై పనిచేసి వస్తు మరియు సేవలను ఉత్పత్తి చేయును.

## శ్రమ (Labour)

ఏదో కొంత ఆదాయమును (లేక) ప్రతిఫలాన్ని ఆశించి చేయు పనిని శ్రమ అందురు. ఈ శ్రమ శారీరకమైనది గాను లేక మానసికమైనదిగాను వుండవచ్చును. ఒక వంటవాడు చేయుపని శారీరక శ్రమ అగును. ఒక ఉపాధ్యాయుడు చేయుపని మానసిక శ్రమ అగును. సంతోషము కొరకు చేయు ఏ పనియైనను శ్రమగా భావించబడదు. ఉత్పత్తి కారకమయిన శ్రమకు ప్రతిఫలముగా యిచ్చు దానిని వేతనము (కూలీ) అందురు.

**కృత్యము**

మీ ప్రాంతములో ఎక్కడ ఎక్కువ మంది ప్రజలు పనిచేయుదురు?



శారీరక శ్రమ



మానసిక శ్రమ

## శ్రమ యొక్క గుణగణాలు

### 1. శ్రమ నాశనకారిణి

వస్తువుల వలె శ్రమను భద్రపరచయుటకు వీలుకాదు. శ్రమ శక్తిని ఒకసారి కోల్పోయినట్లయితే దానిని తిరిగి పొందలేము.

### 2. శ్రమ అవిభాజ్యమైనది

శ్రమను శ్రామికుల నుండి వేరుచేయుటకు వీలుకాదు. ఉదా : నాట్యమును నాట్యము చేయువారి నుంచి విడదీయలేము.

### 3. శ్రమ సామర్థ్యము వ్యక్తి, వ్యక్తికి వ్యత్యాసమైనది

ఒకే విధమైన చదువు, శిక్షణ వున్నప్పటికీ శ్రమ సామర్థ్యములో వ్యత్యాసముండును. ఇదివారి వేతనములలో వ్యత్యాసములను చూపించును.

### 4. శ్రమ గమన స్థితిని కలిగియుండును

మానవుడు తక్కువ వేతనము పొందు వృత్తి నుంచి ఎక్కువ వేతనము పొందు వృత్తికి స్థానమార్పిడి చెందును.

### 5. వ్యక్తిగత శ్రమ తక్కువ బేరమాడు సామర్థ్యమును కలిగియుండును

అభివృద్ధి చెందుచున్న దేశమయిన భారత దేశములో ఇతర ఉద్యోగులవలె కాకుండా కార్మికులు తక్కువ వేతనములను తీసుకొనుటకు నిర్బంధించబడి యున్నారు. అట్లులేని యెడల వారు నిరుద్యోగులుగా వుందురు. కార్మిక సంఘముల ఆవిర్భావముతో కార్మికులు వేతనంపై బేరమాడు సామర్థ్యము పెరిగినది.

## శ్రామిక సామర్థ్యము

శ్రామిక సామర్థ్యము అనగా కార్మికులు ఎక్కువగా లేక బాగుగా పనిచేసి ఉత్పత్తిని పెంచగల సామర్థ్యము కలిగియుండుట అని అర్థము. అధిక సామర్థ్యము వున్న శ్రామికులు ఉత్పత్తిని ఎక్కువ చేసి ఆర్థికాభివృద్ధిని సాధించుదురు. శ్రామికుల యొక్క సామర్థ్యము అనేక అంశములపై ఆధారపడియుండును.

a. శీతోష్ణస్థితి పరిస్థితులు

b. జాతి మరియు వారసత్వ అంశములు

c. పనిచేయు ప్రాంతములో మెరుగైన వసతులు

d. పనిచేయు కాలము

e. ఆపద, విపత్తు, భవిష్యత్ నిల్వనిధి మొదలగువాటికి వ్యతిరేకముగా సాంఘిక భద్రతను కల్పించుట.

## శ్రమ విభజన

అర్థశాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్ తాను రచించిన గ్రంథమయిన "దేశముల సంపద" (Wealth of Nations)లో శ్రమ విభజన అను భావనను ప్రవేశపెట్టెను. గుండు సూది తయారుచేయుట శ్రమ విభజనకు మంచి ఉదాహరణగా పేర్కొనెను.

## భావము

ఉత్పత్తి ప్రక్రియను చిన్న చిన్న విభాగములుగా విభజించి ఒక్కొక్క విభాగమును ఒక్కొక్క శ్రామికుని లేదా కొందరు శ్రామికుల చేతిలో అప్పగించు పద్ధతిని శ్రమ విభజన అందురు. ఇందులో కార్మికులు అప్పగించిన పనియందు ప్రత్యేక నైపుణ్యమును కలిగినవారుగా యుందురు.

ఆడమ్ స్మిత్ గుండు సూదుల తయారీ పద్ధతిని 18 భాగములుగా విభజించెను. అవి గుండు సూదికి తలను అమర్చుట, మొనను పదునుచేయుట మొదలగునవి. శ్రమ విభజనలో 10 మంది కార్మికులు 48,000 గుండు సూదులను తయారు చేయవచ్చును. అంటే ఒక కార్మికుడు ఒక రోజులో తయారు చేసిన గుండు సూదుల సంఖ్య 4,800. శ్రమ విభజన మరియు యంత్రములు లేకున్న యెడల ఒక శ్రామికుడు ఒక దినములో ఒక గుండు సూదిని మాత్రమే తయారుచేయగలడు.

## శ్రమ విభజన వలన లాభములు

1. ఉత్పత్తి ఎక్కువగును.
2. శ్రామికుల యొక్క నైపుణ్యము మరియు సామర్థ్యము అభివృద్ధి చెందదు.
3. ఎక్కువ మొత్తములో ఉత్పత్తి చేయుటకు వీలగును.
4. కాలము మరియు వస్తువులు పొదుపు చేయబడును.
5. శ్రమవిభజన సరియైన వ్యక్తికి సరియైన పనిదొరుకుటకు సహాయపడును.

## శ్రమ విభజన వలన నష్టాలు

1. చేసిన పనిని మరలా మరలా చేసినప్పుడు శ్రామికుడికి ఆపనిపైన ఎక్కువ విసుగు కలుగును.
2. శ్రమ విభజన మానవత్వమును చంపును.
3. చేతితయారీ వస్తువుల యొక్క అభివృద్ధి నాశనమగును.
4. శ్రామికునికి ఒక వస్తువును తానే పూర్తిగా తయారు చేశాననే తృప్తి కలగదు.
5. సంకుచిత నైపుణ్యము శ్రామికులను వేరొక ఉద్యోగ అవకాశమును వెతుక్కోకుండా వుండునట్లు చేయును.

## మూలధనము

సాధారణముగా మూలధనమనగా ద్రవ్యము. అర్థశాస్త్రములో మూలధనమనునది ఒక వ్యక్తిచే సమకూర్చబడిన సంపద. ఆ సంపదచే మరలా సంపదను ఉత్పత్తి చేయటాన్ని మూలధనము అందురు. మూలధనము అను పదములో భవనాలు, పరికరములు మరియు ఉత్పత్తికి అవసరమయ్యే వస్తువులను దీనిలో చేర్చవచ్చును. కర్మాగారము కోసం వినియోగించబడు భవనము మూలధనమగును. కాని ఇది మానవ నివాసమునకు ఉపయోగించిన యెడల ఆ భవనము మూలధనము కాజాలదు. సంపద మొత్తము మూలధనము కాదు. అయితే మూలధనము మొత్తము సంపద అగును. ఉత్పత్తి కారకమైన మూలధనమునకు యిచ్చు ప్రతిఫలమును వడ్డీ అందురు.

**కృత్యములు**

ఒక వస్త్ర కర్మాగారమును ప్రారంభించుటకు ఎంత మూలధనము అవసరమగునో నీవు ఊహించగలవా.

నీ యొక్క సొంత మానవ మూలధనమును గురించి ఆలోచించుము. నీవు ఎటువంటి నైపుణ్యమును కలిగివున్నావు?

## మూలధనములోని రకాలు

### 1. భౌతిక మూలధనము

మానవ నిర్మిత భౌతిక ఆస్తులైన భవనములు, యంత్రములుపై వెచ్చించే పెట్టుబడిని భౌతిక మూలధనమందురు.

### 2. ద్రవ్య మూలధనము

ద్రవ్యరూపములో పెట్టిన పెట్టుబడిని లేక ద్రవ్యనిధిని ద్రవ్య మూలధనమందురు.

### 3. మానవ మూలధనము

విద్య, శిక్షణ, ఆరోగ్య రక్షణ మొదలగు వానిపై వినియోగించు పెట్టుబడిని మానవ మూలధనము అందురు.








## మూలధనము యొక్క గుణగణాలు

### 1. మూలధనము ఒక నిష్క్రియాత్మకమైన ఉత్పత్తి కారకము

భూమివలె మూలధనము కూడా శ్రమ లేకుండా నిష్క్రియాత్మకమగును.

### 2. మూలధనము మానవ నిర్మితమైనది

భూమి మరియు శ్రమ ప్రాథమిక కారకములు అగును. పొదుపు ద్వారా మూలధనము ఉత్పత్తి చేయబడును.

### 3. మూలధనము ఒక ఉత్పాదకము

ఇది ఒక ఉత్పాదకము. ఎందువలననగా ఇది కొంత ఆదాయమును యిచ్చును.

**4. మూలధనము కాలవ్యవధిలో తుది దశకు చేరును**

ఇది కొంత కాలవ్యవధిలో తుది దశకు చేరును. కానీ ఇది కనుమరుగైపోదు. మూలధనమును నిరుపయోగముగా ఉంచక తిరిగి ఉపయోగించ వచ్చును.

**5. మూలధనము అత్యంత ఎక్కువ గమన శక్తిని కలిగియుండును**

భూమి పూర్తిగా స్థిరమైనది. శ్రమ కొంచెం చలనత్వమును కలిగియుండును. మూలధనము ప్రాంత మరియు వృత్తి పరమైన చలనత్వము రెండింటిని కలిగియుండును



ఉత్పత్తి అనునది భూమి, శ్రమ మరియు మూలధనమునకు సంబంధించినది. ఈ కారకములను సరియైన ప్రాతిపదికలో సమన్వయపరచి, ఉత్పత్తి ప్రక్రియను దానిలోని కష్టనష్టాలను భరించుటకు ఒక కారకము అవశ్యమగును. ఆ కార్యకలాపమునే వ్యవస్థాపన అందురు.

**కృత్యము**

ఒక మంచి వ్యవస్థాపకునికి ఉండవలసిన లక్షణాలేవి?

ఎవరైన ఒక వ్యవస్థాపకునితో సంభాషించి అతని విజయమునకు కారణములను విశ్లేషించుము.

వివిధ రకములైన ఉత్పత్తి కారకములను సరియైన మార్గములో సమకూర్చి ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించి మరియు దానిలోని లోటుపాట్లను నవరించు వ్యక్తిని **వ్యవస్థాపకుడు** అందురు. వ్యవస్థాపకుని సమాజంలో మార్పును తీసుకువచ్చు ఒక కార్యకర్త అనవచ్చును.



ఒక సమావేశములో వ్యవస్థాపకుడు


## విధులు

1. లాభదాయకమైన పెట్టుబడి అవకాశములను కనుగొనుట.
2. ఉత్పత్తికి తగిన ప్రాంతమును నిర్ణయించుట.
3. క్రొత్త రూపకల్పనను చేయుట.
4. నష్టాలను భరించుట.
5. అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనుట.

## ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగములు

మానవుని యొక్క వివిధ రకములైన వృత్తులను మూడు విభాగములుగా విభజించవచ్చును. అవి **1. ప్రాథమిక రంగము. 2. ద్వితీయ రంగము 3. తృతీయ రంగము.** వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పొలములో పనిచేయుదురు. కర్మాగారములో కార్మికులు వస్తువులు తయారుచేయుదురు. వైద్యులు, ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు, రవాణా శాఖలో పనిచేయు కార్మికులు వారివారి పనులను నిర్వహింతురు.

ఆర్థిక కార్యకలాప చక్రములు ఈవిధముగా తిరుగుచున్నవి. ప్రాథమిక, ద్వితీయ మరియు తృతీయ రంగముల ద్వారా జరిగే వస్తువులు మరియు సేవల ప్రవాహాన్ని ఉత్పత్తి గొలుసు అని వర్ణింతురు.




## ప్రాథమిక రంగము

ప్రకృతి వనరులను ప్రాథమిక ఉత్పత్తులుగా మార్పుచేయుటను ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రాథమిక రంగము చేయుచున్నది. ఈ రంగము ముఖ్యముగా ఆహార ఉత్పత్తులు మరియు ముడి పదార్థముల ఉత్పత్తికి ప్రాముఖ్యత నిచ్చుచున్నందు వలన దీనిని ప్రాథమిక రంగమని అందురు. ఈ రంగము నుండి తయారుచేయబడిన అనేక వస్తువులు లేక ఉత్పత్తులు ఇతర కర్మాగారములందు ముడిపదార్థములుగా వినియోగించ బడుచున్నవి. ఈ రంగములోని ముఖ్య కార్యకలాపములు ఏవనగా వ్యవసాయం, చేపలు పట్టుట, అటవీ సంపద సేకరణ, గనులను త్రవ్వుట, చలువ రాళ్ళు కత్తరించుట మొదలగునవి. మన భారతదేశమునందు ఎక్కువమంది ప్రజలు ఈ రంగములోనే పని చేయుచున్నారు. మిక్కిలి అభివృద్ధి చెందిన దేశములలో మిగిలివున్న మూలధనమును ఈ యొక్క ప్రాథమిక రంగములో ఉత్పత్తి కొరకు పెట్టుబడి పెట్టుచున్నారు. భారతదేశ ఆర్థిక విధానములో వ్యవసాయము అతిపెద్దదైన మరియు అత్యంత ప్రాముఖ్యమైన రంగముగా వున్నది.

## ద్వితీయ రంగము

ద్వితీయ రంగము, ప్రాథమిక రంగము ఉత్పత్తి యొక్క ముడి పదార్థములను వినియోగించి వాటిని ఉపయోకరమైన వినియోగ వస్తువులుగా మార్పు చేయుచున్నది.


ఈ రంగమునే ఉత్పత్తి రంగమని కూడా అందురు. ముడిపదార్థములు సంపూర్ణ వస్తువులుగా లేక అసంపూర్ణ వస్తు ఉత్పత్తిగా మార్పు చెందుచున్నది. ఈ రంగము భారీ వస్తు ఉత్పత్తులను తయారు చేయు పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలు మరియు కుటీర పరిశ్రమలన్నియు కలిపి ద్వితీయ రంగముగా ఏర్పడినది. ద్వితీయ రంగములో జరుగు కార్యకలాపములు ఏవనగా లోహములను కరిగించి శుభ్రపరచుట, వస్త్రముల ఉత్పత్తి రసాయనిక మరియు ఇంజనీరింగ్ పరిశ్రమలు, నౌకా నిర్మాణ పరిశ్రమలు మొదలగునవి.

## తృతీయ రంగము

ఆర్థిక వ్యవస్థలోని తృతీయ రంగమును సేవా రంగమందురు. ఈ రంగము సాధారణ ప్రజల నుండి వ్యాపార సంస్థల వరకు సేవలను అందించుచున్నది. ఈ రంగమునకు అనుబంధమైన కార్యకలాపములు జీవిత బీమా, బ్యాంకింగ్ సేవలు, ఆరోగ్య రక్షణ, రవాణా, సమాచార ప్రసారాలు, చిల్లర మరియు టోకు వ్యాపారము వినోద కార్యక్రమములు మొదలగునవి.

మనదేశములో ఈ సేవా రంగములలో చాలా ఎక్కువ ఉద్యోగ అవకాశములు వున్నవి. అనేక అభివృద్ధి చెందిన దేశములలో ఎక్కువ శాతము ఉద్యోగులు ఈ సేవా రంగముపైన ఆధారపడి యున్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రములలో 80% కంటే ఎక్కువ శ్రామిక శక్తి ఈ రంగములోనే పనిచేయుచున్నారు. తృతీయ రంగము ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో రోజురోజుకు ప్రాముఖ్యతను పెంచుకొని పోవుచున్నది.

## ఆర్థిక రంగ నిర్మాణము




ఈ విధముగా ఈ మూడు ఆర్థిక రంగములు ఒకదానిపై ఒకటి ఆధారపడియున్నవి.

## అభ్యాసం

### I) సరియైన సమాధానమును ఎన్నుకొనుము.

1. అర్థశాస్త్రము ఒక ____________ విజ్ఞానశాస్త్రము.
   ఎ) సాంఘిక　　బి) రాజకీయ　　సి) నైతిక
2. ఉత్పత్తి కారకములు ____________ రకములు.
   ఎ) రెండు　　బి) నాలుగు　　సి) ఐదు
3. శ్రమను ____________ నుంచి వేరు చేయలేము.
   ఎ) శ్రామికులు　　బి) లాభము　　సి) మూలధనము
4. సాధారణముగా మూల ధనమనగా ____________.
   ఎ) భవనములు　　బి) యంత్రములు　　సి) ద్రవ్యము
5. ఒక వ్యవస్థాపకుడు ఎల్లప్పుడు ____________ ను చేపట్టును.
   ఎ) క్రొత్త రూపకల్పన　　బి) సాంప్రదాయము　　సి) నష్టము
6. మూలధనమునకు యిచ్చు ప్రతిఫలమును ____________ అందురు.
   ఎ) భాటకము　　బి) వేతనము　　సి) వడ్డీ
7. విద్యపై పెట్టుబడిని ____________ మూలధనమని పిలుతురు.
   ఎ) భౌతిక　　బి) మానవ　　సి) ద్రవ్య
8. ఉత్పత్తి కారకమైన శ్రమకు యిచ్చు ప్రతిఫలాన్ని ____________ అందురు.
   ఎ) భాటకము　　బి) వేతనము　　సి) లాభము

9. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ____________ శాతము కన్నా ఎక్కువ శ్రామిక బలము తృతీయ రంగములో పనిచేయుచున్నారు.

ఎ) 60% బి) 40% సి) 80%

10. వ్యవసాయము ____________ రంగము క్రింద వర్గీకరించబడినది.

ఎ) ప్రాథమిక బి) ద్వితీయ సి) తృతీయ

**II) ఖాళీలను పూరింపుము.**

1. ఉత్పత్తి అనగా ____________ ను కల్పించునది.
2. కోరికలను సంతృప్తి పరచు శక్తిని ____________ అందురు.
3. ____________ మరియు ____________ ప్రాథమిక కారకములుగా పిలువబడుచున్నవి.
4. మూలధనము మరియు వ్యవస్థాపనము ____________ కారకములుగా పిలువబడుచున్నవి.
5. ____________ ఒక ప్రకృతి వరప్రసాదము.
6. శ్రామిక విభజన అను భావన ____________ చే ప్రవేశ పెట్టబడెను.
7. ____________ సమాజమును మార్చు ఒక కార్యకర్త.
8. ద్వితీయ రంగమును ____________ రంగమని కూడా పిలుతురు.
9. ఆర్థిక వ్యవస్థలోని తృతీయ రంగమును ____________ రంగము అందురు.
10. 'దేశముల సంపద స్వభావము మరియు దానికి కారణముల పరిశీలన' అను గ్రంథము ____________ చే రచించబడెను.

**III) క్లుప్తముగా సమాధానములిమ్ము.**

1. లియోనెల్ రాబిన్స్ అర్థశాస్త్రమును ఎట్లు నిర్వచించెను?
2. ఆర్థిక వ్యవస్థలోని మూడు రంగములేవి?
3. శ్రమ విభజన అనగానేమి?
4. మూలధనము రకములెన్ని? అవిఏవి?
5. ఉత్పత్తికారకములను తెలిపి వాటికి యిచ్చు ప్రతిఫలములను తెల్పుము.

**IV) ఈ క్రింది వాటికి ఒక పేరాలో సమాధానములిమ్ము.**

1. భూమి యొక్క లక్షణాలను వివరింపుము.
2. వ్యవస్థాపకుని యొక్క విధులను తెల్పుము.

**V) ఈక్రింది ప్రశ్నలకు విశదముగా సమాధానములిమ్ము.**

1. శ్రామిక విభజన యొక్క లాభనష్టములను తెల్పుము.
2. తృతీయ రంగమును గురించి వివరింపుము.

## రూపక నిర్ధారణ

1. వివిధ రకాల కార్మికులను తెలిపే చిత్రములను సేకరించి ఒక ఆల్బమ్‌ను తయారుచేయుము.
2. మీ ప్రాంతములోని వివిధ రకాల కార్మికులు మరియు వారి వేతనాలకు సంబంధించిన వివరాలను సేకరించుము.
3. నీకిష్టమైన ఏదేని ఒక బ్యాంకు నమూనాను తయారుచేయుము.
4. నీలో గల వివిధ నైపుణ్యములను తెలిపే జాబితాను రూపొందించుము.
5. నీవు చూసిన గ్రామీణ ప్రాంత ప్రజలు చేసే పనుల చిత్రాలను గీయుము.
6. మీ నగరములో గల బ్యాంకుల సంఖ్యను తెలియజేసే ఒక ప్రాజెక్టు నివేదికను రూపొందించుము.
7. తృతీయ రంగానికి అనుబంధమైన కార్యకలాపాలను తెలిపే ఒక చార్టును తయారుచేయుము.
8. ఒక వ్యాపారమును ప్రారంభించుటకు ఒక వ్యవస్థాపకుడు తీసుకోవలసిన చర్యలపై జాబితాను తయారుచేయుము.
9. వివిధ దేశాల కరెన్సీలపై ఒక జాబితాను రూపొందించుము.
10. శారీరక శ్రామికులు మరియు మానసిక శ్రామికుల చిత్రములను సేకరించుము.

# 2. పన్ను మరియు దాని యొక్క ముఖ్యత్వము

**అభ్యసన ఉద్దేశములు**


- ❖ పన్ను మరియు దాని రకములను విశదపరచుట.
- ❖ ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుకు గల భేదములు తెలుపుట.
- ❖ ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నుల పట్టికను తయారు చేయుట.
- ❖ పన్నును చెల్లించు ముఖ్యత్వమును అర్థము చేసుకొనుట.
- ❖ VAT, TDS, CENVAT మొదలగు శీర్షికలను విద్యార్థులు తెలుసుకొనుటను అపేక్షింపబడుచున్నది.

పన్ను అనునది కార్మికుల యొక్క ఆదాయము మరియు వ్యాపారములో వచ్చు లాభము పై ప్రభుత్వము విధించు ద్రవ్యము లేక కొన్ని వస్తువులు, సేవలు మరియు వస్తు మార్పిడీలకు సంబంధించిన ఖర్చులో చేర్చబడిన వెలను పన్ను అని పిలుతురు.

TAXO అను లాటిన్ పదముకు 'ధర' లేక 'వెల' అని అర్థము. పన్ను అనునది ప్రభుత్వము లేక ప్రభుత్వ సంబంధమైన శాఖచే విధించబడు ధర అగును. ఇది ప్రభుత్వము యొక్క వివిధ ఖర్చు పన్నును ప్రత్యక్షపన్ను మరియు పరోక్ష పన్ను అని రెండు ముఖ్య రకములుగా విభజింపవచ్చును.

పన్ను నాగరికత యొక్క "నిర్మాణ విభాగము" Building Block of Civilization అని పిలువబడుచున్నది. పన్ను పురాతన సుమేరియాలో ఒక సాంఘికరించబడిన మొదటి సమాజమగును. పన్ను పురాతన గ్రీకు మరియు రోము సామ్రాజ్యముల యొక్క ఒక ప్రధాన భాగముగా వుండినది. తమిళనాడు యొక్క ఉత్తర మేరూర్ శిలా శాసనములోను "పన్నువిధించుటను" గుఱించిన జ్ఞాపికలను గమనించవచ్చును.

ఇప్పుడు మనం రెండు ప్రధాన పన్నుల రకములు మరియు వాటి ముఖ్యత్వమును గూర్చిచర్చించెదము.




## I. ప్రత్యక్ష పన్ను :

ప్రజలు లేక సంస్థల యొక్క ఆదాయము మరియు సంపద (ఆస్తి) పై ఒక ప్రభుత్వము విధించుదానిని ప్రత్యక్ష పన్ను అందురు. పన్నును చెల్లించు సంస్థయే దానిని పూర్తిగా భరించవలయును. ప్రత్యక్ష పన్నును చెల్లించువారు కేంద్ర ప్రభుత్వమునకు ప్రత్యక్షముగా పన్నును చెల్లించుట వలన దీనిని ప్రత్యక్ష పన్ను అని పిలుతురు.

**ముఖ్యమైన ప్రత్యక్ష పన్నులు క్రింది పట్టికలో వున్నవి.**

### 1. ఆదాయపు పన్ను :

ఒక వ్యక్తి ఆదాయము పెద్ద సంస్థలు, పన్ను వినహాయింపుకు లోబడిన వ్యాపారము, పెట్టుబడులు మరియు ఆస్తి సంబంధమైన లాభముపై విధించబడు మూల్యమునే ఆదాయపు పన్ను అని అందురు.

**నీకు తెలుసునా?**

TDS అనగ – Tax Deduction at Source.

## 2. సంస్థాగత పన్ను :

ఒక కర్మాగారమునకు వచ్చు లాభముపై ప్రభుత్వము విధించు పన్నును సంస్థాగత పన్ను అని పిలువబడుచున్నది. భారతదేశములో పనిచేయు భారతీయ మరియు విదేశ సంస్థలు ఈ పన్నును చెల్లించవలయును. ఈ పన్ను ప్రభుత్వ ఆదాయములో ఒక ముఖ్య భాగమగును.

**నీకు తెలుసునా?**

మరణించిన వారి ఆస్తులపై కట్టబడు పన్ను ఎస్టేట్ పన్ను అగును. ఇది ప్రస్తుతము తొలగించబడినది.

## 3. బహుమతి పన్ను :

ఒక వ్యక్తి 50,000 వేలు రూపాయలకు పైబడి బహుమతిగా పొందినట్లయితే అతను తాను పొందిన బహుమతికి పన్ను చెల్లించవలయును దీనినే బహుమతి పన్ను అందురు. ఏదైననూ బంధువుల నుంచి పొందు ధనము, పెండ్లి కానుకలు మరియు వారసత్వ సంపదగా పొందు వస్తువులు మరియు ధనమునకు బహుమతి పన్ను చెల్లించువారికి వినహాయింపు కల్పించబడును.





## 4. ఆస్తి పన్ను:

ఆస్తి పన్ను అనునది ఒక సంవత్సర కాలమునకు స్థానిక పరిపాలనా విభాగములలో వుండు ఒక భూస్వామి చెల్లించు పన్ను. భూమి మరియు ఇంటి స్థల విక్రయ ఆస్తి, ఇల్లు, కార్యనిర్వాహక భవనము మరియు బాడుగకు యిచ్చు ఆస్తి మొదలయినవన్ని దీనిలో చేరును.

ఒక ఆస్తి యొక్క అమరిక, నిర్మాణము, వైశాల్యము మరియు భవనము మొదలైన వాటిని ఆదారము చేసుకొని పన్ను యొక్క శాతము నిర్ణయించబడును. వచ్చిన ఆదాయపు పన్ను ధనమును, పాఠశాలలు భవనములు, పరిశుభ్రతా సౌకర్యములు మొదలగు పునఃనిర్మాణాత్మక కార్యములకు ఈ ఆస్తి పన్ను ఉపయోగించబడుచున్నది. ఆస్తి పన్ను విధ్యుత్, త్రాగునీరు మరియు మురికి కాలువల నిర్వాహణకు కూడా వర్తించును.

## II. పరోక్ష పన్ను:

అహార, వ్యయ మరియు ప్రత్యేక హక్కులపై కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వములు విధించు పన్ను పరోక్ష పన్ను అగును. విక్రయ పన్ను, దిగుమతి పన్ను, ఎగుమతి పన్ను, వాణిజ్యపన్ను మొదలైనవి పరోక్ష పన్నులకు ఉదాహరణములగును. ఇది ఒక వ్యక్తి ఆదాయముపై ప్రత్యక్షముగా విధించబడనందువలన దీనిని పరోక్ష పన్ను అని పిలుతురు.



**1. విక్రయ పన్ను :**

చరా వస్తువులను ఒక దేశములోపల విక్రయించుటయో లేక కొనుగోలు చేయునపుడు విక్రయ పన్ను విధించబడును. ఇది ప్రస్తుతము మూల్య సంబంధమైన పన్ను VAT అని పిలువబడుచున్నది. మీ తల్లిదండ్రులు సంతలో కొనుగోలు చేసిన వస్తువుల పట్టికలో VAT అను పదమును మీరు చూచియున్నారా?




**2. సేవా పన్ను :**

సేవా పన్ను అనునది ప్రత్యేక సేవా మార్పిడీలు మరియు సేవా రంగములో పని చేయువారి పై కేంద్ర ప్రభుత్వము విధించు పన్ను అగును. అయితేసేవా పన్నును నిజముగా ఉపయోగదారులు మాత్రమే భరించవలసి యున్నది. ఇది పరోక్ష పన్నులో ఒకటిగా యున్నది. సేవా పన్నుకు సంబంధించిన ఆర్థిక చట్టము 1994 వ సంవత్సరములో అమలు చేయబడినది.

భారత దేశములో సేవా రంగములో సేవ చేయువారు ఈ పన్నును చెల్లించెదరు. కౌలు, అంతర్జాలము(Internet) రవాణా మొదలగు సేవలు దీనిలో చేర్చబడిన అంశములు.

**3. సుంకపు పన్ను :**

సుంకపు పన్ను ఒక దేశములో దిగుమతి చేయబడు వస్తువులపై విధించబడును. ఉదాహరణమునకు విదేశముల నుండి వస్తువులు దిగుమతి చేయునపుడు ఓడరేవులు, విమానాశ్రయముల ముఖ ద్వారా ప్రాంతములలో సుంకపు పన్ను చెల్లించబడును.

**4. దేశీయపన్ను :**

ఒక దేశములో ఉత్పత్తి చేయబడు వస్తువులపై ఆదేశములోనే విధించబడుపన్ను దేశీయ పన్ను అని పిలువబడును. దీనిని (CENVAT) అని కూడా పిలుతురు. నీవు సుంకపు పన్ను మరియు స్వదేశ పన్నుకు మధ్యగల భేదమును తెలుపగలవా?

**పన్ను చెల్లించుట యొక్క ప్రాముఖ్యత:**

మన మందరము ఏదో ఒక రూపములో ప్రభుత్వమునకు పన్ను చెల్లించుచున్నాము. ప్రభుత్వము అనేక రూపాలలో అంటే కేంద్ర, రాష్ట్ర, నగర పాలక మరియు స్థానిక స్వపరిపాలనా విభాగములలో పన్ను సేకరించబడుచున్నది. పన్ను చెల్లించు ప్రాముఖ్యతను ఈ క్రింద విధముగా తెలియపరచవచ్చును.

1. పన్ను అనునది ప్రభుత్వమునకు వచ్చు ఆదాయములో ఒక ముఖ్యమైన భాగమగును.
2. పన్ను చెల్లించుట మనందరి యొక్క ముఖ్యమైన ప్రాథమిక బాధ్యత అగును.
3. ప్రభుత్వము, భవనములు, రవాణా సంస్థలు, పాఠశాలలు, వైద్య శాలలు మొదలగు నిర్మాణముల అభివృద్ధికి పన్ను ఉపయోగపడుచున్నది.
4. అనేక సామాజిక సంక్షేమ పథకములకు కార్యరూపము దాల్చుట అనునది ప్రజల దగ్గర నుంచి సేకరించబడిన పన్నును ఆధారము చేసుకొని సాధ్యమగుచున్నది.
5. ప్రజల దగ్గర నుండి సేకరించబడిన పన్ను ఆధారముగానే రాబడి ఖర్చుల మదింపు లెక్క తయారు చేయబడి అమలు చేయబడుచున్నది.
6. పన్నుల నుంచి వచ్చు ఆదాయము అంతర్జాతీయ ఋణములను తిరిగి చెల్లించుటలో ముఖ్య పాత్ర వహించుచున్నది. మొత్తానికి పన్నుల చెల్లింపు ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులు రెండును జాతి నిర్మాణమునకు ఎంతో సహాయకారిగా వున్నవి.

## అభ్యాసము

**I. సరైన సమాధానములను ఎంచుకొనుము:**

1. భారత దేశములో నిర్వహించబడు కర్మాగారములు చెల్లించు పన్ను
   అ. ఆస్తి పన్ను   ఆ. సంస్థాగత పన్ను   ఇ.బహుమతి పన్ను   ఈ.సుంకపు పన్ను

2. ఒక వ్యక్తి ప్రభుత్వమునకు ప్రత్యక్షముగా చెల్లించు పన్ను
   అ.పరోక్ష పన్ను   ఆ.విక్రయ పన్ను   ఇ.ప్రత్యక్షపన్ను   ఈ.సేవాపన్ను

3. ఈ క్రింది వానిలో ఏది పరోక్ష పన్ను అగును.
   అ.సేవా పన్ను   ఆ.ఆదాయ పన్ను   ఇ.సంస్థాగతపన్ను   ఈ.బహుమతి పన్ను

4. ఈ క్రింది వానిలో ఏది ప్రత్యక్ష పన్ను?
   అ.బహుమతి పన్ను   ఆ.సుంకపు పన్ను   ఇ.సేవాపన్ను   ఈ.విక్రయ పన్ను

5. స్వదేశములో ఉత్పత్తి అయిన వస్తువులపై విదించబడుపన్ను.
   అ.విక్రయ పన్ను   ఆ.సేవాపన్ను   ఇ.సుంకపు పన్ను   ఈ.దేశియ పన్ను

**II. క్రింది ఖాళీలను పూరింపుము**

1. ____________ అనునది ప్రభుత్వమునకు మనము చెల్లించు ధనమగును.
2. ప్రభుత్వముచే నిర్దేశించబడిన పన్ను పరిమితి వినహాయింపునకు పై ఆదాయము వున్నవారు చెల్లించునది ____________ పన్ను అగును.
3. చరాస్థులు ఒక దేశములో విక్రయించుట లేక కొనునప్పుడు ____________ పన్ను విధించబడును.

**III. ఈ క్రింది ప్రశ్నలకు క్లుప్తముగా సమాధానము లిమ్ము.**

1. పన్నులోని రెండు ముఖ్య రకములేవి?
2. పరోక్ష పన్ను రకముల పట్టికను తయారు చేయుము.
3. విక్రయ పన్ను మరియు సేవా పన్నుకు మధ్యగల భేదమును తెల్పుము.
4. VAT అనగానేమి?

**IV. ఈ క్రింది ప్రశ్నలకు విపులముగా సమాధానము లిమ్ము.**

1. పన్ను చెల్లించుట యొక్క ఐదు ముఖ్య ప్రాముఖ్యతలను తెల్పుము.
2. ప్రత్యక్ష పన్ను రకములను విశదీకరించుము.

## రూపక నిర్ధారణ

1. ఈ క్రింది వానిని ఒక చార్టులో తయారు చేసి మరియు తరగతిలో తోటి విద్యార్థులతో సమీక్షించుము.
   ఎ. ప్రభుత్వము చేత నిర్దేశించబడిన ఒక వ్యక్తి ఆదాయపన్ను మినహాయింపు పరిమితి.
   బి. VAT యొక్క శాతము.
   సి. దిగుమతి వస్తువులపై పన్ను మినహాయింపుకుగాను తక్కువ శాత ధర.

2. భారతదేశములో పని చేయు ఐదు పెద్ద కర్మాగారములను తెలిపి వాటి యొక్క సంవత్సర ఆదాయము మరియు వారు చెల్లించు పన్ను శాతమును తెలుసుకొనుము.

# ‘నేను చేస్తా, నేను చేశా’

('I can, I did')

## విద్యార్థుల అభ్యసన కృత్యాల నమోదు పట్టిక

విషయం :

| వ.సం | తేది | పాఠ్యాంశ సంఖ్య | పాఠ్యభాగం | కృత్యాలు | అభిప్రాయ సూచన |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |